
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 203

శుక్రవారం 13-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సఫారీ దెబ్బకు 'కంగారు'

డికాక్ సెంచరీ. ప్రపంచకప్‌లో ఆసీస్‌కు వరుసగా రెండో ఓటమి -15లో



చలికాలంలో భగభగలు

సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు -16లో



భారత్ స్వరం బలపడుతోంది

సవాళ్లతో నిండిన ప్రపంచంలో భారత్ వాణి మరింత బలపడిందని ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లో జరిగిన సభలో చెప్పారు.

వివరాలు 6లో ▸



శిశువు ప్రాణాలు తీయలేం

26 వారాల గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి అనుమతివ్వాలన్న ఓ వివాహిత పిటిషన్‌పై సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸



ఆకలి సూచీలో 111వ స్థానం

125 దేశాల జాబితాతో కూడిన ప్రపంచ ఆహార సూచీ–2023లో భారత్ 111వ స్థానంలో నిలిచింది.

వివరాలు 6లో ▸



వైష్ణోదేవి ఆలయంలో పూజలు

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రఖ్యాత వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

వివరాలు 6లో ▸

జంగ్ తెలంగాణ

చూపుడు వేలుపై... చుక్కాని..

శాసనసభ ఎన్నికల్లో నవ, యువ ఓటర్ల పాత్ర నిర్ణయాత్మకం

ఉద్యమం నుంచి నేషనల్ హైవే పైకి

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంతో మొదలైన టీఆర్ఎస్ ప్రస్థానం

జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీకి 'బీఆర్ఎస్'గా...

రాజస్తాన్‌లో స్వింగ్ ఎటు ?

గత దశాబ్ద కాలంలో స్వింగ్ స్థానాల్లో ఏ పార్టీకి ఎలా ఉంది ?

- వివరాలు 7,8 పేజీల్లో

బీసీ రూట్లో బీజేపీ!

కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్న కాషాయ దళం

- 'బీజేపీ జెండా.. బీసీలకు అండ' నినాదంతో ముందుకు
- అసెంబ్లీ టికెట్లలో బీసీలకు 40కుపైగా కేటాయించే యోచన
- పార్టీలో సంస్థాగతంగా కూడా ఆ వర్గాలకు పెద్దపీట
- అన్నీ కలిసొస్తే సీఎం పీఠమూ బీసీలకే అంటున్న పార్టీ వర్గాలు
- ప్రధాని మోదీ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ బీసీలేనన్నది ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ బీసీలను పట్టించుకోవడం లేదంటూ ఎండగట్టే వ్యూహం

ప్రధాని కూడా బీసీ అంటూ..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'బీజేపీ జెండా.. బీసీలకు అండ' నినాదంతో ముందుకెళ్లాలని బీజేపీ యోచిస్తోంది. బీసీ అయిన నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్నారని.. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, గతంలో కర్ణాటక సీఎంగా పనిచేసిన బీఎస్ యడ్యూరప్ప తదితరులు వెనుకబడిన వర్గాల వారేనని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. రాష్ట్ర పార్టీలోనూ బీసీ నేతలకు కీలక పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రస్తావిస్తూ బీసీలకు అండగా నిలిచేది, అవకాశాలు ఇచ్చేది బీజేపీనే అన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు వివరిస్తున్నారు. బీసీల ఓటును కూడగట్టడం ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తాయని అంచనా వేస్తున్నారు.

- వివరాలు 2లో

85 సీట్లతో అధికారం మాదే



- పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది
- హంగ్ వస్తుందని బీఎల్ సంతోష్ చెప్పలేదు
- కేసీఆర్ సర్కార్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు విస్మరించి విశ్వాస ఘాతుకానికి పాల్పడింది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని స్పష్టమైంది
- రాహుల్ జేఎన్‌యూ గాంధీ .. లెఫ్టిస్టుల భాష మాట్లాడుతున్నారు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ 2 లో

కేసీఆర్‌పై పోటీ చేస్తా: ఈటల

హుజూరాబాద్ బరిలో కూడా ఉంటానని ప్రకటన.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాదని వ్యాఖ్య

బెల్టుషాపులు రద్దు చేస్తాం

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటన

- కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, వన్నె ఈశ్వరప్ప - 2లో

ఒక్క నియోజకవర్గాన్నీ వదలకుండా..

భారీగా ప్రచార కార్యక్రమాలకు బీఆర్ఎస్ ప్లాన్



- 80 నుంచి 90 నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ సభలు
- 60కిపైగా సెగ్మెంట్లలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌లతో రోడ్ షోలు.. ఎక్కడికక్కడ అభ్యర్థులు, కీలక నేతలతో ప్రచార సభలు, ర్యాలీలు
- సభలు, రోడ్ షోలకు భారీ జనసమీకరణకు నిర్ణయం
- విపక్షాల్లో టికెట్లు దక్కని నేతలపై 'ఆపరేషన్ ఆకర్ష్'
- ప్రగతి భవన్‌లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సమావేశం
- 54 నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జుల నియామకం
- కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద సంఖ్యలో అధికారులను తప్పించడంపై చర్చ.. నర్సాపూర్ ప్రతిష్టంభన తొలగించాలని హరీశ్‌కు ఆదేశం

సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో దూకుడుగా ముందుకెళ్తున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రచార వ్యూహానికి మరింత పదును పెడుతోంది. వరుసగా పెద్ద సంఖ్యలో బహిరంగ సభలు, రోడ్ షోలు, స్థానికంగా అభ్యర్థులు పాల్గొనే ప్రచార సభలతో.. ఏ నియోజకవర్గాన్ని, వాటి పరిధిలోని గ్రామాలను వదలకుండా 'కార్పెట్ బాంబింగ్'ను తలపించేలా 'కార్పెట్ కాన్వాసింగ్ (ప్రచారం)' నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి కార్యక్రమానికి భారీగా జన సమీకరణ చేయాలని, ప్రతిపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేసేలా వ్యూహాలను అమలు చేయాలని ఆలోచనకు వచ్చింది. దీనికి సంబంధించి బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గురువారం ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి తన్నీరు హరీశ్ రావులతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఎన్నికల ప్రచారం, జన సమీకరణ, ఇతర పార్టీల నుంచి చేరికలు, పార్టీ నేతల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. పార్టీ అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పలువురు కీలక అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన

మిగతా 5వ పేజీలో ▶

కామారెడ్డికి కేటీఆర్.. గజ్వేల్‌కు హరీశ్.. 5 లో

సర్కారు బడుల్లో సిలబస్ తంటాలు



ప్రభుత్వ బడుల్లో సిలబస్ పూర్తవ్వకపోవడం విద్యాశాఖలో సరికొత్త వివాదానికి దారితీస్తోంది. దీనికి పాఠశాల హెచ్‌ఎంలు, సంబంధిత టీచర్లను బాధ్యులను చేయాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ భావించడం కొత్త సమస్యను సృష్టిస్తోంది. - వివరాలు 3లో▶



0000568749-000001-Poultry 3.00X5.00 Breeders CoordinationAssoci

Breeder Poultry

సూచించిన నేటి గుడ్డు & చికెన్ కరీంనగర్ జోన్ ధరలు

గుడ్డు రిటైల్ ధర ₹ 66 డజన్	ఫారం దగ్గర లైవ్ బర్డ్	119	డ్రెస్డ్ స్కిన్‌తో	204	
	రిటైల్ లైవ్ బర్డ్	141	స్కిన్‌లెస్	233	

ఇలాగైతే ఎలా?

ఈసీ ఆదేశాలతో బదిలీ అయిన 20 మంది అధికారుల విస్మయం



- ఐఏఎస్, ఐపీఎస్‌లపై కొరడాతో తీవ్ర ప్రకంపనలు
- నిర్లక్ష్యం, నిర్లిప్తత, నిబంధనల అతిక్రమణ సహించమని ఈసీ సందేశాలు
- తీవ్ర విస్మయంలో బదిలీకి గురైన అధికారులు
- కెరీర్‌లో రిమార్కుగా మిగిలిపోతుందని కొందరి ఆక్రోశం
- తన బదిలీపై 'ఎక్స్'వేదికగా ఐఏఎస్ అధికారి టీకే శ్రీదేవి ప్రశ్నలు
- బదిలీకి గురైన వారి స్థానంలో కొత్తవారి నియామకానికి కసరత్తు షురూ
- ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారులను ప్రతిపాదించిన సర్కారు
- సోమవారంలోగా ఈసీ నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి రెండు రోజులు గడవక ముందే కేంద్ర ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించి ఏకంగా 20 మంది అధికారులపై బదిలీ వేటు వేయడంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఈ నెల 9న ఎన్నికల షెడ్యూల్ రాగా, 11న ఈసీ తీవ్ర చర్యలకు ఉపక్రమించడం అధికార, రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే అధికారులతో ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న జట్టును విచ్ఛిన్నం చేయాలన్న లక్ష్యంతోనే ఈసీ పెద్ద ఎత్తున బదిలీలకు ఆదేశించినట్టు చర్చ జరుగుతోంది. ఈ నెల 3 నుంచి 5 వరకు రాష్ట్రంలో మూడు రోజులపాటు జరిపిన పర్యటనలో తమ పరిశీలనలోకి వచ్చిన అంశాలు, విపక్ష పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా చాలా మంది యువ ఐపీఎస్ అధికారులకు జిల్లా ఎస్పీలుగా పోస్టింగ్‌లు ఇవ్వకుండా, నాన్ కేడర్(ఐపీఎస్ కాని) అధికారులను ఎస్పీలుగా నియమించడం పట్ల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో ఈసీ అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. బదిలీకి గురైన 10 జిల్లాల ఎస్పీల్లో 9 మంది నాన్‌కేడర్ ఎస్పీలే ఉండడం దీనికి నిదర్శనమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కెరీర్‌లో రిమార్కేనా?

ఇక ఆకస్మిక బదిలీకి గురైన కొందరు అధికారులు తీవ్ర విస్మయం మిగతా 12వ పేజీలో ▶



పులిని ఎలా బంధించాలో మాకు తెలుసు

దళితబంధు నిధులు ఏమయ్యాయో చెప్పాలి

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

మధిర: అనారోగ్యంతో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి పులి బయటకు వస్తోందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, అయితే ఆ పులిని బంధించి రాష్ట్ర ప్రజలు, ఆస్తులను ఎలా కాపాడుకోవాలో కాంగ్రెస్ పార్టీకి తెలుసని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అమలుకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,700 కోట్ల నిధులు ఏమయ్యాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ బంధు, గృహలక్ష్మి, రుణమాఫీ, దళితబంధు వంటి ఏ పథకాన్నీ సంపూర్ణంగా అమలు చేయని బీఆర్ఎస్‌కు మళ్లీ ఎందుకు ఓటు వేయాలో కేసీఆర్, కేటీఆర్ చెప్పాలని భట్టి అన్నారు. బ్యాంకు ఖాతాలో రుణమాఫీ నగదు జమ చేయకుండానే అయినట్లు మెసేజీలు పంపిస్తూ ప్రజలను మోసం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇలాంటి మోసాల ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.



నేడు సగానికి పైగా అభ్యర్థుల ఖరారు!

- ఢిల్లీలో భేటీ అవుతున్న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ
- మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరగనున్న సమావేశం
- 15 తర్వాత ఏ క్షణమైనా కాంగ్రెస్ తొలి జాబితా

- వివరాలు 2లో



పట్టుకున్న నగదు, వస్తువులు రూ. 37 కోట్లకు పైనే!

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు
- రూ.20 కోట్లకుపైగా నగదు, రూ. 14 కోట్లకుపైగా బంగారం, వజ్రాలు స్వాధీనం
- మరో రూ. మూడు కోట్లకుపైగా ఇతర వస్తువులు పట్టివేత
- రూల్స్ తప్పిన వారిపై కేసులు నమోదు: ఎన్నికల కమిషన్


3 లో

ఎన్నికల తనిఖీల్లో భాగంగా గురువారం స్వాధీనం చేసుకున్న నగదును విలేకరుల సమావేశంలో చూపుతున్న మేడిపల్లి పోలీసులు

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

ఆయనపై పీటీ వారంట్ జారీకి న్యాయస్థానం అనుమతి

- 16న విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టాలని ఆదేశం
- వివాదాస్పదంగా ప్రవర్తించిన టీడీపీ న్యాయవాదులు
- ప్రత్యేక పీపీ వివేకానందపై దాడికి యత్నించిన టీడీపీ న్యాయవాదులు
- అరుపులతో దద్దరిల్లిన న్యాయస్థానం
- టీడీపీ న్యాయవాదుల తీరుపై న్యాయాధికారి తీవ్ర ఆగ్రహం
- ఇలా అయితే కేసు విచారించలేనని బెంచ్ దిగి వెళ్లిపోయిన జడ్జి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణంలో నిందితుడు చంద్రబాబుకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనపై పీటీ వారంట్ జారీచేసేందుకు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతించింది. చంద్రబాబును సోమవారం విజయవాడ కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అరెస్ట్ అయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్న ఆయన్ని ఆ కేసుల్లో వేర్వేరుగా అరెస్ట్ చేసి విచారించేందుకు అనుమతించాలని కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పీటీ వారంట్ పిటిషన్లు దాఖలు చేసింది. ఫైబర్‌నెట్ కుంభకోణంలో

మిగతా 12వ పేజీలో ▶



ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడ్డ చిన్నారికి గాజాలోని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న దృశ్యం

గాజాపై భూతల యుద్ధం!

- హమాస్ మిలిటెంట్లను నిర్మూలించడమే లక్ష్యం
- సన్నాహాలు ప్రారంభించిన ఇజ్రాయెల్ సైన్యం
- 3.60 లక్షల మంది రిజర్వ్ సైనికులు సిద్ధం
- గాజాను ఆక్రమించుకొనే యోచన
- ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు ఉధృతం
- యుద్ధంలో 2,600కు చేరిన మృతుల సంఖ్య

6 లో

230 మందితో భారత్‌కు విమానం

ఇజ్రాయెల్‌లోని భారతీయులను వెనక్కి తెచ్చేందుకు 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం

యూదులకు అత్యంత ఘోరమైన రోజు

- హమాస్ దాడులను క్రూర చర్యగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్
- యుద్ధ నిబంధనల ప్రకారమే ఇజ్రాయెల్ అడుగులేస్తోందని వ్యాఖ్య

హమాస్‌ను నలిపేస్తాం

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ స్పష్టీకరణ

- వివరాలు 6లో



క్లుప్తంగా...

నేడు సగానికి పైగా అభ్యర్థుల ఖరారు!

ఢిల్లీలో భేటీ అవుతున్న కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) శుక్రవారం భేటీ కానుంది. చైర్మన్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో పాటు కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్ అభ్యర్థుల ఎంపికపై కూడా ఈ భేటీలో చర్చించనున్నారు. మురళీధరన్ నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ ఇప్పటికే 70కి పైగా స్థానాల్లో సింగిల్ పేరును, మరో 30 స్థానాల్లో రెండేసి పేర్లను సీఈసీకి పంపింది. ఈ పేర్లపై సీఈసీ చర్చించి ఆమోదం తెలపనుంది. రెండేసి పేర్లున్న చోట పార్టీ పెద్దలు కొన్ని మార్గదర్శకాలు సూచించనున్నారు. ఈ నెల 15 లేదా 16వ తేదీన తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉంది.

ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ చేరుస్తాం

బెల్టు షాపులను రద్దు చేస్తాం: దుద్దిళ్ల



ముత్తారం(మంథని): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో బెల్టు షాపులను బంద్ చేస్తామని మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మచ్చుపేటలో బహిరంగ సభలో మాట్లాడారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ చేరుస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని, గ్రామీణ నిరుపేద యువతకు స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెడతామ, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రైతుకు భరోసాగా వరికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. భూమి లేని పేదలకు రూ.12 వేలు, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం తదితర పథకాలు అమలు చేస్తామని చెప్పారు.

ఒంటరిగా 119 స్థానాల్లో వైఎస్సార్‌టీపీ పోటీ

పాలేరుతోపాటు మరో సెగ్మెంట్‌లో నిలబడతా: షర్మిల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒంటరిగానే పోటీ చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెల్లడించారు. గురువారం ఇక్కడి లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను పాలేరుతోపాటు మరో సెగ్మెంట్ నుంచి పోటీ చేస్తానని చెప్పారు. అవసరమైతే తన తల్లి విజయలక్ష్మి, బ్రదర్ అనిల్ కూడా ఎన్నికల్లో నిలబడతారని తెలిపారు. వైఎస్సార్‌టీపీ తర పున పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని షర్మిల సూచించారు.

వైఎస్సార్‌టీపీకి 'గుర్తు' రాలేదు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో తమ పార్టీకి టార్చ్‌లైట్ గుర్తు కేటాయించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ చేసిన అభ్యర్థనను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్, విరాళాల నివేదికలు సమర్పించకపోవడం, గత ఆగస్టులో ఎన్నికల గుర్తు కోసం దరఖాస్తు చేసుకునే నాటికి 2022–23కి సంబంధించిన ఆడిట్, విరాళాల నివేదికను అందించకపోవడం వంటి కారణాలతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఎన్నికల గుర్తు కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత 2022–23కి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించగా, ఈసీఐ పరిగణనలోకి తీసుకోలేదు.

బీ కేర్‌ఫుల్..

ఎన్నికలపై స్వచ్ఛంద సంస్థల నిఘా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నికల నిర్వహణపై సీరియస్‌గా దృష్టి సారించాయి. అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా ఒత్తిడి తెచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఒకవైపు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తూనే మరోవైపు రాజకీయ పార్టీల్లో ఎన్నికల నిబంధనల పట్ల అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు తెలిపారు. ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయనున్నారు. ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) నేతృత్వంలో సుమారు 25 స్వచ్ఛంద సంస్థలు అభ్యర్థులపై దృష్టి సారించనున్నాయి. నేర చరితులు ఎన్నికల్లో పోటీ చేయకుండా గట్టిగా నిరోధించడంతో పాటు, ఓటర్లకు డబ్బులు, మద్యం, బహుమతులు వంటివి పంపిణీ చేయకుండా నిఘాను తీవ్రతరం చేయనున్నారు. రాజకీయ పార్టీలు చేసే తప్పులను, ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేయనున్నారు.

బీసీ రూట్లో బీజేపీ!

కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్న కాషాయ దళం

- వెనుకబడిన వర్గాలను ఆకర్షించేలా ఎజెండా రూపకల్పన
- 'బీజేపీ జెండా.. బీసీలకు అండ' నినాదంతో ముందుకు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ రూట్‌లో ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యమిస్తూ కొత్త ప్రయోగానికి దారులు వేస్తోంది. బీసీలకు ఎక్కువ టికెట్లు ఇవ్వడం, అధికారంలో తగిన వాటా, గుర్తింపుతోపాటు అన్ని కలసి వస్తే ముఖ్యమంత్రి పీఠంపై కూడా ఆ వర్గాలకు చెందిన వారినే కూర్చోబెట్టాలని భావిస్తున్నట్టు బీజేపీ వర్గాల విశ్వసనీయ సమాచారం. అయితే ముందుగానే సీఎం అభ్యర్థిని ప్రకటించే సంప్రదాయం బీజేపీలో లేకపోవడంతో.. ఎన్నికల సమరం ముగిసేదాకా బీసీ సీఎంను ప్రకటించడం జరగకపోవచ్చని ఆ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను.. ఎస్సీ 19, ఎస్టీ 12 రిజర్వ్‌డ్ సీట్లు పోగా, మిగతా 88 సీట్లలో 40కిపైగా సీట్లను బీసీలకు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు వివరిస్తున్నాయి.

వెనుకబడిన వర్గాలను ఆకర్షించేలా..

రాష్ట్ర జనాభాలో 50శాతానికిపైగా బీసీలు ఉండటంతోపాటు ఎస్సీ, ఎస్టీలనూ కలిపితే 85శాతానికి పైగా వెనుకబడిన వర్గాల వారే ఉన్నారని బీజేపీ నేతలు చెప్తున్నారు. ఆ వర్గాల ఓట్లను సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని పార్టీ పెద్దలు నిర్ణయించారని వివరిస్తున్నారు. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్షం కాంగ్రెస్ రెండూ అగ్రవర్ణాల ఆధిపత్యంలోనే ఉన్నాయని.. వాటిలో ఏది అధికారంలోకి వచ్చినా బీసీలకు ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. వారు బీసీని సీఎం చేయడం కాదుగదా.. కేబినెట్‌లోనూ తగిన అవకాశాలు కల్పించడం కష్టమేనని చెప్తున్నారు. ఆ పార్టీలు ఇటు రాష్ట్రస్థాయిలో, అటు జాతీయ స్థాయిలో ఎక్కడా బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని పేర్కొంటున్నారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచాక టీఆర్‌ఎస్ కేబినెట్లలో బీసీవర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించిన దాఖలాలు లేవని.. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో తగిన వాటా కల్పించలేదని విమర్శిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కల్పన, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర పథకాలు సరిగా అమలు కాలేదని.. బీసీ బంధు అమలు కూడా నామమాత్రమేనని స్పష్టం చేస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు వివరించేలా ప్రచారం చేపట్టాలని పార్టీ పెద్దలు నిర్ణయించారని చెప్తున్నారు. బీసీలలో బీజేపీ పట్ల విశ్వాసాన్ని కల్పించేలా అసెంబ్లీ ఎన్నికల్లో 40కిపైగా సీట్లు కేటాయించాలని నిర్ణయానికి వచ్చారని వివరిస్తున్నారు.

బీసీ నేతలను ముందు నిలిపి..

ఇప్పటికే రాష్ట్రంలో బీసీలను ఆకట్టుకునేందుకు వివిధ కార్యక్రమాల నిర్వహణను లక్ష్మణ్, సంజయ్, ఈటల తదితరులకు బీజేపీ అప్పగించింది. ఆయా కుల సంఘాలు, వర్గాల వారీగా పార్టీ సదస్సులు, సమ్మేళనాలను నిర్వహిస్తోంది. ఇప్పుడు బీసీ నేతలను ముందు నిలిపి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. బీసీ వర్గాలకు జరిగిన అన్యాయం, వారు నిర్లక్ష్యానికి గురైన తీరును గణాంకాలతో సహా ప్రజలకు వివరించాలని.. ఇదే సమయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలు, సంక్షేమ కార్యక్రమాలను భావిస్తోంది.

జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అవకాశాలు వివరిస్తూ..

బీసీల కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో బీజేపీ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. స్వయంగా బీసీ అయిన ప్రధాని మోదీ సారథ్యంలో.. కేంద్ర కేబినెట్‌లో 27 మంది బీసీలకు ప్రాతినిధ్యం, దేశవ్యాప్తంగా ఉన్న ఎంబీసీల కోసం జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటు.. చేతివృత్తులు, కులవృత్తులపై ఆధారపడిన ఎంబీసీల కోసం పీఎం విశ్వకర్మయోజన పథకం, కులవృత్తుల వారికి నైపుణ్య శిక్షణ, సదుపాయాల కల్పన వంటివి చేపట్టినట్టు బీజేపీ నేతలు చెప్తున్నారు. ఈ చర్యల ద్వారా జాతీయ స్థాయిలో బీసీల మద్దతు కూడగట్టగలిగామని.. తెలంగాణలోనూ ఈ ఎజెండాతో ముందుకు తీసుకెళ్లాలని నాయకత్వం నిర్ణయించిందని వివరిస్తున్నారు. ఇక రాష్ట్ర పార్టీలోనూ బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తున్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా, రాజ్యసభ ఎంపీగా కె.లక్ష్మణ్‌కు అవకాశం కల్పించడం, రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ నియామకం, అధ్యక్ష పదవి మార్పు తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన ఈటల రాజేందర్‌కు పార్టీ చేరికల కమిటీ కన్వీనర్, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియామకం, ఎంపీగా ధర్మపురి అర్వింద్‌కు అవకాశం వంటి వాటిని వివరిస్తున్నారు.

కేసీఆర్‌పై పోటీ చేస్తా!

- హుజూరాబాద్ బరిలో కూడా ఉంటా..
- రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాదు
- 16న హుజూరాబాద్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాక
- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హుజూరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంతోపాటు.. అక్కడ కూడా పోటీ చేస్తానని (పరోక్షంగా సీఎం కేసీఆర్‌పై) బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తనను హుజూరాబాద్‌లో గెలిపించేందుకు కథానాయకులుగా మారి బీజేపీ శ్రేణులు పనిచేయాలని కోరారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నియోజకవర్గ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 'నేను ఆరు ఫీట్ల హైట్ లేకపోవచ్చు, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రాకపోవచ్చుగానీ ప్రజల బాధలు తీర్చేవాడిని..'అని ఈటల అన్నారు. కొత్త రాష్ట్రంలో మంచి రాజకీయ వాతావరణాన్ని పాడుచేసిన దుర్మార్గపు పార్టీ.. భారత్ రాష్ట్ర సమితి అని ఆరోపించారు. 'హుజూరాబాద్‌లో హోదా ఉన్నవాడితో కొట్లాడతాంగానీ సైకోతో ఏం కొట్లాడుతాం.. పొలిటికల్ లీడర్ పొలిటికల్‌గా కొట్లాడాలి..'అన్నారు. ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ చేతిలో ఉంటుందని, మొన్నటితో వారి పీడ విరగడైందని పేర్కొన్నారు. 'కొట్టడం చేతకాక కాదు.. కార్యకర్తలు కేసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగాను. కొట్లాట నా సంస్కృతి కాదు. ఎందుకంటే నేను పొలిటికల్ లీడర్‌ను. గూండాను కాదు. రౌడీని కాదు'అని అన్నారు. కొంతమంది చిల్లరగాళ్లు తను కేసీఆర్ కోవర్టు అని ఇంకా మాట్లాడుతుంటే బాధగా ఉందన్నారు. కేసీఆర్ వల్ల నరకం అంటే ఏమిటో సంపూర్ణంగా అనుభవించిన వాడినని తెలిపారు. తన శక్తిని మొత్తం బీఆర్‌ఎస్ ఓటమికి వినియోగిస్తానన్నారు. ఏ పోలీస్ ఆఫీసర్ అయినా బెదిరిస్తే చమడాలు తీస్తాం.. జాగ్రత్త.. అని చెప్పాలంటూ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అధికారులు పిచ్చి పనులు చేసినా.. పక్షపాతంతో వ్యవహరించినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తన వాళ్ల మీద చెయ్యి పడినా అంతు చూసే వరకూ వదిలిపెట్టేది లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాదన్నారు. ఈనెల 16న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్‌కు రాబోతున్నారని, సభను గొప్పగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

85 సీట్లతో అధికారం మాదే

పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది

- హంగ్ వస్తుందని బీఎల్ సంతోష్ చెప్పలేదు
- కేసీఆర్ సర్కార్ తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు విస్మరించి విశ్వాస ఘాతుకానికి పాల్పడింది
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అన్న విషయం స్పష్టమైంది
- రాహుల్ జేఎన్‌యూ గాంధీ .. లెఫ్టిస్టుల భాష మాట్లాడుతున్నారు
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్



సాక్షి, హైదరాబాద్: వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 85 సీట్ల దాకా గెలుపొంది బీజేపీ పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ మెజారిటీ సీట్లు గెలుచుకుని బీజేపీ సంచలనం సృష్టించబోతోందన్నారు. రాబోయే 50, 55 రోజుల్లో ఇది వాస్తవరూపం దాల్చడాన్ని అందరూ చూస్తారని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, త్యాగాలను కేసీఆర్ సర్కార్ విస్మరించి విశ్వాస ఘాతుకానికి పాల్పడిందని మండిపడ్డారు. సకల జనులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అవినీతి మయం చేయడంతో పాటు, పూర్తిగా కుటుంబ స్వామ్యంగా మార్చివేయడాన్ని ఇక్కడి ప్రజలు అస్సలు ఊహించలేదన్నారు. మరోవైపు కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్ సరిగా లేదని, తెలంగాణ ఏర్పడ్డాక మండలి చైర్మన్‌తో సహా ఎమ్మెల్సీలందరూ టీఆర్‌ఎస్‌లో విలీనం కావడం, 2014లో ఆరుగురు ఎమ్మెల్యేలు, 2018లో 12 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీలో చేరడం ద్వారా ఆ రెండు పార్టీలూ ఒక్కటే అన్న విషయం స్పష్టమైందని చెప్పారు. దీనికి పూర్తి భిన్నంగా బీజేపీ ఎమ్మెల్యేలెవరూ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లలేదని, ఇతర పార్టీల్లోంచే బీజేపీలోకి వస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని గతంలో కాంగ్రెస్, ఇప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు నిర్వహించకపోవడం గర్హనీయమన్నారు. ఈ విషయంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, బీజేపీ ప్రభుత్వం ఏర్పడితేనే తమకు న్యాయం జరుగుతుందని వారు నమ్ముతున్నారని చెప్పారు. జవదేకర్ గురువారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

వైఎస్ విజయం సాధిస్తారని ముందే చెప్పా

2004 ఎన్నికలకు ముందు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వహించిన పాదయాత్రను, దానికి వచ్చిన స్పందనను నేను స్వయంగా గమనించా. అప్పటి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం ఓడిపోయి రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పా. నేను చెప్పినట్టే ఆయన అధికారంలోకి వచ్చారు. అదే విధంగా ఇప్పుడు కూడా వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ ఓడిపోయి బీజేపీ అధికారంలోకి వస్తుందనే నా జోస్యం నిజం అవుతుంది.

అది పూర్తిగా అబద్ధం

బీఎల్ సంతోష్ రాష్ట్రంలో హంగ్ ఏర్పడుతుందని అన్నారన్నది పూర్తిగా అబద్ధం. ఈ వార్త మీడియాలో వచ్చాక కూడా దానిని ఖండించకపోవడంపై నేను పార్టీ అధికార ప్రతినిధులను మందలించా. తెలంగాణలో బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావడం తథ్యమని ఆ అంతర్గత సమావేశంలో సంతోష్ చెప్పారు. అయితే హంగ్ అని అన్నట్టుగా వార్త వచ్చినందుకు నేను జర్నలిస్టులను కూడా తప్పుబట్టను. ఎందుకంటే ఇందుకు సంబంధించి ఎలాంటి వీడియో, ఆడియో రికార్డ్ లేదు.

ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు

కాంగ్రెస్‌లో ప్రస్తుతం అంతర్గత పోరు తీవ్ర స్థాయిలో సాగుతోంది. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అందువల్ల అది అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు. కర్ణాటకలో గెలుపు ఇక్కడ ఏమాత్రం ప్రభావం చూపే అవకాశం లేదు. కానీ కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చే అవకాశముంది. అయితే కాంగ్రెస్ తమను మోసం చేసిందనే భావనలో ఉన్న తెలంగాణ ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పబోతున్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ వేరు, రాహుల్‌గాంధీ కాంగ్రెస్ వేరు. కాంగ్రెస్ నేత రాహుల్ జేఎన్‌యూ గాంధీ. ఆయన లెఫ్టిస్టుల భాష మాట్లాడుతున్నారు. అందువల్ల జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ తన విశ్వసనీయతను కోల్పోయింది.

మోదీ మ్యాజిక్ పనిచేస్తుంది

తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ పాపులారిటీ అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఒక్క అవినీతి మరకలేదు. పదేళ్ల యూపీఏ పాలనలో లక్షల కోట్ల కుంభకోణాలు వెలుగు చూడగా, తొమ్మిదేళ్ల ఎన్డీఏ ఆధ్వర్యంలోని మోదీ పాలనలో ప్రధాని మోదీ లేదా మంత్రులపై ఒక్కటంటే ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాకపోవడం ముఖ్యమైన సానుకూల అంశం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాజకీయాలు, కులం, మతం, వర్గాలకు అతీతంగా ప్రజలకు చేరవేయడంతో ..మోదీని వారు పూర్తి స్థాయిలో విశ్వసించే పరిస్థితి ఏర్పడింది. ఆ మ్యాజిక్ ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లోనూ స్పష్టంగా పనిచేయబోతోంది. బీజేపీని గెలిపించబోతోంది.

బీఆర్‌ఎస్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజల్లో బీఆర్‌ఎస్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ప్రభుత్వంపై విశ్వసనీయత అనేది అత్యంత అధమ స్థాయిలో ఉంది. ఓటమిపై భయంతోనే కొన్ని మినహా అన్ని సీట్లకు అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించారు. అయితే నామినేషన్ల చివరినాటికి ఆ అభ్యర్థుల్లో కనీసం 20 మందిని మార్చే అవకాశాలున్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను మాకు అనుకూలంగా మార్చుకునేందుకు ఇప్పటికే ప్రజల వద్దకు వెళుతున్నాం. మా వద్ద ఉన్న ఏకైక మార్గం ప్రజలను కలుసుకోవడం, బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలు తెలియజేసి వారి మద్దతు సాధించడం. మేం ప్రజల వద్దకు వెళ్లినప్పుడు కేసీఆర్ సర్కార్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తెలుస్తోంది. మరోవైపు ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా చూశాకే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని నమ్మకంగా చెప్పగలుగుతున్నాం.

డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం ఖాయం

- ఎల్బీ స్టేడియంలో ఆరు గ్యారెంటీలపై సంతకం పెడతాం
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధీమా



గురువారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గాజర్ల అశోక్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఖాయమని, డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం ఏర్పడుతుందని టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అదే రోజు ఎల్బీ స్టేడియంలో ఆరు గ్యారంటీలపై సంతకం పెట్టడం ఖాయమన్నారు. పరిగి నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుమారుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, తాండూరు నియోజకవర్గానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత సంపత్, మాజీ డీసీసీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి కుమారుడు మహిపాల్ రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన ఇల్లంతకుంట, మానకొండూర్ ఎంపీపీలు, ఇతర నేతలు గాంధీభవన్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను కేసీఆర్ తాగుబోతుల అడ్డాగా మార్చారని విమర్శించారు.

డీజీపీని తొలగించాలని డిమాండ్

కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదని రేవంత్ హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వేధించిన అధికారులకు మిత్తితో సహా చెల్లిస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర డీజీపీని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ప్రభాకర్ రావు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారిపై, కాంగ్రెస్ నాయకుల ఫోన్ లపై నిఘా పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకు సాయం చేస్తున్న 75 మంది జాబితాను కేటీఆర్ తయారు చేసి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఇచ్చారని, కొంతమందిని కేటీఆరే స్వయంగా బెదిరిస్తున్నారని నిందించారు. అర్వింద్ కుమార్, జయేశ్ రంజన్, సోమేశ్ కుమార్ లాంటి అధికారులు చందాలు ఇవ్వాలని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అక్బరుద్దీన్ ఓవైసీ కూడా మోదీ, కిషన్ రెడ్డి, రాజాసింగ్‌లా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన గాజర్ల అశోక్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ మాజీ నేత గాజర్ల అశోక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన ఆయన గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఉద్యమపంథా వీడి సాధారణ జనజీవనం గడుపుతున్న అశోక్ ప్రజలకు తనవంతు సేవ చేసేందుకు ఏ రాజకీయ పార్టీలో చేరాలన్న దానిపై కొంతకాలంగా సన్నిహితులు, అభిమానులతో చర్చలు జరుపుతున్నారు. అందరి అభీష్టం మేరకు ఆయన కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. అశోక్ చేరిక అటు ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పరకాల అసెంబ్లీ టికెట్ అశోక్‌కు ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధికారంలోకి రాగానే బెల్టుషాపులు రద్దు

- ఇప్పటికే రాష్ట్రం దివాళా..
- మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే చిప్పే: కిషన్‌రెడ్డి
- కిషన్ రెడ్డి, డా.కె.లక్ష్మణ్, బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, వన్నె ఈశ్వరప్ప



ఆరేపల్లి మోహన్‌కు కండువా కప్పుతున్న బండి సంజయ్. చిత్రంలో కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగానే బెల్టుషాపుల్ని రద్దు చేస్తామని, అక్రమ మద్యం ప్రభావాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. దశలవారీగా మద్యాన్ని నియంత్రిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం కంటే ఆదాయం కోసం బీఆర్‌ఎస్ సర్కారు గ్రామగ్రామనా ఇష్టారాజ్యంగా బెల్టు షాపుల్ని ప్రోత్సహిస్తూ ప్రజల రక్తాన్ని తాగుతోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఇప్పటికే దివాళా తీసిందని, మళ్ళీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే తమ చేతికి చిప్ప మిగులుతుందని ప్రజలకు అర్థం అయిందన్నారు. అందుకే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు తెలంగాణ ప్రజలు పోలింగ్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. గురువారం పార్టీ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన వన్నె ఈశ్వరప్పతో పాటు పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, నేతలు కిషన్ రెడ్డి, పార్టీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్‌ల సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నేతలు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోతారని ప్రజలకు తెలుసునని, 2014, 2018లో అమ్ముడుపోయిన విషయం ప్రజలకు గుర్తుందని చెప్పారు.

కేసీఆర్ ఆటలో రేవంత్, హరీశ్ బలిపశువులు

కేసీఆర్ ఆటలో రేవంత్, హరీశ్‌రావు బలి పశువులు కాబోతున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సీఎం వద్ద మేనిఫెస్టోపై హరీశ్, కేటీఆర్ చర్చ పెద్ద డ్రామా అని సీఎం పదవి కోసమే ఆ ఇద్దరూ కొట్టుకుంటున్నారనే టాక్ నడుస్తోందన్నారు. కేసీఆర్ ఆమోద ముద్ర పడనందునే కాంగ్రెస్ లిస్ట్ ఫైనల్ కాలేదన్నారు. 'కాంగ్రెస్ లిస్ట్ ఇంకా ప్రగతి భవన్ లో ఉంది. కేసీఆర్ స్టాంప్ పడలేదు. ఆయన 30 మంది అభ్యర్థుల పేర్లు చెప్పి ఆమోదముద్ర వేసినాక ఢిల్లీకి పోతది. పాపం రేవంత్ రెడ్డికి తెల్వదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి ఎట్లైనా అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నయ్. ఈ మొత్తం ఎపిసోడ్ లో హరీషన్న, కాంగ్రెస్‌లో రేవంతన్న బలిపశువులు కాబోతున్నరు.'' అని పేర్కొన్నారు. డా. లక్ష్మణ్ మాట్లాడుతూ బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ నేతలు రాహుల్, రేవంత్ రెడ్డిలకు లేదన్నారు. రాజకీయంగా బీసీల అభ్యున్నతికి బీజేపీనే పెద్దపీట వేసిందని గుర్తు చేశారు.

బీజేపీ తొలి జాబితాపై ఢిల్లీలో మంతనాలు

అధిష్టానం పెద్దలను కలిసిన తెలంగాణ చీఫ్ కిషన్‌రెడ్డి

- ఈనెల 15, 16 తేదీల్లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ
- సుమారు 40 మందితో తొలి జాబితా సిద్ధం!

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థులను ఖరారు చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. త్వరలో పార్టీ కేంద్ర కార్యాలయంలో జరగనున్న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమోదం కోసం సమర్పించాల్సిన జాబితాపై పెద్ద ఎత్తున కసరత్తు సాగుతోంది. ఇప్పటికే దాదాపు తొలి జాబితా ఖరారు అయినప్పటికీ, జాబితా విడుదల తర్వాత ఎలాంటి అసంతృప్త స్వరాలు వినిపించకుండా ఉండేందుకు జాగ్రత్తపడుతున్నారు. సుమారు 40 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల కానుందని పార్టీ వర్గాలు తెలిపాయి. బుధవారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయిన కిషన్‌రెడ్డి, పార్టీ ఇతర పెద్దలను కూడా కలసి తొలి జాబితాపై వారితో చర్చించారని సమాచారం. అంతేగాక రాబోయే రోజుల్లో తెలంగాణలో ప్రచారాన్ని ఏ విధంగా దూకుడుగా తీసుకెళ్లాలన్న అంశంపై కిషన్‌రెడ్డికి అమిత్ షా దిశానిర్దేశం చేశారని తెలుస్తోంది. కాగా, ఎక్కడెక్కడ బహిరంగ సభలు నిర్వహించాలి.. ఎక్కడ భారీ ర్యాలీలు చేపట్టాలనే అంశాలపై ఖరారైన ప్రణాళికను కిషన్‌రెడ్డి, అమిత్ షాకు వివరించారు. వీటితో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షా సహా పలువురు కేంద్రమంత్రుల పర్యటనల గురించి చర్చించారు. ముఖ్యంగా ఎన్నికలవేళ తెలంగాణ కోసం గత తొమ్మిదిన్నరేళ్లలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, అభివృద్ధి పథకాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అమిత్ షా సూచించారని తెలిసింది. కాగా పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో కూలంకషంగా చర్చించిన తర్వాతే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారని తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల 15 లేదా 16వ తేదీల్లో ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఎన్నికల కమిటీ భేటీ జరగనుంది. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో అభ్యర్థుల తొలి జాబితాను ఢిల్లీ నుంచి కేంద్ర పార్టీ విడుదల చేస్తుందని తెలిసింది.

ఆల్ నైన్స్‌కు రూ.15.53 లక్షలు

ఆర్టీఏ ప్రత్యేక నంబర్‌లపై క్రేజ్.. ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్య స్పందన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీఏ ప్రత్యేక నంబర్‌లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్యమైన స్పందన లభించింది. ప్రత్యేక నంబర్‌లపైన రూ.41,86,370 ఆదాయం వచ్చినట్లు జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు. 'టీఎస్ 09 జీడీ 9999' నంబర్‌ను ముప్పా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15,53,000 చెల్లించి సొంతం చేసుకుంది. 'టీఎస్ 09 జీఈ 0009' నంబర్ కోసం గీతా ఆటోమోటివ్ ఎల్‌ఎల్‌పీ అనే సంస్థ రూ.3,29,999 చెల్లించింది. 'టీఎస్ 09 జీఈ 0001' నంబర్‌కు శ్రీనివాస్‌బాబు గారపాటి అనే వాహన యజమాని రూ.3,06,000 చెల్లించారు. 'టీఎస్ 09 జీఈ 0005' నంబర్ కోసం శ్రీలక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్ సంస్థ రూ.2,10,000 చెల్లించింది. 'టీఎస్ 09 జీఈ 0019' నంబర్‌కు నాగవంశీ సూర్యదేవర అనే వాహన యజమాని రూ.2,03,000 చెల్లించారు. టీఎస్ 09 జీఈ 0006 నంబర్‌కు కల్పన కొండ్రాజు అనే వాహన యజమాని రూ.1,90,000 చెల్లించి సొంతం చేసుకున్నారు. అలాగే టీఎస్ 09 జీఈ 0023 నంబర్ కోసం స్టోన్ క్రాఫ్ట్ ప్రాపర్టీస్ అనే సంస్థ రూ.1,56,116 చెల్లించి సొంతం చేసుకుంది. 'టీఎస్ 09 జీఈ 0027' నంబర్ కోసం న్యూ లాండ్ లేబోరేటరీస్ రూ.1,27000 చెల్లించింది.

ట్యూషన్ ఫీజులు చెల్లించని సర్కార్

- రెండున్నరేళ్లుగా రూ.5,300 కోట్ల బకాయిలు
- తక్షణమే ఇవ్వకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రెండున్నరేళ్లుగా ట్యూషన్ ఫీజు ఇవ్వకపోవడం వల్ల ఉన్నతవిద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని తెలంగాణ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ తెలిపింది. విద్యాసంస్థల సిబ్బందికి సమయానికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసింది. 30 ఏళ్లలో ఎన్నడూ ఈ దుస్థితి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ కన్వీనర్ గౌరీసతీశ్ గురువారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్వో(బడ్జెట్ రిలీజ్ ఆర్డర్) టోకెన్ నంబర్లు ఇచ్చినా డబ్బులు మాత్రం విద్యార్థుల ఖాతాల్లోకి చేరలేదన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి రూ.5,300 కోట్ల ట్యూషన్ ఫీజుల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. కాలేజీల నిర్వహణ నిమిత్తం తెచ్చిన అప్పులు తమను వెంటాడుతున్నాయని, కాలేజీలు మూసేసుకునే దుస్థితి ఏర్పడిందని అన్నారు. కేవలం కార్పొరేట్ కాలేజీలకు కొమ్ముగాసేందుకే చిన్న కాలేజీల ఉసురు తీస్తున్నారనే అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించనిపక్షంలో ఆందోళనకు కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు డాక్టర్ నరేందర్ రెడ్డి, పార్థసారథి, సిద్ధేశ్వర్, సుధాకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, హైమద్ సలీం, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారును పోలిన గుర్తులను తొలగించాలి

- ఢిల్లీ హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు
- తర్వాత 'సుప్రీం'కు వెళ్లే యోచనతో హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన కారు గుర్తును పోలిన ఇతర గుర్తులను ఈవీఎంలనుంచి తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసింది. దీనిపై గురువారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్.. కారును పోలిన గుర్తులను తొలగించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలను జారీ చేయాలని కోరింది. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఫ్రీ సింబల్స్ లిస్టులో ఉన్న రోడ్డు రోలర్, ఆటో, ట్రక్, చపాతి రోలర్, కుట్టు మిషన్ లాంటి గుర్తులతో పార్టీకి నష్టం కలుగుతోందని పిటిషన్‌లో పేర్కొంది. కారును పోలిన గుర్తులను ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి కేటాయించొద్దని బీఆర్ఎస్ ఇప్పటికే పలుమార్లు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇటీవల కేంద్రం ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించిన సందర్భంలోనూ కారు గుర్తును పోలిన ఫ్రీ సింబల్స్‌ను తొలగించాలని కోరింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బీఆర్ఎస్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ అంశానికి సంబంధించి వీలైనంత త్వరగా విచారణ పూర్తి అయితే ఎన్నికల్లో తమకు మేలు జరుగుతుందని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకే ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను బీఆర్ఎస్ ఉపసంహరించుకుంది. ఇక సుప్రీంకోర్టులో ఈ అంశంపై పిటిషన్ దాఖలు చేయాలని ఆ పార్టీ యోచిస్తోంది.

బూటకపు ఎన్నికలను బహిష్కరించండి

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ పిలుపు

చర్ల: తెలంగాణలో త్వరలో జరిగే బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనతో పేదల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని, బ్రాహ్మణీయ, హిందుత్వ బీజేపీని, దానికి మద్దతిచ్చే అవకాశవాద బీఆర్ఎస్‌ను తరమికొట్టాలని సూచించారు. ప్రజల రాజకీయ వెనుకబాటుతనాన్ని ఆసరా చేసుకుని అబద్ధపు వాగ్దానాలు, డబ్బు, మద్యం, కులం, మతం పేర్లతో మోసం చేస్తున్నారని, అధికారంలోకి వచ్చాక మరోసారి ప్రజలను వంచించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమిలేని దళితులకు మూడెకరాలు ఇస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే దాన్ని మరిచిపోయిందని విమర్శించారు. ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కి హరితహారం, యురేనియం, టైగర్ జోన్ పేర్లతో వ్యవసాయ భూములు, అడవుల నుంచి గిరిజనులను గెంటేస్తోందని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలేదని విమర్శించారు. ఎన్నికలప్పుడే ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలను సైతం నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

'యువ మోర్చా' రసాభాస!

- తరుణ్‌చుగ్ సమక్షంలోనే భానుప్రకాశ్, సాయి వర్గాల మధ్య గొడవ..



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న తరుణ్‌చుగ్

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, జాతీయ కోశాధికారి సాయి వర్గాల మధ్య గొడవ తారస్థాయికి చేరడంతో యువమోర్చా సమావేశం రసాభాసగా మారింది. గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీజేవైఎం అధ్వర్యంలో నిర్వహించిన సోషల్ మీడియా సమావేశం సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్ సమక్షంలోనే రెండు వర్గాలూ గొడవపడ్డాయి. వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు వచ్చిన బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వీ జైసూర్యకు రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ఓ హోటల్లో బస ఏర్పాట్లు చేశారు. కానీ ఆయన బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి ఏర్పాటు చేసిన మరో ప్రాంతానికి వెళ్లడంతో వివాదం రేగింది. చివరికి భాను ప్రకాశ్ అలకబూని వర్క్ షాప్‌కు గైర్హాజరు కాగా ఆయన లేకుండానే వర్క్ షాప్‌ను నిర్వహించేశారు. కాగా...మల్కాజిగిరి అసెంబ్లీ టికెట్ కోసం భానుప్రకాశ్, సాయి ఆశిస్తుండటంతో ఇద్దరి మధ్య వర్గపోరు మొదలైనట్లు తెలుస్తోంది. దీనికితోడు తేజస్వీ రాక అగ్నికి ఆజ్యం పోయడంతోపాటు టికెట్ విషయంలో సాయికి మద్దతు తెలుపుతున్నారనే వాదన ఈ మొత్తం వివాదానికి కారణమైనట్టుగా చెబుతున్నారు.

నిరుద్యోగులకు నిరాశే...!

ఉద్యోగ అర్హత పరీక్షలపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

- ఇప్పటికే గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసిన టీఎస్‌పీఎస్సీ
- నిర్వహించిన పరీక్షల ఫలితాలపైనా ఉత్కంఠ
- సందిగ్ధంలో నియామక సంస్థలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ కూయడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థుల ఆశలకు గండిపడింది. దాదాపు ఏడాదిన్నరగా ఉద్యోగాల కోసం చేసిన శ్రమకు 'కోడ్'బ్రేకులు వేస్తుందేమోనని వారిలో నిరాశ నెలకొంది. ఈ నెల 9న కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో నవంబర్ 3న ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఎన్నికల విధుల్లో బిజీ అయింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం జారీ చేసిన ప్రకటనల తాలూకు పరీక్షల నిర్వహణ, ఇప్పటికే నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాల ప్రకటనపై సందిగ్ధత నెలకొంది. ఎన్నికల కోడ్ కారణంగా ఉద్యోగ అర్హత పరీక్షలను నిర్వహించడంతో పాటు ఫలితాల ప్రకటనకు ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. దీంతో ఎన్నికల కమిషన్ అనుమతి ఇస్తుందా? లేదా? అనే అనుమానాలు నిరుద్యోగ అభ్యర్థులను కలవరపెడుతున్నాయి. నియామక సంస్థలు అనుమతి కోరిన వెంటనే ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినప్పటికీ భద్రతా కారణాలు, సిబ్బంది సమస్యలతో అర్హత పరీక్షలను నిర్వహిస్తారా? లేదా? అనే ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది.

పరీక్షలు సరే... ఫలితాల మాటేంటి?

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని వివిధ ఉద్యోగ ఖాళీలకు సంబంధించి గతేడాది ఏప్రిల్ నుంచి వరుసగా ఉద్యోగ ప్రకటనలు వెలువడ్డాయి. 80 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నియామక సంస్థలు సైతం ఎంతో ఉత్సాహంతో భర్తీ ప్రక్రియను మొదలుపెట్టాయి. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఇప్పటికే 38 వేలకు పైగా ఉద్యోగాలకు ప్రకటనలు జారీ చేసింది. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) దాదాపు 11 వేల ఉద్యోగాలకు, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామకాల బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) మరో 17 వేల ఉద్యోగాలకు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంఎస్ఆర్‌బీ) 10 వేల ఉద్యోగాలకు ప్రకటనలు జారీ చేసింది. వీటితో పాటు ఇటీవల డీఎస్సీ ద్వారా 6 వేల టీచర్ ఉద్యోగాలకు సైతం ప్రకటనలు వెలువడ్డాయి. డీఎస్సీ, గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 అర్హత పరీక్షలు మినహా మిగతా కేటగిరీలకు సంబంధించి పరీక్షలు పూర్తయ్యాయి. పోలీసు నియామక ఫలితాల విడుదల దాదాపు పూర్తి కాగా... మెడికల్ ఆఫీసర్ నియామకాల ప్రక్రియ కూడా పూర్తయింది. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పలు అర్హత పరీక్షల ఫలితాలు వెలువడలేదు. గురుకుల బోర్డు కూడా ఫలితాలను ప్రకటించలేదు. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నియామక సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయోనని వారు ఎదురు చూస్తున్నారు. చిన్నాచితకా ఉద్యోగాలను వదులుకుని ప్రభుత్వ కొలువులకు సన్నద్ధమైన అభ్యర్థులకు ఫలితాల కోసం నిరీక్షణ తప్పేలా లేదు.

సర్కారు బడుల్లో సిలబస్ తంటాలు

- ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ 40 శాతమే
- ఈ దశలోనే ఎన్నికల హడావుడి
- వచ్చే నెలంతా ఎన్నికల శిక్షణలో టీచర్లు.. పరీక్ష ఫలితాలపై అన్నివర్గాల్లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో సిలబస్ పూర్తవ్వకపోవడం విద్యాశాఖలో సరికొత్త వివాదానికి దారితీస్తోంది. దీనికి పాఠశాల హెచ్ఎంలు, సంబంధిత టీచర్లను బాధ్యులను చేయాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ భావించడం కొత్త సమస్యను సృష్టిస్తోంది. ఈ పరిస్థితికి విద్యాశాఖ అధికారులే కారణమని ఉపాధ్యాయులు నిందిస్తున్నారు. నేరం తమపై మోపితే సహించేదే లేదని చెబుతున్నారు. సిలబస్ పూర్తికాని బడుల వివరాలను పాఠశాల విద్య డైరెక్టరేట్ ఇటీవల తెప్పించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బడుల్లో దసరా సెలవులలోపు 80 శాతం సిలబస్ పూర్తవ్వాల్సి ఉండగా, ఎక్కడా 40 శాతానికి మించి పూర్తవ్వలేదని డీఈవోలు చెబుతున్నారు. కొన్ని చోట్ల 25 శాతం మాత్రమే అయిందంటున్నారు. ఇలాంటి బడుల హెచ్ఎంలు, టీచర్ల నుంచి వివరణ కోరాలని పాఠశాల విద్య డైరెక్టర్ డీఈవోలకు సూచించినట్టు తెలిసింది. దీంతో డీఈవోలు సంబంధిత బడుల హెచ్ఎంల నుంచి వివరణ కోరేందుకు సన్నద్ధమయ్యారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

ఇక సమయమెక్కడిది?

పాఠశాల విద్యాశాఖ సూచించిన లక్ష్యం పూర్తవ్వకపోవడంతో, భవిష్యత్‌లో సిలబస్ సమగ్రంగా పూర్తి చేయడం అసాధ్యమని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. స్కూళ్లు తెరిచిన రెండు నెలల వరకూ పాఠ్యపుస్తకాలు అందలేదని, ఈ కారణంగా బోధన చేపట్టలేదని టీచర్లు చెబుతున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం టీచర్ల బదిలీలు, పదోన్నతుల అంశాన్ని తెరమీదకు తెచ్చింది. దీంతో బోధన కొంతమేర కుంటుపడింది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడంతో మరో రెండు నెలలపాటు టీచర్లు ఇదే హడావిడిలో ఉంటారు. చాలామంది పోలింగ్ విధులకు వెళ్లాల్సి ఉంటుంది. వారికి కొన్ని రోజుల పాటు శిక్షణ ఇస్తారు. వీటితో బోధన జరిగేందుకు వీలుకాని పరిస్థితి ఉంటుందని టీచర్లు చెబుతున్నారు. అదీగాక, చాలాచోట్ల సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. ఇతర స్కూళ్ల నుంచి సర్దుబాటు చేయడంలో అధికారులు జాప్యం చేశారని టీచర్లు ఆరోపిస్తున్నారు. కాబట్టి వందశాతం సిలబస్ పూర్తి చేయడంపై వారు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షలపై ఇవన్నీ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. వాస్తవాలు ఇలా ఉంటే తమనే బాధ్యులను చేయడమేంటని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరిస్తున్నారు.

గాదె ఇన్నయ్య అరెస్టు

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం!



జఫర్‌గఢ్: టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) వ్యవస్థాపకుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య అరెస్టు కలకలం రేపింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరం గ్రామానికి చెందిన 'మా ఇల్లు ప్రజాదరణ అనాథాశ్రమం'వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్యను బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, అనాథాశ్రమ పిల్లలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల నుంచి గాదె ఇన్నయ్య 'భారత్ బచావో'కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అరెస్టు కావడం అనుమానాలకు తావిస్తోంది. ఇన్నయ్యను అరెస్టు చేసింది రాష్ట్ర పోలీసులా? కేంద్ర దర్యాప్తు సంస్థలా అన్నది తెలియాల్సి ఉంది. ఇన్నయ్య విద్యార్థి దశలోనే రాడికల్ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. అనంతరం పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరారు. ఉద్యమం నుంచి బయటకు వచ్చిన అనంతరం ప్రస్తుత సీఎం కేసీఆర్‌తో కలిసి హైదరాబాద్‌లోని జలదృశ్యం కార్యాలయంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. అనంతరం టీఆర్ఎస్‌ను స్థాపించారు. ఆ తరువాత కేసీఆర్‌తో ఏర్పడిన విభేదాలతో పార్టీ నుంచి బయటకు వచ్చిన ఇన్నయ్య.. తెలంగాణ రాష్ట్ర పార్టీని ఏర్పాటు చేసి ఉద్యమం కొనసాగించారు. ఈ క్రమంలో మళ్లీ జైలుకు వెళ్లారు. విడుదలైన అనంతరం జఫర్‌గఢ్ మండలంలోని రేగడితండా గ్రామ శివారు టీబీతండా వద్ద 2006 మే 28న 'మా ఇల్లు అనాథ ఆశ్రమం'నెలకొల్పారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే 'భారత్ బచావో'కార్యక్రమాన్ని చేపడుతున్న ఇన్నయ్యను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఆయన నివాసముంటున్న న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



మియాపూర్‌లో స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పట్టుకున్న నగదు, వస్తువులు రూ. 37 కోట్లపైనే!

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు
- రూ. 20 కోట్లపైన నగదు, రూ. 14 కోట్లపైన బంగారం, వజ్రాలు, వెండి స్వాధీనం
- మరో మూడు కోట్లపైన ఇతర వస్తువులు పట్టివేత
- రూల్స్ తప్పిన వారిపై కేసులు నమోదు: ఎన్నికల కమిషన్



చైతన్యపురిలో కారు డిక్కీలో పెట్టి తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చినప్పటి నుంచీ పెద్ద ఎత్తున నగదు, బంగారం, మద్యం, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. మొత్తంగా 1,196 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపింది. తనిఖీల కోసం 89 అంతర్రాష్ట్ర సరిహద్దులు, 169 ఇతర రాష్ట్రాలతో ఉన్న సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వివరించింది. ఇప్పటివరకు కమిషన్ నేతృత్వంలో సాగిన నిఘా, స్వాధీనాలు, కేసుల వివరాలను వెల్లడించింది. ఆ వివరాల మేరకు.. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.20,43,38,375 నగదును, రూ.14,65,50,852 విలువైన బంగారం, వెండి, వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.86,92,533 విలువైన 31,730 లీటర్ల మద్యం, వెయ్యి కిలోల నల్లబెల్లం, 501 కిలోల అల్లం స్వాధీనం చేసుకున్నారు. రూ.89,02,825 విలువైన 310 కిలోల గంజాయిని తనిఖీల్లో పట్టుకున్నారు. ప్రలోభాలకు గురి చేసేందుకు తరలిస్తున్నారనే అనుమానంతో 7,040 కిలోల బియ్యం, 440 చీరలు, 80 కుట్టు మెషీన్లు, 87 కుక్కర్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.22,51,963. మొత్తంగా నగదు, వస్తువులన్నీ కలిపి విలువ రూ.37,07,36,548 అని కమిషన్ గుర్తించింది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి నిబంధనల ఉల్లంఘనపై 34,388 కేసులు నమోదు చేసినట్టు ఈసీ తెలిపింది.

- గురువారం హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.33.55 లక్షలను, జూబ్లీహిల్స్‌లో మణిపూర్‌కు చెందిన మహిళ నుంచి రూ. 5.50 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ ప్రాంతంలో చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ. 5 లక్షల నగదు, అమీర్‌పేటలో మరొకరి నుంచి రూ. 9.9 లక్షలను, మియాపూర్‌లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి 448.96 గ్రాముల బంగారు ఆభరణాలను సీజ్ చేశారు. ● నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురంలో చేపట్టిన వాహన తనిఖీల సందర్భంగా ఎలాంటి పత్రాలు చూపకుండా తరలిస్తున్న రూ. 30 లక్షల నగదును సీజ్ చేశారు.
- మేడిపల్లి పోలీసులు నారపల్లి వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద వాహన తనిఖీల్లో రూ.13.50 లక్షలు, హబీబ్‌నగర్ పోలీసులు సీతారామ్‌భాగ్ ఎక్స్ రోడ్డులో ఓ వ్యక్తి నుండి రూ.6.95 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు.





సాక్షి ఉద్యోగ అవకాశాలు

NCPE INFRASTRUCTURE INDIA PVT. LTD.
12-2-826/A/12, LIC Colony, Mehdipatnam, Hyderabad

EMPLOYMENT

NCPE Infrastructure India Private Limited (NCPEIIPL) appeared on the horizon of Hyderabad's Urban Infrastructure consultancy services in the year 1996. It graduated to preparation of DPRs in various sectors of urban services. Over the years, NCPEIIPL has made a mark as a multi-disciplinary consultancy firm with a footprint across 17 states of India, offering a wide range of quality services in project engineering across India. Now NCPEIIPL invites applications from Experienced and dynamic candidates for the following posts.

Quality Control Engineer:- Graduate in Civil Engg with Min 5 yrs of experience.

Resident Engineer:- Graduate in Civil Engg with Min 5 yrs of experience or 10 yrs of experience for Diploma with Civil Engg.

Placement:- Prakasam, Ananthapur, Chittor, Kurnool, Kadapa & Nellore Districts of Andhra Pradesh State.

Email us: agmncpe@gmail.com & info@ncpeinfra.org.in
Mob.No.9441854025



రాత్రివేళలో జాగరణ (తహజ్జుద్) నమాజ్ చెయ్యి : ఇది నీ కొరకు అదనపు (నఫిల్) నమాజ్. దీనితో నీ ప్రభువు నిన్ను (పునరుత్థాన దినమున) ప్రశంసనీయమైన స్థానము (మఖామమ్ మహ్మూద్) నొసంగవచ్చు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 13 అక్టోబర్ 2023

ఇంకెప్పటికి మారతాం?!

ఆ కేంద్రపాలిత ప్రాంతం మొత్తంలో ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమె. అక్కడి ప్రభుత్వంలో ఉన్న ఒకే ఒక్క మహిళా మంత్రి కూడా ఆమే! తీరా, అలాంటి వ్యక్తి కూడా తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందంటే ఏమనాలి? మామూలు పరిస్థితుల్లో రాజీనామా చేయడం కాదు... లింగ, కుల దుర్విచక్షణల్ని తట్టుకోలేక రాజీనామా చేశానంటున్నారు. ఆ ఆరోపణలు దిగ్భ్రమ కలిగిస్తున్నాయి. పుదుచ్చేరిలోని ఏకైక దళిత, మహిళా ఎమ్మెల్యే సి. చంద్ర ప్రియాంక ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తిగా మారారు. అయితే, ఆమె అసమర్థత రీత్యానే పదవి నుంచి తప్పించామని అధికార కూటమి అంటోంది. ఏమైనా, ఈ మహిళా మంత్రి రాజీనామా ఉదంతం స్త్రీలు, వెనుకబడిన కులాల పట్ల మన వ్యవస్థలోని చిన్నచూపును మరోసారి చర్చకు పెడుతోంది.

దాదాపు 40 ఏళ్ళ విరామం తర్వాత పుదుచ్చేరిలో మంత్రి పదవి దక్కిన మహిళ చంద్రిక అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముప్ఫై మంది సభ్యుల పుదుచ్చేరి అసెంబ్లీలో కారైక్కాల్ ప్రాంతంలో రిజర్వుడు స్థానమైన నెడుంగాడు నుంచి ఎన్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో 2021లో ఆమెకు మంత్రి పదవి దక్కింది. 'మంచి ఆలోచనలతో, కష్టపడి పనిచేయాలని రాజకీయాల్లోకి వచ్చాన'న్న చంద్రిక పురుషాధిక్య రాజకీయ ప్రపంచంలో వివక్షకు గురయ్యానని ఆరోపించారు. ప్రజాదరణ ఉన్నా కుట్రల్ని తట్టుకొని, ధనశక్తి అనే భూతంపై పోరాడడం తేలిక కాదని గ్రహించినట్టు ఆమె తన రాజీనామా లేఖలో ఆవేదన చెందారు.

ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకె, వామపక్షాలు ప్రభుత్వాన్నీ, సీఎం 'దళిత వ్యతిరేక వైఖరి'నీ తప్పుబట్టాయి. అయితే, కీలకమైన మంత్రి పదవిని చంద్రిక సమర్థంగా నిర్వహించట్లేదనీ, ఆరునెలలుగా చెబుతున్నా పట్టించుకోవట్లేదనీ, అందుకే ఆమెను పదవి నుంచి తప్పించామనీ, కేంద్రానికి లేఖ పంపగానే అది తెలిసి ఆమె ముందే రాజీనామా చేశారనీ అధికార పక్షం చెబుతోంది. చిత్రమేమిటంటే, అధికారపక్షం చెబుతున్న ఈ కథనాన్నే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నరైన మరో మహిళ తమిళిసై సౌందరరాజన్ పేర్కొనడం! దుర్విచక్షణ ఉన్నట్టు తెలీదనీ, తనకు చెబితే పరిస్థితిని చక్కదిద్దేదాన్ననీ గవర్నర్ అన్నట్టు తమిళ పత్రికల కథనం. అయితే, మన దేశంలో అలాంటివి లేవనుకోవడం వట్టి భ్రమ. ఆ మాటకొస్తే, ఎవరూ బయటపడకపోయినా చంద్రిక కథ లాంటిదే... ఈ దేశంలోని పలువురు మహిళా నేతల వ్యథ! పురుషాధిక్య ప్రపంచంలో, అందులోనూ రాజకీయాల్లో ఎన్నో సహించి, భరిస్తే కానీ స్త్రీలు తమకంటూ చిన్నచోటు దక్కించుకొని, గొంతు విప్పలేరన్నది నిష్ఠురసత్యం.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, చట్టం చేయడానికి సైతం దశాబ్దాలు పట్టిన రాజకీయ వ్యవస్థ మనది. అది అమలయ్యేదెన్నడో నిర్దిష్టంగా చెప్పలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో చంద్రిక లాంటి వారి ఉదంతాలు ఒక మేలుకొలుపు. ఆమె ఆరోపణలు సంపూర్ణ అసత్యాలని కొట్టిపారేయలేం. స్వతంత్ర భారత శతవసంతాల నాటికి మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చేయాలనేది పాలకులు ప్రవచిస్తున్న లక్ష్యం. 2047 కల్లా అది సాధ్యం కావాలంటే, జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళల పాత్ర, వారి ప్రాతినిధ్యం కీలకం. కానీ, అధిక శాతం పార్టీలు, ప్రభుత్వాల చేతలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. గమనిస్తే, 1970ల వరకు లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం 5 శాతం వద్దే తచ్చాడుతూ వచ్చింది. 2009లో గానీ అది రెండంకెలకు చేరుకోలేదు. రాజ్యసభలో అయితే 1951 నుంచి ఇప్పటి దాకా ఏనాడూ మహిళల సంఖ్య 13 శాతమైనా దాటలేదు. రాష్ట్ర శాసనసభల్లోనైతే సగటు మహిళా ప్రాతినిధ్యం 10 శాతం కన్నా తక్కువే.

మహిళా మంత్రుల సంఖ్యలోనూ మన దేశంలో ఇదే పరిస్థితి. గత మూడు దశాబ్దాల పైచిలుకులో కేంద్రంలో మంత్రిపదవులను చేపట్టిన స్త్రీలు నాటి మహిళా ప్రాతినిధ్యంతో పోలిస్తే 11 శాతమే. క్యాబినెట్ హోదా దక్కినవారైతే 7 శాతమే. రాజకీయ పాలనలో కాదు, ప్రభుత్వ అధికార యంత్రాంగంలోనూ ఆడవారి వాటా మరీ తీసికట్టు. మొత్తం 30 లక్షల పైచిలుకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 11 శాతమే స్త్రీలు. కార్యనిర్వాహక, శాసన నిర్మాణ వ్యవస్థలతో పోలిస్తే, భారత న్యాయ వ్యవస్థలో లింగ సమానత మరీ కనాకష్టం. 1950 నుంచి చూస్తే, సుప్రీమ్ కోర్ట్ జడ్జీల్లో కూడా ఆడవాళ్ళు 3 శాతమే. ప్రతిచోటా ఉన్నత స్థాయికి చేరడానికి అతివలకు అనేక అవరోధాలు. ఈ గణాంకాలన్నీ ఇప్పటికీ మహిళల పట్ల మనకున్న దుర్విచక్షణకూ, మారని మన పితృస్వామ్య భావజాలానికీ నిలువుటద్దాలు. దానికి తోడు దళితులు, వెనుకబడిన వర్గాల స్త్రీల పరిస్థితి మరీ కష్టం. ఈ నేపథ్యం నుంచి పుదుచ్చేరి ఉదంతాన్ని చూసినప్పుడే సమస్య లోతులు స్పష్టమవుతాయి.

దాదాపు 156 దేశాల్లో సగటున 23 శాతం మహిళా మంత్రులుంటే, భారత్ తద్భిన్నం. కేంద్రంలో పేరుకు మహిళా మంత్రుల సంఖ్య పెంచినా, వారికి రక్షణ, పరిశ్రమలు, రైల్వేలు, రవాణా, వ్యవసాయం లాంటి కీలక శాఖలు అప్పగించడం అరుదు. ఈ పరిస్థితిని మార్చాలంటే, మహిళా రిజర్వేషన్ చట్టాలు తెస్తే సరిపోదు. కులం, మతం, ప్రాంతం, జెండర్ అంశాల్లో పార్టీల, ప్రజల ఆలోచన మారాలి. వెనుకబడిన వర్గాల, స్త్రీల సమర్థతను శంకించడం క్షమార్హం కాదు. అవకాశమిచ్చి, ప్రోత్సహిస్తే, పలువురు నేతల కన్నా వారే సమర్థులు. పాలిచ్చి పెంచిన అమ్మలు మనల్ని పాలించలేరా? కుటుంబానికి ఇరుసుగా మారి, మొత్తం సమాజాన్ని నిలబెడుతున్న స్త్రీలు సమర్థులు కారా? వారికా సమర్థత లేదనుకోవడం మూర్ఖత్వం. మకిలిపట్టిన మనసుల్లోని మనుస్మృతి భావజాలం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.9.02 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** ఉత్తర ప.2.37 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.11.44. నుండి 1.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.10 నుండి 12.56 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.39 నుండి 8.25 వరకు

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

భారత్‌ను మాల్దీవులు వదులుకోగలదా?


విశ్లేషణ



డా॥ గద్దె ఓంప్రసాద్

దక్షిణాసియాలో చిట్టచివరగా బ్రిటిష్ పాలకుల నుండి స్వాతంత్ర్యం పొందిన దేశం మాల్దీవులు. 1965లో స్వతంత్ర దేశంగా అవతరించినప్పటి నుండి ఆర్థిక, శాస్త్రీయ–సాంకేతిక అభివృద్ధిలో, సముద్ర భద్రతా విషయాల్లో మాల్దీవులకు భారత్ చేయూత అందించింది. 1988లో ఆపరేషన్ కాక్టస్ ద్వారా ప్రభుత్వాన్ని తీవ్రవాదుల చెర నుండి కాపాడింది. అయినా కొన్నేళ్లుగా భారత్ ఆ దేశంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. రెండు మూడేళ్లుగా ఏకంగా 'ఇండియా అవుట్' ప్రచారానికి కేంద్రం అయింది. దీని వెనక ఐఎస్ఐ, చైనా ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. అలాగని అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా తన వాణిని బలంగా వినిపిస్తున్న భారత్‌ను దూరం చేసుకోవడం మాల్దీవులకు కూడా అంత తేలిక కాదు.

మాల్దీవుల్లో కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో భారత వ్యతిరేక రాజకీయాలు నెరిపిన మొహమ్మద్ ముయిజ్జు సుమారు 54 శాతం ఓట్లతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో ఇరు దేశాల సంబంధాలు ఎలా వుండబోతున్నాయో అంచనా వేసే ముందు, భారత్ పట్ల వ్యతిరేకత పెరగడానికి కారణాలు ఏమిటో తెలుసుకోవాలి.



మాల్దీవ్స్‌లో 12వ శతాబ్దంలో ఇస్లాం అడుగుపెట్టినప్పటికీ అది స్థానిక సంప్రదాయాలు, ఆచారాల సమ్మిళితంతో ఉదారవాదంగా ఉండేది. 1970ల్లో ఉదార మత విధానాలను అవలంబించిన మాల్దీవులు, క్రమంగా గల్ఫ్ దేశాల ప్రభావానికి లోనయ్యింది. చమురు ఉత్పాదిత గల్ఫ్ దేశాలు అరబ్, ముస్లిం ప్రపంచంలో ముఖ్యమైన భూమికను పోషించడం మొదలుపెట్టాయి. సున్నీ ముస్లిం వహాబీజం పాటించే గల్ఫ్ దేశాలు సంప్రదాయవాదాన్ని బలంగా ప్రచారం చేయడం, మొహమ్మద్ అబ్దుల్ గయూమ్ నేతృత్వంలోని ప్రభుత్వం 1980, 90ల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి మతాన్ని అస్త్రంగా ఉపయోగించుకోవడం, గల్ఫ్ దేశాల నుండి వచ్చే చమురు, ఆర్థిక సహాయాన్ని పొందేందుకు సాంప్రదాయవాదాన్ని, ఇస్లామిక్ షరియా చట్టాల్ని ప్రవేశపెట్టడం వరుసగా జరిగాయి. ఆఫ్ఘనిస్తాన్‌ను సోవియట్ ఆక్రమించడంతో దానికి వ్యతిరేకంగా సంప్రదాయవాద వర్గాల ఏకీకరణ జరిగింది.

ఇరవై ఒక్కటవ శతాబ్దం మొదట్లో జరిగిన ప్రపంచ పరిణామాల ప్రభావం మాల్దీవుల యువత మీద తీవ్రంగా పడింది. ఆ దేశంలోని చాలామంది యువత అల్–ఖాయిదాలో చేరినట్టుగా వార్తలు వచ్చాయి. 2007లో జరిగిన వరుస బాంబు పేలుళ్లు ప్రమాద ఘంటికలు మోగించాయి. 2008లో మాల్దీవులు ఏక పార్టీ వ్యవస్థ నుండి బహుళ పార్టీ వ్యవస్థగా రూపాంతరం చెందింది. మతపరమైన సాంప్రదాయ పార్టీలు ఏర్పాటు కావడానికీ, అవి మత రాజకీయాలు నెరపడానికీ ఇది దారి తీసింది. 2012లో షరియా చట్టాల అమలు కోసం అనేక ఉద్యమాలు ఈ పార్టీలు చేపట్టాయి. చాలామంది యువత 'ఐసిస్'లో చేరడానికి సిరియా వెళ్లినట్టు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. ఇస్లామిక్ ఛాందసవాదాన్ని ఎగదోయడంలో, ముఖ్యంగా భారత్ పట్ల వ్యతిరేకతను పెంచడంలో పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ పాత్ర చాలా ఉంది. 1990ల్లో జరిగిన ఇస్రో 'హనీ ట్రాప్' కేసులో మాల్దీవులకు చెందినవారు ఉన్నట్టుగా బయటపడటం ఆ దేశంలో వేళ్లానుకున్న ఐఎస్ఐ పాత్రకు ఒక ఉదాహరణ మాత్రమే.

1978 నుండి 2008 వరకు సుమారు ముప్పయ్యేళ్లు మాల్దీవులను ఏకధాటిగా పాలించిన మౌమూన్ అబ్దుల్ గయూమ్, అయన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్, 2018లో అధ్యక్షుడిగా ఎన్నికైన ఇబ్రహీం సోలీహ్ భారత్ పట్ల సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. కానీ 2013 నుండి 2018 మధ్యకాలంలో అధికారంలో ఉన్న అబ్దుల్లా యామీన్ ప్రభుత్వం భారత్ వ్యతిరేక విధానాలను అనుసరించింది. తాజాగా ఆయన వారసుడిగా మొహమ్మద్ ముయిజ్జు భారత్ పట్ల అంతే తీవ్ర వ్యతిరేక ప్రచారాలతో ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారు.

యామీన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో మాల్దీవ్స్‌లో చైనా కార్యకలాపాలు విపరీతంగా పెరిగాయి. 2014లో చైనీస్ బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో మాల్దీవ్స్ చేరడమే కాకుండా అనేక మౌలిక వసతుల నిర్మాణ బాధ్యతలను చైనీస్ కంపెనీలకు అప్పగించింది. మాలె, హుల్హులే, హుల్హుమాలే దీవులను కలిపే సినిమాలే బ్రిడ్జితో పాటు, వెలనా అంతర్జాతీయ విమానాశ్రయం, హుల్హులే ద్వీపంలోని నివాస సముదాయ నిర్మాణాలు, టూరిజం, ఎనర్జీ తదితర రంగాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మాల్దీవుల ఆర్థిక శాఖ అంచనా ప్రకారం, 2022 చివరికల్లా ఆ దేశ అప్పులు జీడీపీలో 110 శాతం. అందులో చైనా వాటా సుమారు 70 శాతం. ప్రతి సంవత్సరం చైనాకు చెల్లించే వడ్డీలు సుమారు 92 మిలియన్ల అమెరికన్ డాలర్లు. మాల్దీవుల వార్షిక బడ్జెట్‌లో ఇది సుమారు 10 శాతం. యామీన్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన రాజ్యాంగ సవరణ ప్రకారం, విదేశీయులు ఆ దేశంలో స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. దీని ఆసరాగా చైనీస్ కంపెనీలు ఫెయిదూ ఫింహులు ద్వీపాన్ని 50 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నాయి. ఈ లెక్కలు చైనా ప్రభావం మాల్దీవుల పైన ఎంత వుందో, చైనా అప్పుల ఊబిలో ఎంతగా చిక్కుకుందో తెలియజేస్తాయి. చైనా ఈ పరిస్థితులను భారత వ్యతిరేక శక్తులను పెంచడానికి ఉపయోగించుకుంది. చైనా అనుసరిస్తున్న వైఖరిని గ్రహించిన ఇబ్రహీం సోలీహ్ ప్రభుత్వం 'ఇండియా ఫస్ట్' విధానాన్ని పాటించింది.

అయితే భారత వ్యతిరేక శక్తులు ఒక క్రమ పద్ధతిలో ప్రచారాన్ని సాగించాయి. ఆ దేశంలో ఉన్న నిరుద్యోగానికి ముఖ్య కారణం, భారతీయులు టూరిజం తదితర రంగాల్లో ఉద్యోగాలు ఎగరేసుకుపోవడమేననీ, భారత్‌లో ముస్లింల పట్ల అణచివేతకు పాల్పడుతున్నారనీ, భారత్ తన సైనిక కార్యక్రమాలు సాగిస్తూ మాల్దీవుల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందనీ, ఇబ్రహీం సోలీహ్ ప్రభుత్వం దేశ సంపదను భారత్‌కు ధారాదత్తం చేస్తోందనీ ఇలా అనేక రకాలుగా విష ప్రచారం చేశాయి. ఇదే రకమైన రాడికలైజేషన్, యువతలో భారత వ్యతిరేక భావజాల వ్యాప్తి బంగ్లాదేశ్‌లోనూ గమనించవచ్చు. ఈ ప్రచారం వెనక అటు ఐఎస్ఐ, ఇటు చైనా ఉన్నాయన్నది బహిరంగ రహస్యం.

ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వాన్ని భారత వ్యతిరేక కార్యక్రమాలు కొనసాగించకుండా చేయడం, విదేశాంగ విధానానికి ఒక సవాలు. ఇప్పటికే హిందూ మహాసముద్రంలో మయాన్మార్ నుండి జిబౌటి వరకు తన ఆర్థిక, సైనిక, వ్యూహాత్మక ప్రభావాన్ని విపరీతంగా పెంచుకున్న చైనాను కట్టడి చేయడం అంత తేలిక కాదు. భారత్, చైనా మధ్య ఈ ప్రాంతంలో నెలకొన్న పోటీలో మాల్దీవులు ముఖ్య భూమికను పోషిస్తాయి. 2013లో అమెరికా మాల్దీవులతో సైనిక ఒప్పందాలు చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలను, భారత్ అడ్డుకుంది. దక్షిణాసియాలో ప్రాంతీయేతర శక్తుల ప్రభావాన్ని అడ్డుకోవడం భారత విదేశీ విధానంలో ముఖ్య భాగం. కానీ అది క్రమంగా మారడం గమనించవచ్చు. 2020లో కుదిరిన అమెరికా, మాల్దీవుల సైనిక ఒప్పందానికి భారత్ సానుకూలత వ్యక్తం చేసింది. మాల్దీవులకు సుమారు 1,800 కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగో గరిసియ అమెరికా మిలిటరీ స్థావరాన్ని గతంలో వ్యతిరేకించిన భారత్ ప్రస్తుత పరిస్థితుల్లో తన స్వరం మార్చింది. ఈ ఒప్పందాలు చైనా ప్రభావాన్ని నిలువరించడంలో సహాయపడతాయని భావిస్తోంది.

భారత వ్యతిరేక ప్రభుత్వం ఏర్పడబోతున్నందుకు మరీ ఆందోళన చెందకుండా ఇదివరకే ఆ దేశంతో కుదిరిన అనేక ఒప్పందాలు, ముఖ్యంగా 500 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన థిలమలే సముద్ర వంతెన ప్రాజెక్ట్, తాగునీరు పైపులైన్ ప్రాజెక్ట్, విద్య, ఆరోగ్య సేవల వసతుల నిర్మాణ ప్రాజెక్టులు, వివిధ ఇతర పనులకు సంబంధించిన దాదాపు 300 బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులు కొనసాగించాలి. ఇవి మాల్దీవులకు చాలా ముఖ్యమైనవి. ఇవి కొనసాగించేందుకు నూతన ప్రభుత్వాన్ని ఒప్పించడం, భారత వ్యతిరేక ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం తక్షణ కర్తవ్యాలు. అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకగా తన వాణిని బలంగా వినిపిస్తున్న భారత్‌ను దూరం చేసుకోవడం మాల్దీవులకు కూడా అంత తేలిక కాదు. 'ఇండియా అవుట్' ప్రచారం అక్కడి భారత సైనిక బలగాలకు వ్యతిరేకంగానో, భావోద్వేగ రాజకీయాల కోసమో తప్ప, పూర్తిగా భారత్‌ను ఆ దేశానికి దూరం చేయాలని కాదని మనం అనుకోవలసి ఉంటుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన విభాగం, ఎస్ఐఎస్, జేఎన్‌యూ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎలా వచ్చాయి?



'గాజా నిర్బంధం' అనే మాట విన్న ప్రతిసారీ మీకు మీరు ఈ ప్రశ్న వేసుకోండి: ఈ ఊహాత్మక నిర్బంధంలోనేనా హమాస్ అలా వేలాది రాకెట్లను, డ్రోన్లను దిగుమతి చేసుకోగలిగింది?

– హుస్సేన్ అబ్దుల్ హుస్సేన్, రీసెర్చ్ ఫెలో

అది యుద్ధనేరం



గాజా (పాలస్తీనా) జనాభా సుమారు 20 లక్షలు. ఇందులో సగం మంది పిల్లలు. హమాస్ ఘోరానికి లక్షల మంది అమాయకులు మూల్యం చెల్లించేలా చేయకూడదు. మూకుమ్మడిగా శిక్షించడం అనేది యుద్ధ నేరం; నీరు, ఆహారం అందకుండా దిగ్బంధించడం కూడా! అమానవీకరణను మరో దుర్మార్గంలోకి దిగనీయకూడదు.

– అలెగ్జాండ్రియా ఒకేషియో–కార్టెజ్, అమెరికా నాయకురాలు

సగం వెనక్కి!



రష్యా 2022 నుంచి ఆక్రమించుకున్న ప్రాంతంలో సగానికంటే ఎక్కువ భాగాన్ని ఇప్పటికి ఉక్రెయిన్ తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఈ రోజు ప్రకటించిన ఆయుధాలు, సామగ్రి ఉక్రెయిన్ ప్రగతిని నిలపడంలో, తర్వాతి ఊపును కొనసాగించడంలోనూ తోడ్పడుతాయి.

– ఆంటోనీ బ్లింకెన్, యూఎస్ విదేశాంగ మంత్రి

దేవుడికి వదిలెయ్



ఒక కాఫిర్ (అవిశ్వాసి) చనిపోవాలని కోరుకోవడానికి అనుమతి ఉందా? అని ఒకరు అడిగారు. ఇది మరీ దుష్టత్వం. ఇతరుల పట్ల ముస్లింల హృదయాల్లో అలాంటి దుష్టత్వం ఉండకూడదు. అది కూడా 'కుఫ్ర్(అవిశ్వాసం)'కు సమ్మతించడం లాంటిది!

– అస్సీమ్ అల్‌హకీమ్, ఇస్లాం పండితుడు

తవ్వితేనే రాయగలం



రాయడం అనే ప్రక్రియ తవ్వకం లాంటిది! పట్టుదలతో తవ్వుతూ పోతే, ఏం దొరుకుతాయో తెలీదు– పురుగులు, ఎముకలు– ఏవైనా ఒకటే; రాయాలనుకునేవాళ్లకు రెండూ బంగారంతో సమానమే. నా ప్రత్యేక తవ్వకం పూర్తయింది. ఇప్పుడు నాలుగో పుస్తకంతో సిద్ధంగా ఉన్నాను.

– ట్వింకిల్ ఖన్నా, నటి – రచయిత్రి

ఎవరు మెరుగు?



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్నేయాసియా రీజినల్ డైరెక్టర్‌గా సైమా వాజెద్ కంటే శంభు ఆచార్య(నేపాల్) చాలా మెరుగైన అభ్యర్థి. ప్రజారోగ్యంలో డాక్టరేట్ ఉన్న ఆచార్య ప్ర.ఆ.సం.లో 30 ఏళ్లు పనిచేశారు. సైమా సైకాలజీ చదివారు కానీ ప్రజారోగ్యంలో అనుభవం లేదు. ఆమె బంగ్లాదేశ్ ప్రధాని కూతురు. రాజకీయ నాయకులు ఆమెకు అండగా ఉన్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

అంత్యక్రియలు లేకుండా...



మణిపుర్‌లోని ఇంఫాల్, చురాచాంద్‌పుర్ ప్రభుత్వ ఆసుపత్రుల శవాగారాల్లో ఎవరూ తీసుకుపోని 94 శవాలు ఉన్నాయి. ఆరింటిని ఇంకా గుర్తించాల్సి ఉంది. చనిపోయినవారి బంధువుల తరఫున నిర్ణయం తీసుకుని 'సమయానికి మృతదేహాలకు అంత్యేష్టి జరపడంలో' పౌర సంఘాలు ఆటంకంగా ఉన్నాయని అధికారిక నివేదిక నిందిస్తోంది.

– విజైతా సింగ్, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

'కోతుల బెడద' తీర్చే హామీ కావాలి!

తెలంగాణలో కోతులు ఇండ్లనూ, పంటపొలాలనూ, తోటలనూ నాశనం చేస్తూ ఆర్థిక నష్టాన్ని కలుగజేయడమే కాక మనుషులపై దాడిచేసి తీవ్ర గాయాలపాలు చేస్తున్నాయి. తోటల్లో చెట్ల ఫలాలనే కాదు, పెరటిలో పెంచుకునే కూరగాయల మొక్కలు, జామ, అరటి, చింత, సపోట, ఆల్లనేరడి చెట్లను కూడా ఆక్రమించి అపార నష్టం కలుగజేస్తున్నాయి. దీంతో జనం ఏ మొక్కనూ పెంచడం లేదు. ఫలితంగా గుమ్మడి పువ్వు దొరుకక పసుపు గౌరమ్మతో బతుకమ్మను పేర్చుకునే పరిస్థితి దాపురించింది.

2016లో తెలంగాణ అసెంబ్లీలో కోతుల బెడదపై చర్చ జరిగింది. కోతుల బెడద భయంకరంగా ఉన్నదని స్వయంగా ముఖ్యమంత్రే ఒప్పుకున్నారు. ఇండ్ల మీది గూనపెంకులు కూడా పీకేస్తున్నాయని వాపోయారు. కోతులు ఉండే స్థలాలనూ, వాటి బతుకుదెరువునూ పోగొట్టడం వలననే కోతులు జనావాసాలకు వలస వచ్చినవని చెప్పారు. కోతులు వాపసు పోవాలంటే ఫల వృక్షాలను, మేడి, తునికి పండ్ల చెట్లను పెంచాలని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడూ సలహా చెప్పారు. కాని ఆయన ముఖ్యమంత్రి అయ్యి ఇంతకాలమవుతున్నా ఫల వృక్షాలను పెంచలేదు. కోతులను వాపసు పంపలేదు.

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి రైతులను ప్రభుత్వం పూరమాయించింది. అందుకు కోతుల బెడదను నివారించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన 2021 నవంబర్ 29న క్యాబినెట్ మీటింగ్ జరిగింది. డిసెంబర్ 1న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ రివ్యూ సమావేశం జరిపారు. కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు సూచించాలని వ్యవసాయ, పశుసంవర్ధక, అటవీశాఖ అధికారులను కోరారు. వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న ఉత్తమ ప్రాక్టీసులపై అధ్యయనం చేసి వారం రోజుల్లోగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కాని, ఇప్పటికీ కనీస కార్యాచరణ లేదు.

కోతుల బెడదను నివారించవలసిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉన్నది. 2023 నవంబర్ 30న తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ సందర్భంగా కోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో 'కోతుల బెడద నివారణపై తమ తమ ప్రణాళికలను తెలియచేయాలనే' డిమాండ్ వినిపిస్తోంది. మరి ఈ పని ఎవరు చేస్తారో చూడాలి!

– మేరుగు రాజయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి

పూల కవాతుగా... స్త్రీల కవాతుగా...

అభిప్రాయం



విమలక్క

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమ సమయంలో 'బాటలో బతుకమ్మ' అంటూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని మేం 2010లో ప్రారంభించిన ఉద్యమం 'బహుజన బతుకమ్మ'గా రూపుదిద్దుకొని 13 ఏళ్లు అయ్యింది. మహిళలు ప్రధానమైన ఆట–పాటలతో పూలను కొలిచే బతుకమ్మ లాంటి పండుగ ఉత్సవాన్ని తెలంగాణలోని అనేక సమస్యల పరిష్కారానికి చేసే కొట్లాటలకు ఊతమిచ్చే ఉద్యమంగానూ బహుజన బతుకమ్మను జరుపుతున్నాం. అందులో భాగంగానే ఈ ఏడు (2023) మనువాద దృక్పథంతో మహిళలపై జరుగుతున్న అన్ని రకాల అఘాయిత్యాలనూ ఎదిరిస్తూ, యువతను నిర్వీర్యం చేస్తున్న మద్యం మత్తును చిత్తు చేస్తూ దాని దోపిడీని అడ్డుకొంటూ 'స్త్రీల కవాతు'గా, 'పూల కవాతు'గా బహుజన బతుకమ్మను జరుపుకొందామని పిలుపునిస్తున్నాం. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) ప్రధాన శక్తిగా డజన్ల కొలది సంఘాలతో కలిసి 'బహుజన బతుకమ్మ' సాగుతోంది.



ప్రభుత్వాలకు ఒకప్పుడు భూమి శిస్తు ప్రధాన వనరుగా ఉండేది. కాని, ఆధునిక భారతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం ఆదాయం మీద ఆధారపడుతున్నాయి. ప్రజలను పీడించి వసూలు చేసే పన్నులలో మద్యం మీద పన్ను కూడా ఒకటి. పేదలకు పింఛన్లు, నగదు ఇస్తున్న పథకాలు ప్రకటిస్తూ, ఇంకొక వైపు పేదలను, సామాన్య ప్రజలను మత్తుకు బానిసలుగా చేసి, ప్రభుత్వ ఆదాయం పెంచుతున్నారు. ఎక్సైజ్ సుంకం ద్వారా రాష్ట్రాల ఆదాయం 1970–71లో రూ. 194 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ. 2.51 లక్షల కోట్లు అయ్యిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మద్యం అమ్మకాల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రూ. 40 వేలకోట్ల ఆదాయం సమకూరింది. గత రెండేళ్లలో రూ. 54,000 కోట్ల ఆదాయం వచ్చింది. మానవ వనరుల అభివృద్ధిని మరచి ఎన్నికల్లో గెలుపు కోసం తాగించి, తినిపించి, లంచాలిచ్చి ఒక్క మునుగోడు ఎన్నికల్లోనే పార్టీలు వెయ్యి కోట్ల రూపాయలు వెదజల్లాయంటే మద్యం కేవలం నైతిక సమస్య అనుకోగలమా? ఇది ఆర్థిక–సామాజిక దోపిడీగానే కాక రాజకీయ సాధనంగా మారిందని అర్థమవుతోంది. అందుకే డిస్టిలరీల్లో పనిచేసే కార్మికులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించి మద్యం ఉత్పత్తులను నిలువరించాలని ఎన్నికల ముంగిట్లో ఉన్న పాలక పార్టీలన్నింటినీ బహుజన బతుకమ్మ డిమాండ్ చేస్తోంది.

మద్య రహిత గ్రామాలతో మొదలై మద్యం రహిత సమాజానికి పునాదులు వేద్దాం. గంజాయివంటి మత్తు పదార్థాలను గ్రామాలు, పట్టణాల నుండి తరిమేద్దాం. మనువాద పితృస్వామిక ఆధిపత్యం నుండి మహిళల విముక్తికి నడుం కడదాం. స్త్రీలపై అన్ని రకాల అఘాయిత్యాలనూ ఎదిరిస్తూ విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో 'మేమెంతో మాకంత' అంటూ సమాన హక్కుల కోసం పోరాడుదాం.

వ్యాసకర్త ప్రజా గాయని, సాంస్కృతిక కార్యకర్త
(నేటి నుంచి అక్టోబర్ 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే 'బహుజన బతుకమ్మ' ఉత్సవాల సందర్భంగా)

మానవీయ అద్భుతం!

ఒక్కోసారి కొన్ని అనుకోని అద్భుత మానవీయ ఘటనలు చోటు చేసుకుంటాయి. అవి ఏ గుళ్లోనో, మఠంలోనో జరిగితే... దేవుడో లేదా మతాచార్యుడో అందుకు కారణం అనుకుంటాం. కంచి కామకోటి పీఠంలో ఒక రోజు జరిగిన ఉదంతం అటువంటిదే. ఒక రోజు ఓ వయస్సు మళ్ళిన దంపతులు ఓ పండ్ల సజ్జతో వచ్చి పరమాచార్యకు నమస్కరించారు. ఏం కావాలన్నట్లు చూశారు పరమాచార్య. 'అమ్మాయికి పెళ్ళి ఖాయమైంది. మేనమామకిచ్చి పెళ్ళి చేస్తున్నాం' అన్నారు వారు. 'బంధం తెగిపోకూడదని అలా చేస్తున్నారా' అన్నది పరమాచార్య ప్రశ్న. 'అది మాత్రమే కాదు, మరెవరికో ఇచ్చి పెళ్ళి చేసేంత స్తోమత మాకు లేదు. పెళ్ళి చేయడానికి కనీసపాటి డబ్బులు లేవు. మీరే ఏదన్నా దారి చూపాలి' అన్నారు దంపతులు. కాసేపు అక్కడ మౌనం నెలకొంది. వాళ్ళను అక్కడికి దగ్గర్లోనే కనిపిస్తున్న ఓ చెట్టు కింద కూర్చోమన్నారు పరమా చార్య. భార్యాభర్తలు తడిసిన కళ్ళతో అక్కడి నుంచి వెళ్ళి చెట్టు కింద కూర్చున్నారు.



ఓ పావు గంటైంది. ఓ కారు వచ్చి ఆగింది. కారులోంచి ఓ మార్వాడీ కుటుంబం కిందకు దిగింది. చేతిలో గుడ్డ కప్పిన ఓ పెద్ద పళ్ళెం ఉంది. దాన్ని పరమాచార్య ముందు ఉంచి నమస్కరించారు.

'ఏమిటది?' అడిగారు పరమాచార్య. అప్పుడు దంపతుల్లో భార్య మాట్లాడుతూ... తన భర్తకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగిందనీ, ఆపరేషన్ విజయవంతమై ఆయన కోలుకుంటే ఓ పేదింటి పిల్ల కల్యాణానికి సాయపడాలని మొక్కుకున్నామనీ, ఆ డబ్బే ఇదనీ చెప్పింది. 'మీరు ఎవరికి ఇవ్వమంటే వారికి ఈ పళ్ళెం ఇస్తాం' అన్నదామె. పరమాచార్య 'ఆ చెట్టు కింద కూర్చున్న వారిని వెంటనే తీసుకురా! వారికి ఈ పళ్ళెం ఇచ్చేద్దాం' అన్నారు సహాయకుడితో. డబ్బు తీసుకొచ్చినవారూ, పొందినవారూ, ఇదంతా చూస్తున్న వారూ చెమ్మగిల్లిన కళ్లతో పరమాచార్యను సంభ్రమాశ్చర్యాలతో వీక్షించారు. 'అంతా ఆ అమ్మవారి కృప. క్షేమంగా ఉండండి' అని దీవించారు పరమాచార్య.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

ఉపరాష్ట్రపతికి 'అలయ్ బలయ్' ఆహ్వానం

- జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసిన బండారు విజయలక్ష్మి



సాక్షి, న్యూఢిల్లీ: దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆహ్వానించారు. గత కొన్నేళ్లుగా తన తండ్రి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపరాష్ట్రపతికి విజయలక్ష్మి వివరించారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతిని సంస్థ ట్రస్టీ జనార్దన్‌రెడ్డి, విజయలక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతికి అలయ్ బలయ్ కార్యక్రమ ఆహ్వానపత్రాన్ని అందించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మాతృవియోగం



మంజుల

వేల్పూర్/సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి వేముల మంజులమ్మ(77) హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆమె చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి ఆమె మరణించడంతో నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రశాంత్‌రెడ్డి నివాసంలో విషాదం నెలకొంది. ఆమె అంత్యక్రియలు శుక్రవారం వేల్పూర్‌లో జరగనున్నాయి. మంత్రి వేముల మాతృమూర్తి మృతిపై సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు సంతాపం ప్రకటించారు.

కంట్లో బైక్ రాడ్




కంట్లో ఇరుక్కున్న రాడ్‌తో మిథున్ మండల్

వర్గల్(గజ్వేల్): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వలస కార్మికుడి కంట్లోకి బైక్ రాడ్ చొచ్చుకుపోయింది. రాడ్‌తోనే అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన గురువారం సిద్దిపేట జిల్లా వర్గల్ సమీపంలో చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన వలస కార్మికులు మిథున్ మండల్, శివ గురువారం బైక్‌పై శాకారం నుంచి వర్గల్‌కు వస్తున్నారు. అదే సమయంలో మాదారం గ్రామానికి చెందిన సీహెచ్ సాయికుమార్, అంకని మహేందర్ వర్గల్ నుంచి బైక్‌పై వస్తున్నారు. వర్గల్ శివారులో ఈ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మిథున్ మండల్ కంట్లోకి బైక్ కిక్ రాడ్ దూసుకెళ్లింది. అతడు కదలలేని స్థితిలో బైక్ మీద ఒరిగి అరగంటపాటు నరకయాతన అనుభవించాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేసి రాడ్ తొలగించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ప్రమాదంలో మిగతా ముగ్గురు గాయాలపాలయ్యారు.

డబ్బు కోసం వేధింపులు

- కుమారుడిని హత్య చేసిన తండ్రి



రాజేశ్

ఖమ్మంరూరల్: డబ్బు విషయమై ఘర్షణకు దిగుతున్నాడని, నిత్యం తాగి వచ్చి వేధిస్తున్నాడని ఓ తండ్రి తనకుమారుడిని హత్య చేసిన ఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరికి చెందిన కాలపొంగు రామారావుకు రాజేశ్(27), నవీన్ సంతానం. రాజేశ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. నవీన్ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రామారావు ఇటీవల నవీన్‌కు రూ.50 వేలు ఇచ్చాడు. అయితే, మద్యం సేవించి తరచూ గొడవపడే రాజేశ్, నవీన్ నడుమ ఈ డబ్బు చిచ్చు రాజేసింది. తనకు కూడా డబ్బులు ఇవ్వాలని రాజేశ్ గొడవ పడటం మొదలు పెట్టాడు. రాజేశ్ పెట్టే ఇబ్బందులు భరించలేక రామారావు, నవీన్ కలిసి హత్యకు పథకం వేశారు. గురువారం తెల్లవారు జామున ఇంటి ముందు రాజేశ్‌ను రామారావు పట్టుకోగా, నవీన్ బీర్ బాటిల్ పగలగొట్టి మెడపై పొడవగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ గొడవతో మేల్కొన్న మిగతా కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా రాజేశ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ఒక్క నియోజకవర్గాన్నీ వదలకుండా..

▶ మొదటి పేజీ తరువాయి

అంశంపైనా ఈ భేటీలో చర్చించినట్టు తెలిసింది.

ఎక్కడా వదలకుండా..

సీఎం కేసీఆర్ ఈ నెల 15 నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు 17 రోజుల్లో 41 బహిరంగ సభల్లో పాల్గొనేలా ఇప్పటికే షెడ్యూల్ ఖరారైంది. 10న నామినేషన్ల గడువు ముగిసి, తుది అభ్యర్థులు ఖరారవుతారు. ఆ తర్వాత మరో 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పాల్గొనేలా సభల షెడ్యూల్ రూపకల్పన చేస్తున్నారు. 'కార్పెట్ బాంబింగ్' తరహాలో వరుసగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం సాగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీఎం పాల్గొనే సభలన్నింటికీ భారీ జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. మరోవైపు కేటీఆర్, హరీశ్ సుమారు 60కిపైగా నియోజకవర్గాల్లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. గ్రేటర్ పరిధిలో కేటీఆర్, ఉమ్మడి మెదక్ జిల్లాలో హరీశ్‌రావు స్థానిక ప్రచార ఇన్‌చార్జులుగా ఉంటూనే.. తాము పోటీచేసే నియోజకవర్గాల్లో, ఇతర చోట్ల సమన్వయ బాధ్యతలను చూడాల్సి ఉండనుంది. ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు పార్టీలో సమన్వయంతోపాటు ఎన్నికల ప్రచారంలో క్రియాశీలకంగా పనిచేయనున్నారు. ఇక పార్టీ అభ్యర్థులపై ఒత్తిడి తగ్గించడం, ఇతర కీలక నేతలతో సమన్వయం కోసం కేసీఆర్ నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌చార్జుల నియామకాన్ని చేపట్టారు. ప్రస్తుతానికి 54 మంది పేర్లు ఖరారు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ కీలక నేతలు ఈ ఇన్‌చార్జుల జాబితాలో ఉన్నారు. ఇక నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించే బాధ్యతను హరీశ్‌రావుకు సీఎం కేసీఆర్ అప్పగించారు.

'వార్ రూమ్'తో వ్యూహాల అమలు

బీఆర్‌ఎస్ ఎన్నికల వ్యూహాలను పక్కాగా అమలు చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ, అభ్యర్థులతోపాటు విపక్షాల సమగ్ర సమాచారాన్ని క్షణాల్లో విశ్లేషించేలా సిద్ధం చేశారు. బూత్‌స్థాయి నుంచీ పార్టీల బలాలు, బలహీనతలు, స్థానికంగా ఎన్నికలను ప్రభావితం చేసే అంశాలు, సామాజికవర్గాల వారీగా ఓటర్ల వివరాలు వంటివన్నీ అందుబాటులో పెట్టారు. పార్టీ సోషల్ మీడియా వింగ్ బాధ్యులు జగన్మోహన్‌రావు, దినేశ్ చౌదరి, సతీశ్‌రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితరులు వార్‌రూమ్ కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు.

చేరికలపై మరింత ఫోకస్

బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విపక్షాల్లోని బలమైన నేతలెవరు, వారిలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఉన్న అవకాశం, పార్టీలో చేర్చుకునేందుకు తీసుకోవాల్సిన చొరవపై ఓ ప్రైవేటు సర్వే సంస్థ ఎప్పటికప్పుడు బీఆర్‌ఎస్ పెద్దలకు సమాచారాన్ని చేరవేస్తోంది. దీని ఆధారంగా ఇతర పార్టీల నుంచి చేరికలను వేగవంతం చేయాలని నేతలు భావిస్తున్నారు. విపక్షాల్లో టికెట్ దక్కని అసంతృప్తులను బీఆర్‌ఎస్ గూటికి చేర్చే వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డితోపాటు ఓ మాజీ మంత్రి త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది.



సాంస్కృతిక బృందానికి దిశానిర్దేశం

కవి గాయకుడు ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్ గురువారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలతోపాటు ఎన్నికల ప్రచారంలో కీలకమైన సాంస్కృతిక, కళా బృందాలు ఏమేం చేయాలన్న దానిపై వారికి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని చాటడంతోపాటు తెలంగాణ ఉద్యమకాలం నాటి సెంటిమెంటును రగిల్చేలా ఆటపాటలు ఉండాలని సూచించారు.

కాంగ్రెస్, బీజేపీ అన్ని రంగాల్లో విఫలం

- ఎమ్మెల్సీ కవిత ధ్వజం
- ఎజెండా ఏమిటో ఇండియా కూటమి చెప్పాలి



సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల పాటు దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీ అన్ని రంగాల్లో విఫలమయ్యాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్న ఇండియా కూటమి... ప్రజల కోసం ఏమి చేస్తుందో ఎజెండాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. దక్షిణాదిన బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని ఎద్దేవాచేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ చేసిన పనులు బీజేపీ 100 జన్మలెత్తినా చేయలేదన్నారు. చెన్నైలో ఏబీపీ నెట్‌వర్క్ సంస్థ గురువారం నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో 'సార్వత్రిక ఎన్నికలు 2024: ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడుతారు?'' అన్న అంశంపై జరిగిన చర్చా వేదికలో ఆమె మాట్లాడారు. టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌కు రూపాంతరం చెందడం, ఇండియా, ఎన్డీఏ కూటములకు బీఆర్‌ఎస్ సమదూరంగా ఉండడం, తెలంగాణ అభివృద్ధి, బీజేపీ పక్షపాతం వంటి అంశాల పై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత చేతన్ భగత్ సమన్వయకర్తగా వ్యవహరించిన చర్చా గోష్టిలో కవితతో పాటు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నమలై కూడా పాల్గొన్నారు.

బలమైన శక్తులుగా ప్రాంతీయ పార్టీలు: జాతీయ స్థాయిలో మరో రాజకీయ శక్తిగా ఎదగాలని బీఆర్‌ఎస్ భావిస్తోందని, తెలంగాణ తాము ఏం చేశామో దేశమంతా విస్తరిస్తామని కవిత ప్రకటించారు. తమ పార్టీ జాతీయ స్థాయిలో ఏ కూటమిలో ఉండదల్చుకోలేదని తేల్చిచెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్వతంత్రంగా ఎక్కువ సీట్లు సాధించగలరని, బీఆర్‌ఎస్ మాత్రమే కాకుండా ఎవరైనా గేమ్ చేంజర్ కావచ్చని అభిప్రాయపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఇండియా కూటమి పతనమవుతుందని, ఈ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో ఇండియా కూటమిలోనే పార్టీల అభిప్రాయం మారవచ్చునని తెలిపారు. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలు సీట్లు కోల్పోతాయని, జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోడానికి సిద్ధంగా లేవని తేల్చిచెప్పారు. దక్షిణాదిలో బీజేపీకి ఒక్క సీటు రాదని తేల్చిచెప్పారు.

కామన్వెల్త్ సదస్సుకు కరుణా గోపాల్‌కు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: దక్షిణాఫ్రికాలో జరగనున్న కామన్వెల్త్ లోకల్ గవర్నమెంట్ కాన్ఫరెన్స్‌కు భారతీయ జనతా పార్టీ నాయకురాలు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు కరుణా గోపాల్ వర్తకవికి ఆహ్వానం అందింది. కామన్వెల్త్ లోకల్ గవర్నమెంట్ ఫోరమ్ సెక్రటరీ జనరల్ (సీఎల్జీఎఫ్- లండన్) నుంచి ఈ ఆహ్వానం పంపించారు. నవంబర్ 14–17 తేదీల్లో రువాండాలోని కిగాలీలో ఈ సదస్సు జరగనుంది. రువాండా ప్రభుత్వం నిర్వహించనున్న ఈ కాన్ఫరెన్స్ థీమ్ 'బిల్డింగ్ రీసైలెన్స్ ఎక్రాస్ ది కామన్వెల్త్'. ఈ సదస్సుకు ప్రభుత్వాలు, డెవలప్‌మెంట్ ఏజెన్సీలు, ప్రైవేట్ రంగానికి చెందిన ఉన్నత స్థాయి వక్తలతో సహా కామన్వెల్త్‌లోని 56 సభ్య దేశాల నుంచి దాదాపు 500 మంది మేయర్లు, మంత్రులు, అధికారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కరుణా గోపాల్ వర్తకవి మాట్లాడుతూ.. భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనుండటం సంతోషంగా ఉందన్నారు.

పదేళ్ల అభివృద్ధితో ప్రజల్లోకి..

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కేటీఆర్
- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పిలుపు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు అన్ని నియోజకవర్గాల్లో సానుకూల వాతావరణం ఉందని, పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సూచించారు. ఎన్నికల సమన్వయం కోసం నియమించిన 54 మంది నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిలతో మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై ఇన్‌చార్జిలకు దిశా నిర్దేశం చేశారు. పదేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుకున్న ప్రతీ ఒక్కరితో మమేకమయ్యేలా పార్టీ ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికలు కేవలం హామీలిచ్చేందుకు వేదికలు మాత్రమేనని, బీఆర్‌ఎస్‌కు మాత్రం తాము చేసిన అభివృద్ధిని వివరించే అద్భుత అవకాశమన్నారు. ఇన్‌చార్జిలు తక్షణమే రంగంలోకి దిగి ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

సహకారం అందించండి: హరీశ్



రాబోయే 45 రోజులపాటు నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్వహణ మొదలుకొని నియోజకవర్గ స్థాయి వరకు అన్ని దశల్లో ప్రచారం పకడ్బందీగా ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, ఆ దిశగా ఈ 45 రోజులపాటు విస్తృతంగా పనిచేయాలని ఇన్‌చార్జిలకు హరీశ్ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కమిషన్ చర్య సర్కార్‌కు చెంపపెట్టు: నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఎన్నికల విధులకు దూరంగా పెడుతూ ఎన్నికల కమిషన్ బదిలీ ఉత్తర్వులు జారీ చేయడం కేసీఆర్ ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని, ఇది కేసీఆర్ పాలనకు నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి చెందిందని దేశమంతా గొప్పగా చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేసీఆర్ వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని, గవర్నర్ పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు తాము చెప్పినట్టే వినాలని ఖమ్మంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాత మధు వ్యాఖ్యానించారని, ఇది ఎన్నికల ప్రవర్తనావళికి విరుద్ధమన్నారు. కాంగ్రెస్ వాళ్ల డబ్బులు కర్ణాటక నుంచి వస్తున్నాయని, వాటిని తీసుకొని ఓటు బీఆర్‌ఎస్‌కు వేయాలని కేటీఆర్ చెబుతుండటం కూడా ఓటర్లను ప్రభావితం చేయడమేనని పేర్కొన్నారు.

కామారెడ్డికి కేటీఆర్.. గజ్వేల్‌కు హరీశ్..

54 నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జుల నియామకం

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ 54 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల ఇన్‌చార్జులను నియమించింది. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డిలో ఎమ్మెల్యే గంప గోవర్దన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జులుగా పని చేస్తారు. కేసీఆర్ పోటీ చేసే మరో నియోజవకర్గం గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోటీ చేస్తున్న జనగామలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బోడకుంటి వెంకటేశ్వర్లుతోపాటు మంత్రి హరీశ్ రావు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తారు. ఇతర నియోజకవర్గాలకు ఎంపీ వెంకటేష్ నేత (బెల్లంపల్లి), ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు(మంచిర్యాల), ఎమ్మెల్సీ దండెవిఠల్ (ఖానాపూర్), మాజీ ఎంపీ నగేష్ (బోథ్), మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కుమార్ (ముథోల్), ఎమ్మెల్సీ కవిత (బోధన్), మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్ (ఎల్లారెడ్డి), ఎమ్మెల్సీ కవిత (నిజామాబాద్ అర్బన్), ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి రాజేశం గౌడ్ (జగిత్యాల), మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ (రామగుండం), కార్పొరేషన్ మాజీ చైర్మన్ శంకర్ రెడ్డి (మంథని), సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్(పెద్దపల్లి), మంత్రి గంగుల కమలాకర్(చొప్పదండి), మాజీ ఎంపీ వినోద్ కుమార్(వేములవాడ), సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణ(వేములవాడ), రాష్ట్ర నాయకుడు కె. తిరుపతిరెడ్డి(మెదక్), మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్(ఆందోల్), ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి(నర్సాపూర్), మాజీ చైర్మన్ దేవీప్రసాద్(జహీరాబాద్), కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, భూపాల్ రెడ్డి(సంగారెడ్డి), టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు(దుబ్బాక),ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు(మల్కాజ్ గిరి), కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి(ఉప్పల్), మాజీ ఎమ్మెల్యే తీగల కష్ణారెడ్డి(ఇబ్రహీంపట్నం), ఎంపీ రంజిత్ రెడ్డి (చేవెళ్ల), ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్(ముషీరాబాద్), నాయకులు కట్టెల శ్రీనివాస్ యాదవ్, మోహన్ రావు(అంబర్‌పేట్), మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్(సికింద్రాబాద్ కంటోన్మెంట్), సాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్(మక్తల్), మాజీ చైర్మన్ రాకేష్ చిరుమల్ల(గద్వాల్), ఎమ్మెల్సీ చల్లా వెంకట్రమణరెడ్డి(అలంపూర్), కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఆసాక్(అచ్చంపేట), చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి(కల్వకుర్తి), ఎంపీ రాములు(కొల్లాపూర్), ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ రాంచందర్ నాయక్(నాగార్జున సాగర్), మాజీ ఎమ్మెల్యే విజయసంహారెడ్డి(హుజూర్ నగర్), ఎమ్మెల్సీ రవీందర్ రావు(కోదాడ), జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి(నల్లగొండ), ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్(నకిరేకల్), మాజీ ఎమ్మెల్సీ బొడకుంటి వెంకటేశ్వర్లు, రైతుబంధు సమితి చైర్మన్ రాజయ్య, ఇంచార్జిమంత్రి హరీశ్ రావు(జనగాం), మంత్రి సత్యవతి రాథోడ్(మహబూబాబాద్), చైర్మన్ వి.ప్రకాశ్(నర్సంపేట), శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ (వరంగల్ ఈస్ట్), ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య(భూపాలపల్లి), ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి(ములుగు), ఎంపీ వద్దిరాజు రవిచంద్ర(ఇల్లందు), మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, నాయకుడు కొండబాల కోటేశ్వర్ రావు(మధిర), ఎంపీ నామా నాగేశ్వర్ రావు(వైరా), ఎంపీ పార్థసారథిరెడ్డి(సత్తుపల్లి), ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ శేషగిరిరావు(అశ్వారావుపేట), ఎమ్మెల్సీ తాతా మధు (భద్రాచలం)కు పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యతలు అప్పగించారు. వీరంతా శుక్రవారం నుంచే నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు.

అత్తను కాల్చి చంపిన అల్లుడు

- ఆర్థిక లావాదేవీలు, కుటుంబ కలహాలే కారణం
- నిందితుడు రామగుండం కమిషనరేట్‌లో కానిస్టేబుల్
- స్టేషన్ హౌస్ ఇన్‌చార్జ్ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చివేత
- వరంగల్‌లో కలకలం

హసన్‌పర్తి/కోటపల్లి: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వనందుకు, అలాగే కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కానిస్టేబుల్ .. పోలీస్ సర్వీస్ రివాల్వర్‌తో అత్తను కాల్చి చంపాడు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం గుండ్లసింగారంలో గురువారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. వరంగల్ నగరంలోని కీర్తినగర్‌కు చెందిన అడ్డె ప్రసాద్‌కు గుండ్లసింగారానికి చెందిన రమాదేవితో 22 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రసాద్ కుటుంబం పాటు అత్త కుటుంబసభ్యులు గుండ్లసింగారంలో వేర్వేరు ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ప్రసాద్ ప్రస్తుతం రామగుండం కమిషనరేట్ పరిధిలోని కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్(రైటర్)గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలం క్రితం ప్రసాద్ తన అత్త కమలాదేవి(58)కి రూ.4లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆ అప్పు తిరిగి చెల్లించకపోవడంతో పాటు భార్యతో సైతం విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో ప్రసాద్‌పై ఇటీవల నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది.

అత్తను మంచినీళ్లు అడిగి మరీ కాల్చి చంపి..

గురువారం పోలీస్‌స్టేషన్ నుంచి ఆ స్టేషన్ హౌస్ ఇన్‌చార్జ్‌కి సంబంధించిన సర్వీస్ రివాల్వర్‌ను తన వెంట తీసుకొచ్చాడు. గురువారం నేరుగా అత్త కమలాదేవి ఉంటున్న ఇంటికి వెళ్లి తాగేందుకు మంచినీరు కావాలని అడిగాడు. లోనికి వెళ్లి కమలాదేవి నీళ్లు తీసుకుని వచ్చే క్రమంలో రివాల్వర్ ఎక్కు పెట్టగా ఆమె భయంతో వెనక్కి తిరిగింది. వెంటనే ఆమె వీపుభాగంలో కాల్చాడు. దీంతో ఆమె అరుచుకుంటూ గేటు నుంచి రోడ్డు దగ్గరికి దాదాపు పది అడుగుల దూరం వచ్చి కుప్పకూలింది. తూటా శబ్దానికి కొద్దిదూరంలో ఉన్న ప్రసాద్ భార్య రమాదేవి, ఇతరులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కూతురు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. మొదట అత్త, బామ్మర్దిని చంపిన తరువాత ఇంటికి వెళ్లి భార్యను చంపాలని నిర్ణయించుకుని వచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు.



కమలాదేవి



ప్రసాద్

నిందితుడిపై దాడి..

కమలాదేవిని చంపిన తరువాత అక్కడే దర్జాగా కుర్చీలో కూర్చున్న ప్రసాద్‌పై కుటుంబ సభ్యులు రాళ్లతో దాడి చేశారు. దీంతో అతని తల పగిలిపోవడంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నన్నూ చంపుతానన్నాడు: రమాదేవి

'ఎనిమిది నెలలుగా ప్రసాద్ వేధింపులకు గురి చేస్తున్నాడు. నా పై కంప్లయింట్ చేసి డిపార్ట్‌మెంట్‌లో పరువు తీస్తావా.. చంపుతానని నన్ను బెదిరించాడు. చివరికి నా తల్లిని పొట్టన పెట్టుకున్నాడు' అంటూ రమాదేవి బోరున విలపిస్తూ తెలిపింది.



కమలాదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు. (ఇన్‌సెట్‌లో) ఘటనాస్థలిలో రివాల్వర్

గన్ మిస్సింగ్‌పై విచారణ: ప్రసాద్ మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుండడంతో రామగుండం కమిషనరేట్ పోలీసులు గన్ మిస్సింగ్‌పై గురువారం విచారణ చేపట్టారు. ప్రసాద్ బుధవారం సాయంత్రం వారెంటు కావాలని విధుల్లో ఉన్న పోలీసు అధికారిని అడగడంతో బెల్ ఆఫ్ ఆర్మ్ గదిలో ఉన్న వారెంటు బుక్ తీసుకురావాలని అతడికే చెప్పినట్లు, ఆ క్రమంలో వారెంట్ బుక్ తీసుకునేందుకు వెళ్లిన ప్రసాద్ అక్కడే ఉన్న షార్ట్ గన్‌ను వెంట తీసుకొచ్చి ఉంటాడని పోలీసు అధికారులు భావిస్తున్నారు. కాగా, గతంలో హోంగార్డుగా పని చేసిన ప్రసాద్ 2012–13లో కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో పెద్దపల్లి జిల్లాలో పని చేశాడు. మొదటి నుంచి వివాదాస్పద వైఖరేనని, మద్యానికి బానిసై విధుల్లో నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులతో గొడవ పడేవాడని పోలీసు సిబ్బంది చెబుతున్నారు. కాగా, ఆయుధం అపహరణపై కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది.

నెత్తురోడిన రహదారులు

మేడ్చల్‌రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రావల్‌కోల్ గ్రామానికి చెందిన భానుగౌడ్(17)ఇంటర్ చదువుతుండగా, అదే గ్రామానికి చెందిన బండారి హరికృష్ణ(21) డిగ్రీ చదువుతున్నాడు. గురువారం తెల్లవారు జామున వారు బైక్‌పై మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో కిష్టాపూర్ నుండి మేడ్చల్ చెక్‌పోస్ట్ వైపు వెళ్తున్న బొలెరో వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో భాను,హరిక్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందారు.

టిప్పర్ ఢీ కొని సైక్లిస్ట్ మృతి...: స్థానిక కిందిబస్తీకి చెందిన మునావర్ ఖాన్(44) గురువారం ఉదయం సైకిల్‌పై మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి ఇంటికి వస్తుండగా కిష్టాపూర్ నుంచి చెక్‌పోస్ట్ వైపు వస్తున్న టిప్పర్ మునావర్ ఖాన్‌ను ఢీ కొట్టింది. లారీ చక్రాలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బైక్ అదుపుతప్పి సేల్స్‌బాయ్..

కీసర: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాల్‌బజార్‌కు చెందిన గోపాల్ (33) అదే ప్రాంతానికి చెందిన పాల ఉత్పత్తుల వ్యాపారి వద్ద సేల్స్‌బాయ్‌గా పని చేసేవాడు. గురువారం సాయంత్రం పాల ఉత్పత్తులను తీసుకుని అతను కుషాయిగూడ నుంచి బైక్‌పై నాగారం వైపు వెళుతుండగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో స్పీడ్‌బ్రేక్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలపాలైన గోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీరాజ్
(గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క సంస్థ)
రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది 26.10.2023

నెలకు రూ.20,000/- కన్సాలిడేటెడ్ రెమ్యూనరేషన్‌తో ప్రాథమికంగా ఒక సంవత్సర కాలానికి కాంట్రాక్చువల్ ప్రాతిపదికన **స్విమ్మింగ్ కోచ్** ఉద్యోగం కోసం **వాక్ ఇన్ ఇంటర్వ్యూ** నిర్వహించుటకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ అయిన NIRDPR ప్రతిపాదిస్తోంది. జాబ్ ప్రొఫైల్, అర్హతా ప్రమాణాలు, రెమ్యూనరేషన్ మరియు ఇతర వివరాల కోసం దర్శించండి: **www.nirdpr.org.in**

Advt.No.35/2023
File No: PRO/Misc/2018/3
Comp.no. 6619

సం/-
అసిస్టెంట్ డైరెక్టర్
అడ్మినిస్ట్రేషన్ (సెక్షన్ –I)

ACHARYA N.G.RANGA AGRICULTURAL UNIVERSITY
ADMINISTRATIVE OFFICE, LAM, GUNTUR-522034, ANDHRA PRADESH
P.G. & Ph.D. ADMISSIONS - 2023-24 - NOTIFICATION
Notification No. 000322/PG/A1/2023, Date : 11.10.2023

Online applications are invited from eligible candidates for admission into PG & Ph.D. programme in three faculties viz., Agriculture, Agricultural Engineering & Technology and Community Science and SFQ (Agribusiness Management) of ANGRAU, Guntur for the Academic Year 2023-24. Upload the applications with relevant documents duly attested by Gazetted Officer between 13.10.2023 (10.00 AM) to 03.11.2023 (11.59 PM) and the hardcopy of the application (downloaded from) submitted through online and attested photocopies of enclosures should reach the undersigned before 04.00 PM on 09.11.2023.
For any further and update information visit University website www.angrau.ac.in regularly.

Sd/- REGISTRAR

DIPR RO No.2404PP/CL/Advt/1/1/2021-22, Dt: 12.10.2023

Telugu and Sanskrit Akademi
G-3, Prime Hill Crest Building, Vaddeswaram, Mangalagiri, Guntur- 522502 Cell: 7337360600
Notification
Notification No: 01/APTA/2023, Dt:11-10-2023

A.P. Telugu and Sanskrit Akademi which is premier body in the domain of spreading knowledge in Telugu publishes books in various subjects in both Telugu and English media including Text books for Intermediate, U.G. & P.G. Program books and Books for Competitive Examinations conducted by various bodies including APPSC and UPSC. Further it is proposed to publish a monthly magazine with Articles on different topics of current importance Science/Economics etc. for the benefit of General Readers. In this connection 'Telugu and Sanskrit Akademi invites Authors, Editors, Resource Persons and Subject Experts who desire to provide content for the books published by the Akademi both Telugu and English media to send their resume duly including their experience in the area of content creation & publishing. List of their publications with details may also be submitted along with resume to aptadirector@gmail.com on or before 30-11-2023.

Sd/- V.Ramakrishna, IRS, Director, Telugu and Sanskrit Akademi

DIPR RO No.2402PP/CL/Advt/1/1/2021-22, Dt: 12.10.2023

వరంగల్ మహానగర పాలక సంస్థ
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.E-133353/2023 తేది:11-10-2023

ఇందుమూలముగా వరంగల్ నగర ప్రజలకు తెలియజేయునది ఏమనగా తెలంగాణ పురపాలికల చట్టం 2019 క్రింద, 2023-2024 సంవత్సరమునకు అనగా దివి.20-10-2023 నుండి 19-10-2024 వరకు వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని కోతులు పట్టుట కొరకు టెండర్ ప్రకటనలోని షరతులకు లోబడి అదనపు కమిషనర్ చాంబర్, వరంగల్ మహానగర పాలక సంస్థ నందు దివి.18-10-2023 రోజున ఉదయం 11.00 సమయం నందు కమిషనర్ గారు లేదా వారిచే అధీకృత నొసంగిన అధికారిచే సీల్డ్ కవర్ బాక్స్ టెండర్ నిర్వహించబడును. టెండర్‌దారుడు సీల్డ్ కవర్‌ను దివి.17-10-2023 సాయంత్రం 5.00 గంటల లోపు GWMC ముఖ్య కార్యాలయం నందు సంబంధిత టెండర్‌బాక్స్‌లో వేయవలెను.

నియమ నిబంధనలు:

1.టెండరుదారుడికి కోతులు పట్టుటలో అనుభవము కలిగి యుండవలెను మరియు ఇంతకుమునుపు మున్సిపాలిటీలో/కార్పొరేషన్‌లో కోతులు పట్టిన అనుభవ ధృవపత్రము జతపరచవలెను. 2. విధి నిర్వహణలో ఊహించని సంఘటనల వలన జరుగు కష్టనష్టాల బాధ్యత టెండరుదారునిదే. 3. టెండర్ ఆమోదించు లేక తిరస్కరించు అధికారము చట్ట రీత్యా వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ గారు కలిగియున్నారు. 4. ఆసక్తి గల టెండర్‌దారు రూ.20,000/- విలువ గల గల ధరావత్తు సొమ్ము Commissioner, Greater Warangal Municipal Corporation గారి పేరు మీద D.D రూపంలో చెల్లించి టెండర్‌లో పాల్గొనవలెను. 5.GWMC నిర్ణయించిన టెండరు ధర రూ.420/- కోతి ఒక్కంటికి. 6.కోతులు పట్టునపుడు ఫోటోలు తీయవలెను,ఫారెస్ట్‌కి పంపించే ముందు మరియు వదిలే సమయంలో Google Mapping చేయవలెను. 7.టెండర్‌దారు నెలలో అన్ని దినములలో తప్పనిసరిగా కోతులు పట్టి సంబంధించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మరియు శానిటరీ సూపర్‌వైజర్ ద్వారా ధృవీకరించవలెను. 8.మున్సిపల్ కమిషనర్ గారు లేక వారిచే అధికారమొసంగింపబడిన అధికారుల ఆదేశములు/సూచనల మేరకు పట్టిన కోతులను ఏటూరు నాగారం, పస్ర చెక్‌పోస్ట్, ములుగు డిస్ట్రిక్ట్ అటవీ అధికారి (FRO/DFO) చేత కోతులను వదిలినానని వారి చేత ధృవీకరించిన పత్రము ప్రజారోగ్యాధికారికి/ వెటరినరీ అధికారి గారికి సమర్పించవలెను. 9.టెండర్‌కు సంబంధించిన నిబంధనలు ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి యుండును. 10.టెండర్ నిబంధనల ప్రకారము పనిని నిర్వహించక పోయినను లేదా వాటిని అతిక్రమించినను అందువలన జరుగు నష్టమునకు దానికి తగినట్లు గాని లేక రెట్టింపు గాని జరిమానా విధించబడును. 11. టెండర్‌దారు తప్పనిసరిగా పాన్‌కార్డు కలిగియుండవలెను. 12.గెలుపొందిన టెండర్‌దారు రూ.100/-ల నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్ పై టెండర్ నియమనిబంధనల ప్రకారము ఒప్పందం/అగ్రిమెంట్ చేయవలసి యుండును. 13.గెలుపొందిన టెండర్‌దారు నగర పరిధిలో నివసించవలెను. ప్రజారోగ్యాధికారి/వెటరినరీ అధికారి అనుమతి పొందకుండా టెండర్‌దారు నగరము విడిచి వెళ్ళరాదు. అట్లు వెళ్ళినచో శాఖాపరమైన చర్యలు తీసుకోబడును.

సం/- కమిషనర్, వరంగల్ మహానగర పాలక సంస్థ

DIPR RO No.8125-PP/CL/Advt/1/2023-24, Dt: 12-10-2023

క్లుప్తంగా...

స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు భారత్ మద్దతు

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ

న్యూఢిల్లీ: స్వతంత్ర, సార్వభౌమత్వ పాలస్తీనా దేశ ఏర్పాటుకు భారత్ మద్దతు ఇస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ గురువారం చెప్పారు. భారత్ చాలా ఏళ్లుగా ఇదే వైఖరి కొనసాగిస్తోందని తెలిపారు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు చర్చలు పునఃప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాలు శాంతియుతంగా కలిసి జీవించాలని భారత్ ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గుర్తించిన సరిహద్దుల మధ్య పాలస్తీనా ప్రజలు భద్రమైన జీవితం గడపాలన్నదే భారత్‌విధానమని, అందులో ఎలాంటి మార్పు లేదని అరిందమ్ బాగ్చీ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైన తర్వాత పాలస్తీనా అంశంపై భారత్ నుంచి ఇలాంటి ప్రకటన రావడం ఇదే మొదటి సారి. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని భారత ప్రధాని మోదీ ఖండించిన సంగతి తెలిసిందే.

ఆపరేషన్ అజయ్ 230 మందితో తొలి విమానం

జెరూసలేం: ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన భారతీయులను క్షేమంగా స్వదేశానికి చేర్చడానికి భారత ప్రభుత్వం 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది. వారికోసం ప్రత్యేకంగా చార్టర్డ్ విమానం ఏర్పాటు చేసింది. ఉచితంగానే ఇండియాకు పంపిస్తున్నట్లు భారత విదేశాంగ వెల్లడించింది. 230 మంది భారతీయులతో మొదటి విమానం గురువారం సాయంత్రం ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌కు బయలుదేరినట్లు తెలియజేసింది. స్వదేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్న భారతీయులు ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని విదేశాంగ శాఖ సూచించింది.

యూదులకు అత్యంత ఘోరమైన రోజు: బైడెన్

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. జర్మనీలో జరిగిన నరమేధం(హోలోకాస్ట్) తర్వాత యూదులకు ఇది అత్యంత ఘోరమైన రోజు అని చెప్పారు. భయానకమైన హోలోకాస్ట్ అనుభవాలు యూదులకు మళ్లీ జ్ఞప్తికి వచ్చాయని, వారిని తీవ్ర ఆవేదనకు గురి చేశాయని అన్నారు. హమాస్ మిలిటెంట్ల దాడులను అత్యంత క్రూరమైన చర్యగా బైడెన్ అభివర్ణించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు మానవ చరిత్రలో చేదు అధ్యాయమని అన్నారు. మిలిటెంట్లు చిన్నపిల్లల తలలు నరికేస్తారని తాను ఏనాడూ ఊహించలేదన్నారు.

'బిల్కిస్ బానో' కేసులో దోషుల శిక్ష తగ్గింపు ఫైళ్లను మా ముందుంచండి: సుప్రీం

న్యూఢిల్లీ: బిల్కిస్ బానోపై గ్యాంగ్ రేప్, ఆమె కుటుంబంలోని ఏడుగురి హత్య కేసులో దోషులకు శిక్ష తగ్గింపునకు సంబంధించిన ఒరిజినల్ ఫైళ్లన్నిటినీ తమ ముందుంచాలని సుప్రీంకోర్టు కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈనెల 16వ తేదీలోగా వీటిని అందజేయాలని గురువారం కోరింది. ఈ కేసులో తీర్పును రిజర్వు చేసినట్లు తెలిపింది. ఈ కేసులో 11 మంది దోషుల శిక్ష తగ్గింపును సవాల్ చేస్తూ బిల్కిస్ బానో, తదితరులు వేసిన పిటిషన్లపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఆగస్టు నుంచి విచారణ సాగిస్తోంది. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానో అయిదు నెలల గర్భవతి. కొందరు దుండగులు బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడటంతోపాటు మూడేళ్ల కూతురు సహా ఆమె కుటుంబంలోని ఏడుగురిని చంపేశారు. ఈ దురాగతంలో దోషులుగా తేలిన 11 మందికి కోర్టు 2008లో యావజ్జీవ కారాగారం విధించింది. ఆ శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం మొత్తం 11 మందినీ గత ఏడాది ఆగస్టులో విడుదల చేసింది.

'గంగాజలంపై కూడా జీఎస్టీయా..?': ఖర్గే

న్యూఢిల్లీ: హిందువులకు పవిత్రమైన గంగాజలంపై 18శాతం జీఎస్టీ విధించడం ఎంతవరకు సరైనదని కాంగ్రెస్ ప్రశ్నించింది. పూజలు, పుణ్యకార్యాల్లో వినియోగించే గంగాజలంపైన కూడా జీఎస్టీ విధించడమంటే అంతకంటే దోపిడి మరొకటి ఉండదని విమర్శించింది. ''మోదీజీ...గంగానదితో భారతీయులకి విడదీయలేని అనుబంధం ఉంది. జననం నుంచి మరణం వరకు ఆ నది జలాలు మనకి ఎంతో ముఖ్యమైనవి. అలాంటి నదీ జలాలపై 18% జీఎస్టీ ఎలా విధిస్తారు'' అని ఖర్గే తన పోస్టులో ప్రశ్నించారు. అయితే సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ కాంగ్రెస్ వ్యాఖ్యల్ని తోసిపుచ్చింది. గంగాజలంపై తాము ఎలాంటి పన్ను విధించలేదని స్పష్టం చేసింది.

పీ20 భేటీకి కెనడా గైర్హాజరు

న్యూఢిల్లీ: ఢిల్లీలో గురువారం ప్రారంభమైన జీ20 దేశాల పార్లమెంట్ స్పీకర్ల (పీ20)భేటీకి కెనడా స్పీకర్ రెమొండే గగ్నే గైర్హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన గురువారం ఢిల్లీలో పీ20 సమావేశం మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరవుతానంటూ మొదటగా ఆమె తెలిపారని, మళ్లీ ఆ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు సమాచారం అందించారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి.

వైష్ణోదేవి ఆలయంలో రాష్ట్రపతి ముర్ము పూజలు

కాట్రా: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రఖ్యాత వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఆమె పూజలు చేశారు. అనంతరం 200 మీటర్ల స్కైవాక్‌తోపాటు, ఆధునీకరించిన పార్వతి భవన్‌ను ప్రారంభించారు. రాష్ట్రపతి రియాసి జిల్లా త్రికూట పర్వతాల్లో వైష్ణోదేవి ఆలయానికి చేరుకున్నారు.



ఇజ్రాయెల్‌లోని కిబ్బుట్జ్‌లో ప్రజలకు ఆయుధాల పంపిణీ



గాజా స్ట్రిప్‌లో ధ్వంసమైన శరణార్థి శిబిరం నుంచి క్షతగాత్రుల తరలింపు



ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన చిన్నారులకు గాజా సిటీలోని షిఫా ఆస్పత్రిలో చికిత్స

గాజాపై భూతల యుద్ధం!

హమాస్ మిలిటెంట్లను నిర్మూలించడమే లక్ష్యం | సన్నాహాలు ప్రారంభించిన ఇజ్రాయెల్ సైన్యం | 3.60 లక్షల మంది రిజర్వ్ సైనికులు సిద్ధం

- గాజాను ఆక్రమించుకొనే యోచనలో నెతన్యాహూ ప్రభుత్వం
- ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు ఉధృతం
- యుద్ధంలో 2,600కు చేరిన మృతుల సంఖ్య
- ఇజ్రాయెల్‌లో 1,300 మంది,
- గాజాలో 1,350 మంది మృతి

జెరూసలేం/వాషింగ్టన్: చుట్టూ ఎటు చూసినా శిథిలాలు.. వాటి కింద చిక్కుకున్న మృతదేహాలు, కడుపులో మంటలు రేపుతున్న ఆకలి, తాగునీరు కూడా లేక తడారిపోతున్న గొంతులు, రాత్రయితే కరెంటు లేక చిమ్మచీకటి, మరోవైపు మృత్యువు ఎటువైపు నుంచి దాడి చేస్తుందో, రాకెట్లు, డ్రోన్లు ఎప్పుడు వచ్చిపడతాయో, ఎవరి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయోనన్న భయాందోళన. గాజాలో కనిపిస్తున్న హృదయవిదారక దృశ్యాలివీ. ఆహారం కోసం జనం దుకాణాలు, బేకరీల ముందు బారులు తీరుతున్నారు. చాలావరకు అవి ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. దుకాణాల్లో తిండిగింజలు, నిత్యావసరాలు ఎప్పుడో నిండుకున్నాయి. గాజా ప్రజలకు ఆకలి తీర్చుకోవడం, ప్రాణాలు కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యంగా మారిపోయింది. చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గాజా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐక్యరాజ్య సమితి శిబిరాల్లో లక్ష మందికిపైగా జనం ఆశ్రయం పొందుతున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం ఆరో రోజు గురువారం కూడా కొనసాగింది. ఇరుపక్షాల మధ్య పోరు ఉధృతంగా మారింది. ఇజ్రాయెల్ సైన్యం గాజాపై శక్తివంతమైన రాకెట్లు ప్రయోగించింది. హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. గాజా నుంచి రాకెట్ల వర్షం కురిపించారు. ఇరువర్గాల మధ్య యుద్ధంలో మృతుల సంఖ్య 2,600కు చేరింది. గాజాలో 1,350 మందికిపైగా జనం మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. తమ దేశంలో 222 మందిసైనికులు సహా 1,300 మంది మృతి చెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

ఇజ్రాయెల్ పదాతి దళాలు సన్నద్ధం

హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా గాజాపై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం ఇక భూతల యుద్ధానికి సన్నద్ధమవుతోంది. గాజాలో అడుగుపెట్టి, ప్రతి ఇల్లూ గాలిస్తూ మిలిటెంట్లను ఏరిపారేయడానికి మిలటరీ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. తమ దేశ భద్రతకు సవాలు విసురుతున్న మిలిటెంట్లను సమూలంగా నిర్మూలించడమే ఆశయంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. తమ పదాతి దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడమే మిగిలి ఉందని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ చెప్పారు. గ్రౌండ్ ఆపరేషన్ కోసం 3.60 లక్షల మంది రిజర్వ్ సైనికులను ఇజ్రాయెల్ సిద్ధం చేసింది. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లోని యూదుల కాలనీలను ఖాళీ చేయించింది. యూదులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భూతల దాడుల వల్ల గాజాలో మరణాలు భారీగా పెరుగుతాయని, సామాన్య ప్రజలు బలైపోతారని అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ పునరాలోచన చేయాలని కోరుతున్నాయి.

సిరియా ఎయిర్‌పోర్టులపై ఇజ్రాయెల్ దాడులు

సిరియాలోని రెండు విమానాశ్రయాలపై ఇజ్రాయెల్ సైన్యం గురువారం వైమానిక దాడులు నిర్వహించింది. రాజధాని డమాస్కస్‌తోపాటు అలెప్పోలోని ఎయిర్‌పోర్టులపై ఈ దాడులు చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. హమాస్‌కు సిరియా అండగా నిలుస్తున్న సంగతి విదితమే. సిరియా భూభాగం నుంచి కూడా ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు జరుగుతున్నాయి. సిరియాకు చేరుకోవాల్సిన ఇరాన్ విమానాన్ని ఇజ్రాయెల్ దాడుల కారణంగా టెహ్రాన్‌కు మళ్లించారు. ఈ విమానంలో ఇరాన్ దౌత్యవేత్తలు ఉన్నట్లు సమాచారం.

బందీలను విడుదల చేస్తేనే..

40 కిలోమీటర్ల పొడవు, 10 కిలోమీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఉన్న గాజాలో 20 లక్షల మందికిగా జనం నివసిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పరిగణిస్తుంటారు. గాజాకు ఆహారం, తాగునీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాను ఇజ్రాయెల్ ఇప్పటికే పూర్తిగా నిలిపివేసింది. కరెంటు లేక ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ సైనికులు, పౌరులను విడుదల చేయాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. బందీలను విడుదల చేసేంత వరకు గాజాకు ఆహారం, నీరు, ఇంధనం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ గురువారం హెచ్చరించారు. బందీలంతా విడుదలై, క్షేమంగా ఇళ్లకు చేరుకున్న తర్వాతే గాజాకు ఆహారం, నీరు, కరెంటు అందుతాయని 'ఎక్స్'లో పోస్టు చేశారు. మిలిటెంట్ల చేతిలో 150 మందికిపైగా బందీలు ఉన్నట్లు తెలుస్తోంది.



గాజా సరిహద్దుల్లో హొవిట్జర్ గన్‌లను మోహరించిన ఇజ్రాయెల్ ఆర్మీ

ఇజ్రాయెల్‌లో అలా..



ఇజ్రాయెల్‌లోని సిదెరాట్‌లో ఆత్మ రక్షణ కోసం ఎం16 అసాల్ట్ రైఫిల్‌తో షాపింగ్‌కు వచ్చిన యువతి

గాజా సిటీలో ఇలా..



గాజా సిటీలో ప్రాణాలరచేత బట్టుకుని ఇద్దరు చిన్నారులతో వీధిలో పరుగెడుతున్న బాలిక

హమాస్‌ను నలిపేస్తాం: నెతన్యాహూ



పాలస్తీనా సాయుధ తిరుగుబాటు సంస్థ 'హమాస్'ను నలిపి పారేస్తామని, పూర్తిగా ధ్వంసం చేస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతినబూనారు. తమ దేశంపై దాడి చేసి, ప్రజల ప్రాణాలను బలిగొన్న హమాస్‌పై ఆయన నిప్పులు చెరిగారు. హమాస్‌లోని ప్రతి సభ్యుడికి ఇక చావే గతి అని తేల్చిచెప్పారు. నెతన్యాహూ బుధవారం రాత్రి టీవీలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇజ్రాయెల్‌లో శనివారం హమాస్ మిలిటెంట్లు సాగించిన రాక్షసకాండను వివరించారు. అంతకుముందు ఆయనతో ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నేత బెన్నీ గాంట్జ్ సమావేశమయ్యారు. హమాస్‌పై యుద్ధాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి వీలుగా వార్–టైమ్ కేబినెట్ ఏర్పాటు చేయాలని వారు నిర్ణయించారు. ఈ కేబినెట్‌కి నెతన్యాహూ నేతృత్వం వహిస్తారు.

అండగా ఉంటాం: బ్లింకెన్

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ గురువారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తనను తాను కాపాడుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందన్నారు. బ్లింకెన్ శుక్రవారం పాలస్తీనా అధినేత మహమ్మద్ అబ్బాస్, జోర్డాన్ రాజు అబ్దుల్లా–2తో సమావేశం కానున్నారు. పాలస్తీనియన్లకు చట్టబద్ధమైన ఆకాంక్షలు ఉన్నాయని బ్లింకెన్ వ్యాఖ్యానించారు.

శిశువు ప్రాణాలు తీయలేం

26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: మానసిక, ఆర్థిక సమస్యలతో 26 వారాల గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి అనుమతినివ్వాలంటూ ఒక వివాహిత వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక శిశువు ప్రాణాలు తాము తీయలేమని అన్నారు. తల్లి హక్కుతో పాటు గర్భస్థ శిశువు హక్కుల మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. తన అనారోగ్య కారణాలతో ఆరోగ్యంగా ఉన్న ఉన్న పిండం ఉసురు తీయాలని కోరుకుంటే కోర్టు ఆ పని చెయ్యదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలున్న ఒక వివాహిత మానసిక కుంగుబాటు, ఆర్థిక కారణాలతో మూడో బిడ్డను కనడానికి సిద్ధంగా లేనంటూ కోర్టుకెక్కారు. గర్భవిచ్ఛిత్తి చేసినా పిండం సజీవంగానే ఉంటుందన్న ఎయిమ్స్ వైద్యులు నివేదిక ఇవ్వడంతో ఆమె గర్భాన్ని తీయవద్దంటూ కేంద్రం కోర్టుకెక్కింది. దీనిపై ఇద్దరు న్యాయమూర్తులున్న ద్విసభ్య బెంచ్ ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ దీనిని విచారించింది. కోర్టు ఉత్తర్వుల ద్వారా బిడ్డను చంపడానికి అనుమతి కోరుతున్నారా ? అని పిటిషనర్ తరపు లాయర్‌ని జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. ''ఆ పిండం సజీవంగా ఉంది. గర్భాన్ని విచ్ఛిన్నం చేసినా బతికే అవకాశాలున్నాయి. ఇప్పుడు ఆ పిండం గుండె చప్పుడు ఆపేయాలని మేమెలా చెబుతాం? మేము బిడ్డని చంపమని చెప్పలేం'' అని స్పష్టం చేశారు. 26 వారాలుగా గర్భాన్ని మోసిన ఆమె మరికొన్ని వారాలు మోస్తే ఆరోగ్యకరమైన శిశువు జన్మించే అవకాశం ఉందని సుప్రీం బెంచ్ అభిప్రాయపడింది. దీనిపై ఆ మహిళతో మాట్లాడి నచ్చజెప్పాలని పేర్కొంది. ఆ బాధ్యతని పిటిషనర్ లాయర్‌కి, కేంద్రానికి అప్పగిస్తూ కేసుని శుక్రవారానికి వాయిదా వేసింది. దేశంలో చట్టప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే 24 వారాల వరకు గర్భ విచ్ఛిన్నానికి అవకాశం ఇస్తారు.

ప్రపంచ ఆకలి సూచీలో... మనకు 111వ స్థానం

దురుద్దేశ పూరితం: కేంద్రం ● లోపభూయిష్టమంటూ ధ్వజం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆహార సూచీ–2023లో భారత్ 111వ స్థానంలో నిలిచింది. గురువారం విడుదల చేసిన ఈ సూచీలో మొత్తం 125 దేశాల్లో మనకు ఈ ర్యాంకు దక్కింది. దీన్ని లోపభూయిష్టమైనదిగా కేంద్రం కొట్టిపారేసింది. 'ఇది తప్పుడు ర్యాంకింగ్. దురుద్దేశపూర్వకంగా ఇచ్చిన బాపతు' అంటూ మండిపడింది. అన్ని రకాలుగా పీకల్లోతు సంక్షోభంలో మునిగిన పాకిస్తాన్ (102), అంతే సంక్షోభంలో ఉన్న శ్రీలంక (60)తో పాటు బంగ్లాదేశ్ (81), నేపాల్ (61) మనకంటే చాలా మెరుగైన ర్యాంకుల్లో ఉండటం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. 28.7 స్కోరుతో ఆకలి విషయంలో భారత్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని నివేదిక చెప్పుకొచ్చింది. 27 స్కోరుతో దక్షిణాసియా, సహారాకు దక్షిణాన ఉన్న ఆఫ్రికా ప్రాంతాలు ఆకలి సూచీలో టాప్‌లో ఉన్నట్టు చెప్పింది. 'భారత బాలల్లో పౌష్టికాహార లోపం తీవ్రంగా 18.7గా ఉంది. ఐదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు 3.1 శాతం, 15–24 ఏళ్ల లోపు మహిళల్లో రక్తహీనత ఉన్నవారి సంఖ్య ఏకంగా 58.1 శాతం ఉన్నాయి' అని పేర్కొంది. వాతావరణ మార్పులు, కల్లోలాలు, మహమ్మారులు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటివి ఆకలి సమస్యను ఎదుర్కోవడంలో అవరోధాలుగా నిలిచాయని సర్వే పేర్కొంది. ఇదంతా అభూత కల్పన అంటూ కేంద్రం మండిపడింది. 'ఇది తప్పుడు పద్ధతులు వాడి రూపొందించిన సూచీ. కేవలం 3,000 మందిపై నిర్వహించిన ఒపీనియన్ పోల్ ఆధారంగా పౌష్టికాహార లోపం శాతాన్ని నిర్ధారించడం క్షమార్హం కాని విషయం. దాంతో బాలల్లో వాస్తవంగా కేవలం 7.2 శాతమున్న పౌష్టికాహార లోపాన్ని ఏకంగా 18.7గా చిత్రించింది. దీని వెనక దురుద్దేశాలు ఉన్నాయన్నది సుస్పష్టం' అంటూ విమర్శించింది.

పట్టాల్లో లోపాలే కారణం కావొచ్చు

నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై రైల్వే శాఖ

న్యూఢిల్లీ: బిహార్‌లోని బక్సర్ జిల్లా రఘునాథ్‌పూర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన నార్త్ ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి పట్టాల్లో లోపాలే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఢిల్లీ నుంచి అస్సాంకు వెళ్తున్న కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలింజన్‌తోపాటు మొత్తం 23 బోగీలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 ఏళ్ల చిన్నారి, ఆమె తల్లి సహా నలుగురు చనిపోయారు. లోకో పైలట్, కో పైలట్ సహా 30 మంది వరకు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురిని పట్నా ఆస్పత్రికి తీసుకెళ్లామని ఈస్ట్ సెంట్రల్ రైల్వే(ఈసీఆర్) తెలిపింది. ఘటన సమయంలో రైలు గంటకు 128 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్లు నివేదిక తెలిపింది. ప్రమాదానికి కొద్ది క్షణాలకు ముందు పట్టాలు తీవ్రంగా కంపించడం, భారీ కుదుపులు, బ్రేక్ పైప్ ప్రెషర్ అకస్మాత్తుగా పడిపోవడం వంటివి జరిగాయని లోకో పైలట్ వెల్లడించారని వివరించింది. వీటిని బట్టి, పట్టాల్లో లోపాలే ప్రమాదానికి దారితీసినట్లు అంచనా వేస్తున్నామని తెలిపింది. ఘటనతో రైల్వే శాఖకు సుమారు రూ.52 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదిక పేర్కొంది. ప్రమాద సమయంలో రైలులో ప్రయాణిస్తున్న సుమారు 1,500 మందిలో వెయ్యి మందిని ప్రత్యేక రైలులో గమ్యస్థానాలకు పంపించినట్లు నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే ప్రకటించింది. ఘటన ప్రాంతాన్ని రైల్వే భద్రతా సిబ్బంది దిగ్బంధించారు. భారీ క్రేన్లు, యంత్రాలతో రైలు బోగీలను పక్కకు తొలగించే ప్రయత్నాలు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదం కారణంగా రైలు పట్టాలు, విద్యుత్ వ్యవస్థలు, స్తంభాలు దెబ్బతిన్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. దీంతో, ఆ మార్గంలో వెళ్లే 21 రైళ్లను అధికారులు దారి మళ్లించారన్నారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించారని ఈసీఆర్ సీపీఆర్‌వో(చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్) బీరేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తామన్నారు.

భారత్ స్వరం మరింత బలపడుతోంది

ఉత్తరాఖండ్ ర్యాలీలో ప్రధాని మోదీ

పితోర్‌గఢ్: సవాళ్లతోనిండిన ప్రపంచంలో భారత్ వాణి మరింత బలపడిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఇటీవల ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించి భారత్ సత్తా చాటుకుందని తెలిపారు. గురువారం ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్‌లో జరిగిన ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి గత 30, 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై సైతం తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. చంద్రయాన్–3 మిషన్ విజయవంతమైందని తెలిపిన ప్రధాని మోదీ, చంద్రుడిపై వేరే ఏ దేశమూ చేరుకోని ప్రాంతంలోకి మనం వెళ్లగలిగామన్నారు. 'ఒక సమయంలో దేశంలో నిరాశానిస్పృహలు ఆవరించి ఉండేవి. వేల కోట్ల రూపాయల కుంభకోణాల చీకట్ల నుంచి దేశం ఎప్పుడు బయటపడుతుందా అని ప్రజలు ప్రార్థించేవారు. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిని అప్పటి ప్రభుత్వాలు విస్మరించాయి. వెనుకబడిన ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ప్రజలు వలస బాట పట్టారు. పరిస్థితులు మారి అలా వెళ్లిన వారంతా ఇప్పుడు తిరిగి సొంతూళ్లకు వస్తున్నారు'అని ప్రధాని చెప్పారు. 'ప్రపంచమంతటా సవాళ్లు నిండి ఉన్న ప్రస్తుత తరుణంలో భారత్ వాణి గట్టిగా వినిపిస్తోంది. ప్రపంచానికే భారత్ మార్గదర్శిగా మారడం మీకు గర్వకారణం కాదా? ఈ మార్పు మోదీ తీసుకువచ్చింది కాదు. రెండోసారి మళ్లీ అధికారం అప్పగించిన 140 కోట్ల దేశ ప్రజలది'అని ప్రధాని అన్నారు. గత అయిదేళ్లలో 13.50 కోట్ల ప్రజలను పేదరికం నుంచి తమ ప్రభుత్వం బయటకు తీసుకువచ్చిందన్నారు. పేదరికాన్ని అధిగమించగలమని దేశం నిరూపించిందని చెప్పారు. ఉత్తరాఖండ్ ప్రజలు తనను కుటుంబసభ్యునిగా భావించారని చెప్పారు. రూ.4,200 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు.

ఆదికైలాస శిఖరంపై ప్రధాని ధ్యానం

అంతకుముందు, రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉదయం జోలింగ్‌కాంగ్ చేరుకున్న ప్రధాని మోదీకి సీఎం పుష్కర్ సింగ్ ధామి ఘన స్వాగతం పలికారు. జోలింగ్‌కాంగ్‌లోని పార్వతీ కుండ్ వద్ద ఉన్న శివపార్వతీ ఆలయంలో ఆరతిచ్చి, శంఖం ఊదారు. గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించిన ప్రధాని పరమేశ్వరుని నివాసంగా భావించే ఆది కైలాస పర్వత శిఖరాన్ని సందర్శించుకున్నారు. అక్కడ కాసేపు ధ్యానముద్రలో గడిపారు. అనంతరం అక్కడికి 36 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిహద్దు గ్రామం గుంజికి చేరుకున్నారు. అక్కడి మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. స్థానికులను ప్రధాని ఆప్యాయంగా పలకరించారు. ఉన్ని దుస్తులు, కళారూపాలతో ఏర్పాటైన ప్రదర్శనను తిలకించారు. భద్రతా సిబ్బందితోనూ ప్రధాని ముచ్చటించారు. అక్కడ్నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్మోరా జిల్లాలో పురాతన శివాలయం జగదేశ్వర్ ధామ్‌కు వెళ్లారు. అక్కడున్న జ్యోతిర్లింగానికి ప్రదక్షిణలు, పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రధాని పితోర్‌గఢ్‌కు చేరుకున్నారు.




కైలాస శిఖరంపై ధ్యాన ముద్రలో ప్రధాని మోదీ

అత్యల్పానికి నిరుద్యోగిత: మోదీ

న్యూఢిల్లీ: నానాటికీ దూసుకుపోతున్న భారత ఆర్థిక వ్యవస్థ యువతకు సరికొత్త ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫలితంగా ప్రస్తుతం దేశంలో నిరుద్యోగిత గత ఆరేళ్లలో అతి తక్కువగా నమోదైందని తెలిపారు. తాజాగా జరిపిన ఓ సర్వేలో ఈ మేరకు తేలిందని వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఆంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌ను ఉద్దేశించి గురువారం ఆయన వీడియో సందేశమిచ్చారు. భారత్‌లో కొన్నేళ్లుగా ఉపాధి కల్పన కొత్త శిఖరాలకు చేరుతోందంటూ హర్షం వెలిబుచ్చారు. ''దేశంలో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిరుద్యోగిత బాగా తగ్గుముఖం పడుతోంది. అభివృద్ధి ఫలాలు పల్లెలను చేరుతున్నాయనేందుకు ఇది నిదర్శనం. ప్రగతిలో అవిప్పుడు పట్టణాలతో పోటీ పడుతూ దూసుకుపోతున్నాయి. అంతే కాదు, పనిచేసే మహిళల సంఖ్య భారీగా పెరుగుతుండటం మరో సానుకూల పరిణామం. ఇదంతా మహిళా సాధికారత దిశగా కొన్నేళ్లుగా కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాల పర్యవసానమే'' అని మోదీ చెప్పారు.

సనాతన ధర్మం... భారత్‌కు మారుపేరు

దానికి వినాశనమే లేదు: భగవత్



చండీగఢ్: సనాతన ధర్మం భారత్‌కు పర్యాయపదమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశ సంస్కృతి సనాతన ధర్మం మీదే ఆధారపడి ఉందని చెప్పారు. అలాంటి ధర్మాన్ని నాశనం చేయాలనుకోవడం స్వీయ హానితో సమానమని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయాలంటూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గత నెల చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా మంటలు రేపుతుండటం తెలిసిందే. వాటిని ఉద్దేశించి భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన గురువారం హరియాణాలోని రోహ్‌తక్‌లో బాబా మస్త్‌నాథ్ మఠంలో ఒక కార్యక్రమంలో మాట్లాడారు. సనాతనమంటేనే ఎప్పటికీ నిలిచి ఉండేదని, మన ధర్మం కూడా అంతేనని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి వీకే సింగ్, యోగ గురు రామ్‌దేవ్, పలువురు సాధు ప్రముఖులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా పరిష్కారం కోసం అంతా భారత్ కేసే చూస్తున్నారని ఆదిత్యనాథ్ అన్నారు. ఒకప్పుడు అసాధ్యమనుకున్న అయోధ్య రామాలయ నిర్మాణం ఇప్పుడు కళ్లముందు కన్పిస్తున్న వాస్తవమని చెప్పారు. అంతకుముందు ఉదయం జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహంత్ శ్రీచంద్‌నాథ్ యోగి విగ్రహాన్ని మఠంలో ఆవిష్కరించారు.

ఓట్ దిస్ పాయింట్

■ ఒక సామాన్య వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయవచ్చా?

→ 25 ఏళ్లు నిండిన భారత పౌరులు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. ఏదైనా నియోజకవర్గంలో ఓటు హక్కు తప్పనిసరిగా కలిగి ఉండాలి. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధిత నియోజకవర్గం నుంచి ఒక ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. రిజిష్టర్డ్ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులను సంబంధిత నియోజకవర్గంలోని 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది.

■ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు ఏమిటి?

→ దివ్యాంగులు, వృద్ధుల కోసం గ్రౌండ్ ఫ్లోర్ లోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ర్యాంపు, వీల్ చైర్‌తో పాటు వాలంటీర్ సదుపాయం కల్పిస్తారు. అంధులు పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు సహాయకుడి సేవలను పొందేందుకు అనుమతిస్తారు. ఇంటి నుంచి తీసుకెళ్లి ఓటు వేశాక తిరిగి ఇంటి వద్ద దింపేందుకు రవాణా సదుపాయం కూడా కల్పిస్తారు. 'సాక్షం (Saksham)' అనే ఎన్నికల సంఘం యాప్ ద్వారా కూడా ఈ సదుపాయాలను పొందవచ్చు.

గాసిప్ టైమ్

వాళ్లిద్దరూ సీనియర్ కాంగ్రెస్ నేతలు... ఇద్దరూ ఒకప్పుడు మంత్రులే. గిరిజన సామాజికవర్గానికి చెందిన ఒక పెద్దాయన ఏకంగా కేంద్రంలో మంత్రిగానూ, మైనారిటీ వర్గానికి చెందిన ఇంకో పెద్దాయన రాష్ట్రంలో కరెంట్ మంత్రిగా పని చేశారు. ఆ ఇద్దరినీ ఇటీవల ఓ కీలక కమిటీలో నియమించారు. నియమించారని

కమిటీలో ఉన్నారు.. మీటింగ్‌లో లేరు!

అనేకంటే... సర్దుబాటు చేశారంటే బాగుంటుందేమో? సరే సర్దుబాటు చేసినా.. నియమించారని అనుకున్నా ఆ కమిటీ సమావేశం అయితే వారు హాజరు కావాలిగా? కానీ ఢిల్లీ వేదికగా జరిగిన ఆ సమావేశం హాలులోకి వాళ్లిద్దరినీ రానీయలేదంట. మిమ్మల్ని ఎవరు నియమించారంటూ వెనక్కు పంపించారంట... ఇదేమని అడిగితే ఆర్డర్లు ఏవీ అని అడిగారంట? ఈ విషయంలో కేంద్ర మాజీ మంత్రికి, ఓ ఎంపీకి పెద్ద గొడవే అయ్యిందంట. ఎంత గొడవయినా కాంగ్రెస్ పార్టీ నాయకులంటే... 'పుష్పా.. తగ్గేదేలే' టైపు కదా.... ఆ ఇద్దరు రాకుండానే సమావేశం ముగించారు. ఇంకేముంది... కాళ్లుకొట్టుకుంటూ ఢిల్లీ నుంచి ఉసూరుమంటూ మళ్లీ హైదరాబాద్ బాట పట్టారు ఆ ఇద్దరు మాజీ మంత్రులు.

మీకు తెలుసా?



పొద్దుటూరి నర్సారెడ్డి

మూడోసారి పోటీ లేకుండానే

నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్

నిర్మల్: నర్సన్నబాపు అంటే నిర్మల్ జిల్లాలో తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి లేదు. నిర్మల్ ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధి పనుల గురించి ఇప్పటికి ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటారు. పీసీసీ చీఫ్‌గా, మంత్రిగా, కాంగ్రెస్ సీనియర్ నేతగా నిర్మల్ నియోజకవర్గంపై చెరగని ముద్ర వేశారు. కాంగ్రెస్‌పార్టీ తరపున 1962, 1967 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఇక 1972 ఎన్నికల నాటికి నర్సారెడ్డిపై పోటీకి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. 1989 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఆదిలాబాద్ ఎంపీ అయ్యారు. ప్రస్తుతం వయోభారంతో నర్సారెడ్డి ఎన్నికలు, పార్టీకి దూరంగా ఉంటున్నారు. రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పిన నేతగా పేరున్న నర్సారెడ్డి వారసులను రాజకీయంలోకి దింపకపోవడం గమనార్హం.



చూపుడు వేలుపై... చుక్కాని

శాసనసభ ఎన్నికల్లో నవ, యువ ఓటర్ల పాత్ర నిర్ణయాత్మకం

- మొత్తం ఓటర్లలో 50.44 శాతం 18–39 ఏళ్ల ఓటర్లే
- గణనీయ సంఖ్యలో 20–29 ఏళ్ల ఓటర్లు .. 19 శాతానికి పైనే
- 30–39 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు.. 28 శాతానికి పైనే
- 60 ఏళ్లు పైబడిన వయోజన ఓటర్లు 45,96,051 మంది(14.5%)


ముహమ్మద్ ఫసియొద్దీన్

రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో యువ ఓటర్లు నిర్ణయాత్మకంగా మారబోతున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించబోతున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే యువ ఓటర్ల నాడి పట్టి వారి మనస్సులను గెలుచుకోకతప్పని పరిస్థితి నెలకొంది. నాణ్యమైన ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సర్కారీ కొలువుల భర్తీ, నిరుద్యోగ సమస్యలు ఈ ఎన్నికలను ప్రభావితం చేసే అంశాలుగా మారబోతున్నాయి. అధికార, విపక్ష పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో యువతకు ప్రత్యేక హామీలు ఇవ్వక తప్పని స్థితి. యువతే కదా అని నిర్లక్ష్యం చేస్తే మాత్రం అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉంది. ఎందుకంటే, నవంబర్ 30న జరగనున్న ఎన్నికల్లో ఓటేయబోతున్న వారిలో ఏకంగా 50.44 శాతం మంది 18–39 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నవ యువ ఓటర్లు, యువ ఓటర్లు, ఇప్పుడిప్పుడే మధ్య వయస్సులోకి అడుగిడుతున్న ఓటర్లుండడం గమనార్హం.

ఓటర్లలో సగభాగం యువతే

శాసనసభ సాధారణ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా రెండో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఈ నెల 4న రాష్ట్రంలోని 119 అసెంబ్లీ సెగ్మెంట్‌లవారీగా తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,17,17,389కు పెరగగా, అందులో 1,59,98,116 (50.44%) మంది 19–39 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లే ఉన్నారు. అందులోనూ 91,46,484 (28.84%) మంది మధ్య వయస్సులో అడుగుపెట్టిన 30–39 ఏళ్ల ఓటర్లే కావడం గమనార్హం. తొలిసారిగా ఓటు పొందిన 18–19 ఏళ్ల నవ యువ ఓటర్లు 8,11,640 (2.56%) ఉండగా, 20–29 ఏళ్ల నిడివి గల ఓటర్లు గణనీయంగా 60,39,992 (19.04%) మంది ఉన్నారు.

గత శాసనసభ ఎన్నికలతో పాటు ప్రస్తుత ఎన్నికల ఓటర్ల జాబితాలో విభిన్న ఏజ్ గ్రూపుల్లోని ఓటర్ల సంఖ్య, శాతాలను కింది పట్టికలో పోల్చి చూడవచ్చు..



గతంతో పోలిస్తే 5% తగ్గిన యువ ఓటర్లు...

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 18–39 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు 55.4 శాతం ఉండగా, తాజా జరగనున్న ఎన్నికల్లో 50.44 శాతం ఉన్నారు. అప్పట్లో 20–29 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు 24.84శాతం ఉండగా, ఇప్పుడు 19.04 శాతానికి తగ్గడమే ఇందుకు కారణం. స్థూలంగా చూస్తే గత శాసనసభ ఎన్నికలతో పోల్చితే ఈ సారి యువ ఓటర్లు 5శాతం తగ్గినా .. ఫలితాల్లో మాత్రం నిర్ణయాత్మక పాత్ర పోషించే స్థితిలోనే ఉండడం గమనార్హం. 2018లో 50–59 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు 12.73 శాతం ఉండగా, ఇప్పుడు 14.24 శాతానికి పెరిగారు. నాటితో పోల్చితే ఇప్పటి ఓటర్ల జాబితాలో మిగిలిన ఏజ్ గ్రూపుల ఓటర్ల శాతాల్లో స్వల్ప తేడాలే ఉన్నాయి. ఇక రాష్ట్రంలో 60 ఏళ్లకు పైబడిన ఓటర్లు 45,96,051 (14.5శాతం) మంది ఉండగా, 40–50 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు 20.83 శాతం ఉన్నారు.

ఉద్యమం నుంచి నేషనల్ హైవే పైకి..

తెలంగాణ రాష్ట్ర సాధనగా మొదలైన టీఆర్ఎస్ ప్రస్థానం

జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీకి 'బీఆర్ఎస్'గా...

2001 నుంచి ఎన్నో ఎగుడుదిగుడులు

కల్వల మల్లికార్జున్‌రెడ్డి

రాష్ట్రసాధనే లక్ష్యంగా ఉద్యమపార్టీగా అవతరించిన తెలంగాణ రాష్ట్రసమితి తొలిసారిగా 'భారత్ రాష్ట్రసమితి' రూపంలో ఎన్నికల పరీక్షకు సిద్ధమవుతోంది. జాతీయ రాజకీయాల్లో ఎంట్రీకి ఓవైపు రంగం సిద్ధం చేసుకుంటూనే, మరోవైపు రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. దక్షిణ భారతదేశంలో తొలి హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టించేందుకు పార్టీ అధినేత కే.చంద్రశేఖర్ రావు తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్రసాధన ఉద్యమంలో ఎన్నికలను అస్త్రాలుగా మలుచుకొని ఫలితాలు రాబట్టుకున్న కేసీఆర్ 'హ్యాట్రిక్ అధికారం' కోసం త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను సాధనంగా చేసుకుంటున్నారు. తద్వారా దేశ రాజకీయాల్లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఉపఎన్నికలతోనే ప్రస్థానం షురూ ..: తెలంగాణ రాష్ట్ర సాధనకు టీడీపీకి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికి, సిద్దిపేట శాసన సభ్యత్వానికి ఏకకాలంలో రాజీనామా చేసిన కేసీఆర్ ఉపఎన్నిక ద్వారా టీఆర్ఎస్ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. 2001లో సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి భారీ విజయం సాధించారు.


కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహన..: టీఆర్ఎస్ 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహనకు వచ్చింది. ఉమ్మడి ఏపీలో 46 అసెంబ్లీ సీట్లలో పోటీ చేసిన టీఆర్ఎస్ 26 చోట్ల విజయం సాధించింది. రాష్ట్ర ఏర్పాటుపై మాట తప్పిందనే కారణంతో కేంద్రమంత్రిగా ఉన్న కేసీఆర్ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ నుంచి బయటకు వచ్చారు. 2006 కరీంనగర్ లోక్‌సభ ఉపఎన్నికలో ఎంపీగా మరోమారు కేసీఆర్ విజయం సాధించారు. 2008లో టీఆర్ఎస్‌కు చెందిన 16 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లగా, కేవలం ఏడుగురు మాత్రమే గెలుపొందారు. భారీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ టీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ ఆ తర్వాత పార్టీ నేతల ఒత్తిడితో ఉపసంహరించుకున్నారు.


మహాకూటమితో కేసీఆర్ జట్టు..: 2009లో జరిగిన ఎన్నికల్లో మహాకూటమితో టీఆర్ఎస్ జట్టు కట్టింది. 45 అసెంబ్లీ స్థానాల్లో టీఆర్ఎస్ పోటీ చేయగా, 10 సీట్లే గెలిచింది. తర్వాత పార్టీలో చేరిన చెన్నమనేని రమేశ్ (వేములవాడ) సహా 11 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. 2010 జూలైలో జరిగిన ఉప ఎన్నికల్లో 11 మంది టీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. 2011 ఉపఎన్నికలో బాన్సువాడలో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన పోచారం విజేతగా నిలిచారు. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుతున్న దశలో టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలు జోగు రామన్న, గంప గోవర్ధన్, జూపల్లికృష్ణారావు, తాటికొండ రాజయ్య 2012లో రాజీనామా చేసి మళ్లీ గెలిచారు. నాగర్‌కర్నూలు నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన నాగం జనార్దన్‌రెడ్డికి టీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. ఇదే ఉప ఎన్నికలో మహబూబ్‌నగర్ నుంచి ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి (బీజేపీ) టీఆర్ఎస్ అభ్యర్థి ఇబ్రహీం పై గెలుపొందారు.

తొలిసారిగా చేజిక్కిన అధికార పగ్గాలు..: 2014 ఎన్నికల్లోఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగిన టీఆర్ఎస్ 119 స్థానాల్లో పోటీ చేసి 63 చోట్ల విజయం సాధించింది. టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ, బీఎస్పీ, సీపీఐ నుంచి పలువురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరడంతో అసెంబ్లీలో సంఖ్యాబలం భారీగా పెరిగింది. నారాయణఖేడ్, పాలేరు ఎమ్మెల్యేల(కాంగ్రెస్) మరణంతో 2016లో వచ్చిన ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిచింది.

ముందస్తు ఎన్నికలతో రెండోసారి అధికారం..: ఆరు నెలలు ముందుగానే అసెంబ్లీని రద్దు చేస్తూ 2018 సెప్టెంబర్ 6న కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఓవైపు రద్దు నిర్ణయంతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేస్తూ ఏకకాలంలో 105 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అన్ని చోట్లా పోటీ చేసి 88 చోట్ల విజయం సాధించింది. వరుసగా రెండోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాతి కాలంలో కోరుకంటి చందర్ (ఏఐఎఫ్‌బీ), రాములునాయక్ (ఇండిపెండెంట్)తో పాటు 12 మంది కాంగ్రెస్, ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరడంతో అసెంబ్లీలో పార్టీ సంఖ్యాబలం 104కు చేరింది. గడిచిన నాలుగేళ్లలో 2018–22 మధ్యకాలంలో ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక జరగ్గా నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, మునుగోడులో టీఆర్ఎస్ హుజూరాబాద్, దుబ్బాకలో బీజేపీ అభ్యర్థులు గెలిచారు.

బీఆర్ఎస్ రూపంలో తొలి పరీక్ష ..: జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టే లక్ష్యంతో టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. బీఆర్ఎస్ పేరిట తొలిసారిగా ఎన్నికల పరీక్షను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేస్తూ ఒకే జాబితాలో 115 మంది పేర్లు కేసీఆర్ ప్రకటించారు.





రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల సందడి మొదలైంది. ప్రధాన పార్టీలు ప్రచారానికి సన్నద్ధమవుతున్నాయి. రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలు, వందల సంఖ్యలో ప్రచార సభలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లు, చార్టర్డ్ విమానాలకు డిమాండ్ 'టేకాఫ్' తీసుకుంటోంది. ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడ ప్రచారం చేయడానికి వచ్చే జాతీయ పార్టీ నేతలు, స్టార్ క్యాంపెయినర్లు వీటిని అద్దెకు తీసుకునేందుకు సై అంటున్నారు. ఒత్తిడి లేకుండా, వేగవంతంగా, సౌకర్యవంతంగా ప్రయాణం చేసే వీలుతో పాటు సమయం ఆదా అవుతుండటంతో అద్దె హెలికాప్టర్లకు ఎన్నికల వేళ గిరాకీ జోరందుకుంటుంది. గంటల వ్యవధిలోనే ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లి పలు ప్రచారాల్లో పాల్గొనే అవకాశం ఉండటం కూడా నేతలను గాల్లో చక్కర్లు కొట్టేలా చేస్తోంది.

- సాక్షి, హైదరాబాద్

ఫ్లయింగ్ స్టార్స్

హెలికాప్టర్లు, చార్టర్డ్ విమానాలకు డిమాండ్

- జాతీయ పార్టీ నేతలు, స్టార్ క్యాంపెయినర్ల ఆసక్తి
- సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకు రూ. లక్షన్నర
- ఈ ఖర్చు కూడా అభ్యర్థి ఎన్నికల వ్యయం ఖాతాలోకే..
- డీజీసీఐ, ఈసీ అధికారి ముందస్తు అనుమతి తప్పనిసరి

అద్దె లక్షల్లోనే... బ్లేడ్ ఇండియా, అర్బన్ ఎయిర్ మొబిలిటీ, ఇండియన్ ఫ్లై సర్వీసెస్, జెట్‌సెట్‌గో వంటి కంపెనీలు హెలికాప్టర్లు, జెట్ విమానాలను అద్దెకు ఇస్తున్నాయి. ప్రైవేట్ ఏజెన్సీలతో పాటు సువిధ యాప్ ద్వారా కూడా హెలికాప్టర్లతో సహా వాహనాలను అద్దెకు తీసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సాధారణంగా బెల్ 407, ఎయిర్‌బస్ హెచ్125, హెచ్130 వంటి హెలికాప్టర్లను అద్దెకు తీసుకుంటారు. ఇందులో అయిదుగురు ప్రయాణించవచ్చు. సాధారణంగా సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకు రూ.1.5 లక్షల నుంచి ఉంటుంది. రెండు ఇంజిన్ల సామర్థ్యం ఉంటే రూ.2.75 లక్షల వరకు అవుతుంది.



జాతీయ పార్టీల నుంచి డిమాండ్..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులు, స్టార్ క్యాంపెనర్లతో తెలంగాణలో ప్రచారం చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో అద్దె హెలికాప్టర్లు, చార్టర్డ్ ఫ్లయిట్లకు డిమాండ్ మరింత పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పోటీలో ఉన్న రాజకీయ పార్టీలు, వ్యక్తిగత రాజకీయ నాయకుల నుంచి హెలికాప్టర్ల అద్దెకు అభ్యర్థనలు వస్తున్నాయని ఓ సంస్థ ప్రతినిధిని తెలిపారు. ఆయా పార్టీల నాయకులు కర్ణాటక, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో తమ హెలికాప్టర్లను అద్దెకు తీసుకొని ప్రచారం సాగించారని తెలిపారు. తెలంగాణలోనూ ఇరు పార్టీలు ప్రధానంగా పోటీలో ఉండటం వల్ల ఇక్కడ కూడా ఫుల్ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

డీజీసీఏ మార్గదర్శకాలు తప్పనిసరి.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిర్దేశించిన నిబంధనలను ఆపరేటర్లు తూ.చ. తప్పకుండా పాటించాల్సిందే. పైగా ఎన్నికల సమయంలో ప్రత్యేక మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. మంత్రులు, సీనియర్ రాజకీయ నేతలు రెండు ఇంజిన్లు ఉన్న హెలికాప్టర్ లేదా విమానంలో మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. వీఐపీ విమానాలను నడిపే పైలట్‌లు నిర్దిష్ట రకం విమానం లేదా హెలికాప్టర్‌లో నిర్దిష్ట సంఖ్యలో ఫ్లయింగ్ గంటల అనుభవాన్ని కలిగి ఉండాలి.

అద్దె ఖర్చు ఎవరి ఖాతాలో.. హెలికాప్టర్ అద్దెలపై కూడా ఎన్నికల కమిషన్ నిఘా ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి, స్థానిక డిప్యూటీ కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఒక స్టార్ క్యాంపెయినర్ హెలికాప్టర్‌ను ఉపయోగిస్తే అభ్యర్థి పేరు తీసుకోకుండా లేదా అభ్యర్థితో వేదికను పంచుకోకుండా ప్రసంగాలు చేస్తే అప్పుడు ఆ ఖర్చు మొత్తం పార్టీపైనే పడుతుంది. ఒకవేళ అభ్యర్థి పేరుతో ప్రచారం చేస్తే గనుక అప్పుడు ఆ వ్యయం పార్టీ, అభ్యర్థికి చెరి సగం పడుతుందని ఎన్నికల కమిషన్ చెబుతోంది. సొంతంగా హెలికాప్టర్లు ఉన్న వారి ప్రయాణ సమయం, అద్దెను అభ్యర్థుల ఖర్చుగా పరిగణిస్తారు.

హైదరాబాద్‌లో సిద్ధమవుతున్న ప్రచార రథం



ఎన్నికల యుద్ధం

ప్రచార రథాలు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల షెడ్యూల్ విడుదలతో వివిధ పార్టీలకు ప్రచార వాహనాలను రూపొందించే సిబ్బందికి, వాహనాలకు, డ్రైవర్‌లకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. పార్టీల జెండాలు, బ్యానర్లను తయారు చేసే టైలర్‌లకు సైతం భారీ గిరాకీ వచ్చింది. ఉప్పల్, చర్లపల్లి తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రెడీమేడ్ దుస్తులను తయారు చేసే పలు కంపెనీల్లోని కుట్టుమిషన్‌లపైన ఇప్పుడు పార్టీల జెండాలు రెడీ అవుతున్నాయి. అంబర్‌పేట్ పటేల్‌నగర్, మూసారాంబాగ్ తదితర ప్రాంతాల్లోనూ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలను, బ్యానర్లను తయారు చేసే మహిళా టైలర్‌లకు డిమాండ్ వచ్చేసింది. తాత్కాలికంగా అయినా ఇప్పుడు ఇది ఓ కుటీర పరిశ్రమగా మారినట్లు పటేల్‌నగర్‌కు చెందిన బాలమణి తెలిపారు. రోజుకు 250 నుంచి 300 వరకు బ్యానర్లు, జెండాలు, ఇతర ప్రచార సామగ్రిని తయారు చేస్తున్నామని చెప్పారు.

ప్రచార రథాలకు మేకప్....

నేతలు ప్రచార వాహనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రచార వాహనాల కోసం వినియోగించే టాటా, మహీంద్ర వాహనాలకు డిమాండ్ వచ్చేసింది. అభ్యర్థుల కటౌట్‌లు, బ్యానర్లు తదిర హంగులతో ప్రచార రథాలుగా తీర్చిదిద్దేందుకు కార్మికులు, టెక్నీషియన్‌లు రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. మూసారాంబాగ్, ఇందిరాపార్కు, తదితర ప్రాంతాల్లో ప్రచార రథాల తయారీ పనులు జోరుగా సాగుతున్నాయి.


అడవికి రాజెవరో?

ప్రచారంలో ముందున్న 'కారు' పార్టీ

అభ్యర్థిత్వం తేలకున్నా విపక్షాల ప్రచారం

ఆకుల రాజు

అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఓట్ల వేట హోరాహో రీగా సాగనుంది. ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్న పది అసెంబ్లీ స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రచారం అప్పుడే ముమ్మరంగా నడుస్తోంది. భౌగోళికంగా చూస్తే పశ్చిమ ప్రాంతంగా ఉన్న నిర్మల్, ముథోల్, బోథ్, ఖానాపూర్, ఆదిలాబాద్, తూర్పున మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు మైదాన, గిరిజన, కోల్‌బెల్ట్ ఓటర్లతో నిండి ఉన్నాయి. ఆయా నియోజ కవర్గాల్లో ఆదివాసీ, గిరిజన, ఓసీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా ఓట్ల కోసం రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా ముం దుకు వెళ్తున్నాయి.



విపక్షాల ప్రచార అస్త్రాలు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై భూ కబ్జాలు, అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలు
- డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళిత, బీసీ బంధు అర్హులందరికీ రాకపోవడం
- ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయం చూపకపోవడం
- గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్యం, రోడ్లు లేకపోవడం
- జిల్లాల్లో మూత పడిన పరిశ్రమలు తెరవకపోవడం

డిస్ట్రిక్ట్ స్కాన్

అధికార పార్టీ ప్రచారాస్త్రాలు

- 48వేల మందికి, లక్ష ఎకరాల పోడు పట్టాల పంపిణీ
- ఏడు వేలకు పైగా సింగరేణి స్థలాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్‌లో మెడికల్ కాలేజీల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్.. బోణీ కొట్టేందుకు బీజేపీ పోరాటం

గతంలో ఓ వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన రెండు ఎన్నికల్లోనూ పదింటా ఒక్కో స్థానానికే పరిమితమైంది. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక కసరత్తు జరుగుతోంది. పది స్థానాలకు 94మంది దరఖాస్తు చేసుకున్నారు. మళ్లీ పూర్వ వైభవం వస్తుందంటూ కాంగ్రెస్ నేతలు ఆశల పల్లకీలో ఊరేగుతున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవని బీజేపీ ఈసారి సత్తా చాటేందుకు చెమటో డుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా ఆదిలా బాద్ ఎంపీగా సోయం బాపురావు గెలవడంతో పార్టీకి హైప్ తెచ్చింది. ఈసారి కచ్చితంగా మెజారిటీ సీట్లు గెలు స్తామనే ధీమాతో కమలనాథులు ఉన్నారు.

ప్రచారంలో 'కారు' స్పీడు..

అభ్యర్థులను ముందే ప్రకటించి 'కారు' పార్టీ ప్రచారంలో స్పీడ్‌గా ఉంది. అభ్యర్థులు తమ పర్యటనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పదే పదే వల్లె వేస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్యే ప్రధాన పోటీ ఉండగా, ప్రస్తుతం బీజేపీతోపాటు కొన్ని చోట్ల బీఎస్పీ, సీపీఐ అభ్యర్థులు బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపోట ములు ప్రభావితం చేయనున్నాయి. ముప్పై ఏళ్ల రాజకీయం , ఐదు ఎన్నికలను ఎదుర్కొన్న మంత్రి ఐకే రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావుతో పాటు ఎన్నికలంటే తెలియని, ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ లాంటి వారు కూడా పోటీలో ఉండడం ఆసక్తి కలిగిస్తోంది.

బోథ్, ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్‌కు ఇక్కట్లు

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు బదులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్నేహితుడైన భూక్య జాన్సన్ నాయక్‌కు, బోథ్‌లో రాథోడ్ బాపూరావును కాదని అనిల్‌కుమార్ జాదవ్‌కు టికెట్ ఇచ్చారు. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే ఆత్రం సక్కును పక్కకు పెట్టి, గత ఎన్నికల్లో ఓడిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, కుము రంభీం జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మికి మళ్లీ అవకాశం ఇచ్చారు. దీంతో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతామని ప్రకటించారు. ఈ క్రమంలో వీళ్లిద్దరూ ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారనేది ఆసక్తి రేపుతోంది. ఇక చెన్నూరులో ఎమ్మెల్యే సుమన్‌తో పొసగక, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పార్టీ వీడి కాంగ్రెస్ నుంచి పోటీకి సిద్ధపడ్డారు. టికెట్ దక్కని మాజీ ఎంపీ నగేశ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పార్టీలోనే ఉన్నా అంటీముట్టనట్టు ఉంటున్నారు.

బహుజనవాదంతో బీఎస్పీ

బహుజన వాదంతో ఇక్కడి ఓట్లను పట్టేందుకు బీఎస్పీ సిద్ధమైంది. సిర్పూర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో ఉంటానని చెప్పడం ఆసక్తి రేపుతోంది. ఖానాపూర్‌లో బన్సీలాల్‌కు అవకాశం ఇచ్చారు.

కామ్రేడ్ల ఆశలు

బెల్లంపల్లి నుంచి సీపీఐ బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంది. పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ బలంతో కార్మిక వాడల్లో నాయకులు ప్రచారం మొదలు పెట్టారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉంటే..సీటు ఇస్తారో లేదా చూడాలి.

సామాజిక సమీకరణాలు

ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, సిర్పూర్, ముథోల్‌లో బీసీ ఓట్లు. ఖానాపూర్, ఆసిఫాబాద్, బోథ్‌లో ఎస్టీ ఓట్లు, బెల్లంపల్లిలో నేతకాని, ఎస్సీ చెన్నూరులో నేతకాని, ఎస్సీ ఓట్లు మంచిర్యాలలో పెరిక, మున్నూరుకాపు, యాదవ, పద్మశాలి, గౌడ ఓట్లు, ఆదిలాబాద్‌లో మున్నూరుకాపు, పద్మశాలి, యాదవ, ముదిరాజ్, నిర్మల్‌లో మున్నూరుకాపు, పద్మశాలి, ముదిరాజ్, సిర్పూర్‌లో గిరిజన, బుద్ధిస్టు, ముస్లిం, ముథోల్‌లో ముస్లిం ఓట్లు గెలుపోటముల్లో కీలకం.

కాలజ్ఞానంలో పంచతంత్రం!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

''అప్పట్లో అలనాటి రాజుల కాలం నుంచీ రాజకీయాల్లోనే కాదు... ఇప్పటి ప్రజాస్వామ్యం కాలంలోనూ పంచతంత్రమే నడుస్తోంది. ఇలా జరుగుతూనే ఉంటుందని అలనాడు బ్రహ్మంగారు అప్పుడెప్పుడో చెప్పేశారు''

– ఓ సీనియర్ రాజకీయవేత్త వ్యాఖ్యానం.

''సార్... సార్... మీరు పొరబడుతున్నారు. బ్రహ్మంగారు చెప్పింది కాలజ్ఞానం. పంచతంత్రమేమో సంస్కృతంలో విష్ణుశర్మ, తెలుగులోనేమో చిన్నయసూరి.

కాలజ్ఞానంలో పంచతంత్రం ఎందుకుంటుంది సార్?'' సరిదిద్దబోయాడో సజ్జర్నలిస్టు.

''ఉంటది... ఉంటది. ఎందుకుండదూ... కాలజ్ఞానంలో పంచతంత్రముంటది''– రాజకీయవాది మరింత ధీమాగా.

హేమిటో... హేమో... అలనాడొకాయన 'బీకాంలో ఫిజిక్సు'అన్నంత ధీమాగానూ... అచ్చం అదే స్టైల్లోనూ 'ఉంటదుంటదీ... ఎందుకుండదూ'అని దబాయిస్తున్నాడు.

అయినా ఏ విషయం చెప్పాల్సి వచ్చినా 'అప్పుడెప్పుడో బ్రహ్మంగారు చెప్పేశారు'అనడం కొందరికి ఆనవాయితీ కదా. ఆ ఊపులో అనేస్తున్నాడేమోలే అని సర్దుకున్నాడు.

ఎంత చెడ్డా జర్నలిస్టు కదా... 'మనకెందుకులే'అనుకోకుండా, అసలు విషయం రాబడదామని 'ఇప్పటి ప్రజాస్వామ్య రాజకీయాల్లో... ఒకనాటి రాజరికానికి చెందిన సూత్రాలు అమలు చేయడం ఎలా కుదురుతుంది సార్? హౌ డజ్ ద పంచతంత్రా హోల్డ్ గుడ్?''

''అలా అడుగుతావేమయ్యా. పంచతంత్రా హోల్డ్స్ వెరీ గుడ్డూ... ఆమాటకొస్తే వెర్రీ వెరీ గుడ్డు. అలా జరగకపోతేనే గాడిదగుడ్డు. 'కాలం'ఇంతగా గడిచినా ఆ 'జ్ఞానం'నిలిచిపోవడమే పంచతంత్ర మహత్యం! ''

''కాస్త వివరించండి సర్''

''చెబుతా విను. పంచతంత్రమంటేనే మిత్రలాభం, మిత్రభేదం, సంధి, విగ్రహం.

ఇప్పుడూ... రెండు పార్టీల మధ్య పొత్తులు కుదురుతుంటాయి కదా. ముఖ్యంగా 'యాంటీఇన్‌కంబెంటు ఓటు చీలకూడదూ... అంతా గంపగుత్తగా మనకే పడిపోవాల'అని పార్టీలు కలిసిపోతూ ఉంటయ్ చూశావా... అది మిత్రలాభం. ప్రస్తుతానికి కాంగ్రెస్సూ, కమ్యూనిస్టులూ కలుద్దామని చర్చించుకుంటున్నారు చూడూ. అదీ మిత్రలాభ సూత్రం.

ఇక మిత్రభేదానికి ఉదాహరణ పక్కరాష్ట్రపు రాజకీయంలా ఉంటది. అధికారంలో ఉన్న శివసేన పార్టీని చీల్చేసి... వాళ్లలోంచి ఏకనాథశిండేల్లాంటి అనేకనాథాల్ని సృష్టించేసి, వాళ్లను కీలుబొమ్మగా నిలబెట్టేసి, తాము పాలించే టైపు రాజకీయాలన్నీ మిత్రభేదాలన్నమాట.

ఇప్పుడు సంధి. జనరల్‌గా ఇప్పుడున్న బలం కొద్దీ రాష్ట్రంలో గెలిచే పార్టీలూ బీఆర్ఎస్సూ, కాంగ్రెస్సూ అన్నది ఎస్సు కదా. యాంటీ ఇన్‌కంబెన్సు కొద్దీ ఒకవేళ బీఆర్ఎస్సుకు కాస్త తక్కువ సీట్లు వచ్చాయనుకో. సైద్ధాంతికంగా ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకునే బీజేపీ, ఎంఐఎమ్మూ... ఈ రెండు పార్టీలూ ఒకే బీఆర్ఎస్సుకు చెరోవైపు నిల్చుండిపోతాయట. అంటే ఈ రెండింటి మధ్యా ఓ పక్క 'ప్రత్యక్ష యుద్ధ'మున్నప్పటికీ... మరో పక్క బీఆర్ఎస్ సెంట్రిగ్గా... 'పరోక్ష సంధీ'ఉంటదంటూ పొలిటికల్ విశ్లేషకులు చెప్పడంలా. ఇదన్నమాట వింత విచిత్ర సంధి!''పాజ్ తీసుకున్నాడు పొలిటికల్ లీడర్.

''మరి విగ్రహమంటే?''

''సయోధ్యలున్నాయనుకున్న చోట హఠాత్తుగా 'మిత్రభేదాలూ', అస్సలు కుదరనే కుదరదనుకున్న ఆకస్మిక 'సంధులూ'... ఇలా ఇంతటి చిత్రవిచిత్ర బహు విస్మయాల్ని కళ్లప్పగించి చూస్తూ... అవాక్కయిపోయి, చేష్టలుడిగి నిల్చుండిపోయే ఓటరేనయ్యా చివరకు విగ్రహం'' .

కేసీఆర్... కోనాయిపల్లి

1985 నుంచి నామినేషన్‌కు ముందు వెంకటేశ్వరుని ఆలయంలో పూజలు

సెంటిమెంట్



పాప్ కార్న్

సాక్షి, సిద్దిపేట/ నంగనూరు: కోనాయిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్. తాను చేపట్టే ప్రతి పనికి ముందు ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. నంగనూరు మండలంలో ఉన్న ఈ ఆలయానికి ఎంతో మహిమ ఉందని భక్తులు గట్టిగా నమ్ముతారు. కేసీఆర్ తొలిసారిగా 1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రతి ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో పూజలు చేయడం ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. 2001లో తెలుగుదేశం పార్టీతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేసి వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్‌ఎస్‌ను స్థాపిస్తున్నట్లు ప్రకటించారు.

నవంబర్ 9న మరోసారి

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో.. నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల్లో కేసీఆర్ నామినేషన్ వేయనున్నారు. అంతకుముందు ఎప్పటిలాగే కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పంచతంత్రం

రాజస్తాన్‌లో స్వింగ్ ఎటు?



రాజస్తాన్‌లో ప్రజలు వరుసగా రెండుసార్లు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టిన దాఖలాలు లేవు. కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరాటంతో చెరో అయిదేళ్లు అధికారాన్ని పంచుకుంటున్నాయి. పార్టీ విజయాల్లో స్వింగ్ స్థానాలే కింగ్ మేకర్స్‌గా మారి అధికారంలోకి ఎవరు రావాలో నిర్ణయిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో ఈ స్వింగ్ స్థానాల్లో ఏ పార్టీకి ఎలా ఉంది ? ఈ సారి ఓటర్లు ఎవరి వైపు ఉండబోతున్నారు ?

రాజస్తాన్‌లో 200 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 166 నియోజకవర్గాల్లో ఓటరు నాడి పట్టుకోవడం కష్టంగా మారింది. ప్రతీసారి ఆ నియోజకవర్గాల్లో ప్రజలు పార్టీని మార్చేస్తూ ఉంటారు. ఈ నియోజకవర్గాల్లో గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్‌పై బీజేపీ తన పట్టు ప్రదర్శిస్తోంది. ప్రజల రాజకీయ ప్రాధాన్యాలేంటో తలపండిన రాజకీయ నాయకులకి కూడా అంతుపట్టడం లేదు. 2008లో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించినా 2018లో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకున్నప్పటికీ స్వింగ్ స్థానాలు మాత్రం రాజస్తాన్ రాజకీయాల్లో వైల్డ్ కార్డులుగా మారాయి. 2018లో స్వింగ్ స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీలు కూడా తమ ఉనికిని చాటాయి. ఎవరి ఊహకు అందని విధంగా 12 నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధిస్తే, బీఎస్పీ రెండు స్థానాలు, సీపీఎం ఒక్క స్థానాన్ని దక్కించుకున్నాయి.

స్వింగ్ ఎందుకు కింగ్ ?

స్వింగ్ స్థానాల్లో ఓటరు ఒక్కోసారి ఒక్కో రకంగా తీర్పు ఇస్తూ ఉండడంతో ఆ నియోజకవర్గాలపై దృష్టి పెట్టడం రాజకీయపార్టీలకు అనివార్యంగా మారింది. ఎన్నికల వ్యూహాలన్నీ ఆ స్థానాల ప్రాధాన్యాలకనుగుణంగానే రచిస్తున్నాయి. ఆ నియోజకవర్గాల్లో ఓటర్లను ఆకట్టుకునేలా వ్యూహాలు రచించడం అత్యంత కీలకంగా మారింది. ఈ స్థానాల్లో వచ్చే ఫలితాలే రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుతుంటాయి. 2008, 2013, 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే భారతీయ జనతా పార్టీ 28 నియోజకవర్గాల్లో వరుసగా నెగ్గుతూ వస్తోంది. కాంగ్రెస్ పార్టీకి అయిదు స్థానాల్లో వరుసగా విజయం సాధిస్తూ వచ్చింది. 2008లో స్వింగ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా నిలిస్తే 2013 ఎన్నికల నాటికి బీజేపీ పూర్తిగా తన పట్టు బిగించింది. ఇంచుమించుగా క్లీన్ స్వీప్ చేసింది. గత ఎన్నికల నాటికి కాంగ్రెస్ మళ్లీ పుంజుకున్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థులు అధికంగా విజయం సాధించడం చూస్తుంటే ఓటర్లు స్థానిక అంశాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ ఈ సారి ఈ స్వింగ్ స్థానాల్లో పట్టు బిగించి కింగ్‌లా మారాలని తహతహలాడుతున్నాయి.

స్వింగ్ స్థానాల్లో విజయం సాధించిన పార్టీలు ఇలా..?

మొత్తం స్థానాలు	200
స్వింగ్ స్థానాలు	166

2008	
కాంగ్రెస్	91
బీజేపీ	50
ఇతరులు	25

2018	
కాంగ్రెస్	95
బీజేపీ	45
ఇతరులు	26

2013	
కాంగ్రెస్	16
బీజేపీ	135
ఇతరులు	15

\- సాక్షి, నేషనల్ డెస్క్

అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో మిజోరంపై చర్చ

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల్ని ఖరారు చేయడానికి గురువారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ గురువారం న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇంకా అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు. బీజేపీ ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో చాలా సీట్లలో అభ్యర్థుల్ని ప్రకటించింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ , రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు. సమావేశానంతరం ఖర్గే సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టు పెట్టారు. మిజోరం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థులపై చర్చించామని వెల్లడించారు. ''మిజోరంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. మిజోరం ప్రజలు మాకు ఒక్క అవకాశం ఇస్తారన్న నమ్మకం కూడా ఉంది'' అని పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ మరోసారి సమావేశమై ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థుల్ని ఎంపికను ఒక కొలిక్కి తీసుకురానుంది.

రాజస్తాన్ సీఎం రేసులో లేను

కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్



జైపూర్: రాజస్తాన్ ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్నట్లు వస్తున్న వార్తలను జోధ్‌పూర్ ఎంపీ, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కొట్టి పారేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ బీజేపీ ఇప్పటి వరకు ఎవరినీ ప్రకటించలేదని మంత్రి షెకావత్ గుర్తు చేశారు. అయితే, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. తమ పార్టీలో ఎలాంటి గ్రూపులూ లేవన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మాజీ సీఎం వసుంధరా రాజే, మంత్రి షెకావత్‌లలో ఒకరు సీఎం కావొచ్చని వార్తలు వస్తున్నాయి. సీఎం గెహ్లాట్ పోటీ చేస్తున్న జోధ్‌పూర్ జిల్లా సదర్‌పురా నుంచి బరిలోకి దిగుతానంటూ పార్టీ అధిష్టానాన్ని మంత్రి కోరినట్లు కూడా చెబుతున్నారు. ఈ వార్తలపై ఆయన పైవిధంగా స్పష్టతనిచ్చారు.

ఎలక్షన్ బీట్...

అదొక ఫ్యామిలీ పోలింగ్ బూత్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో అతి చిన్న పోలింగ్ కేంద్రం అది. ఆ పోలింగ్ బూత్‌లో ఓటర్ల సంఖ్య కేవలం 44. వారంతా రక్తసంబంధీకులు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండే ఆ గ్రామాన్ని కాపాడుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ని ఏర్పాటు చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బాలాఘట్ జిల్లాలోని సోనెవాని గ్రామానికి 55 కి.మీ. ట్రెక్కింగ్ చేసి వెళ్లాలి. ఇప్పటివరకు ఎన్నికలు జరిగినప్పుడు సోనెవాని గ్రామంలో నివసిస్తున్న ఆ పెద్ద కుటుంబంలోని 44 మంది కొండలు, గుట్టలు, నదులు దాటుకొని 20 కి.మీ. దూరంలో నవేగావ్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి ఓటు వేసేవారు. ఈ ఏడాది ఎన్నికల సంఘం ఆ గ్రామంలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్న ఒక పాఠశాలని పోలింగ్ కేంద్రంగా మార్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ స్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటు వేయడానికి ఇకపై ప్రయాస పడనక్కర్లేదని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు చెప్పారు.

కౌంటింగ్ తేదీని మార్చాలి

అయిజ్వాల్: మిజోరంలో ఓట్ల లెక్కింపుని డిసెంబర్ 3కి బదులుగా మరో రోజు నిర్వహించాలని క్రిస్టియన్లు అధికంగా ఉండే మిజోరం రాష్ట్రానికి చెందిన వివిధ రాజకీయ పక్షాలు కోరుతున్నాయి. డిసెంబర్ 3 ఆదివారం క్రిస్టియన్లకు పరమ పవిత్రమైన దినమని చర్చిలో ప్రార్థనలకు వెళ్లాలి కాబట్టి కౌంటింగ్ తేదీని మార్చాలని బీజేపీ, కాంగ్రెస్, అధికార ఎంఎన్‌ఎఫ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశాయి. రాష్ట్రంలో ప్రధాన చర్చిలు కూటమితో పాటు జోరమ్ పీపుల్ మూవ్‌మెంట్, పీపుల్స్ కాన్ఫరెన్స్‌లు కూడా తేదీని మార్చాలని డిమాండ్ చేశాయి. ఆ రోజంతా చర్చిలో సేవలు చేయడంలో ప్రజలందరూ నిమగ్నమై ఉంటారని కౌంటింగ్ తేదీని మార్చాలని కోరుతున్నాయి. మిజోరంలో 87% మంది క్రిస్టియన్లే ఉన్నారు. మిజోరంతో పాటు తెలంగాణ, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడు కౌంటింగ్ తేదీని డిసెంబర్3గా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లోని రెండు గిరిజన గ్రామాలు ఎన్నికల బహిష్కరణ

రాయపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని కోబ్రా జిల్లాలో రెండు గిరిజన గ్రామాలు ఈ సారి ఎన్నికల్ని బహిష్కరిస్తున్నట్టుగా ప్రకటించాయి. ఇప్పటికీ గ్రామాల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకడం లేదని, విద్యుత్ సదుపాయం లేక అంధకారంలో మగ్గిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న సర్దియా, బగ్దారిదండ్ గ్రామాల్లో ప్రజలు తమకు కనీస సదుపాయాలు కూడా కల్పించకపోతే ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్ని బహిష్కరించాలంటూ పాంప్లెంట్లు పంచుతూ, బ్యానర్లు కట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తుండగా రామ్‌పూర్‌లో తొలివిడత నవంబర్ 7న పోలింగ్ జరగనుంది.



మాండ్లా ర్యాలీలో ప్రియాంకా గాంధీ

12వ తరగతి వరకు ఉచిత విద్య

మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీలో ప్రియాంక హామీ

మాండ్లా: మధ్యప్రదేశ్‌లో విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని, స్కూలు పిల్లలకు అలవెన్స్‌లు కూడా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. ఆదివాసీ ప్రాంతంలో ఉన్న మాండ్లా జిల్లాలో గురువారం ఎన్నికల ర్యాలీలో ప్రియాంక పాల్గొన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే పఢో–పఢావో పథకం కింద 12వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకి నెలకి రూ.500, 9–10 తరగతి విద్యార్థులకి నెలకి వెయ్యి రూపాయలు, 11, 12 తరగతి విద్యార్థులకి నెలకి రూ.1500 ఇస్తామన్నారు. రాష్ట్రంలో కులగణన చేపడతామని ప్రియాంక గాంధీ పునరుద్ఘాటించారు. ఆదివాసీలు, ఇతర వెనుక బడిన వర్గాల వారికి జనాభాలో తమ నిష్పత్తి ఆధారంగా ఉద్యోగాలు రావడం లేదన్నారు. అందుకే కులగణన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ''బిహార్‌లో ఇటీవల రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తే జనాభాలో 84% ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు ఉన్నారని తేలింది. కానీ ఉద్యోగాలు చేస్తున్న వారిలో వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సి ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు'' అని ప్రియాంక అన్నారు.

బీజేపీలోకి మిజోరం స్పీకర్ !

అయిజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) కు షాక్ తగిలింది. పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర స్పీకర్ లాల్‌ర్లియానా సైలో పార్టీకి గుడ్ బై కొట్టేశారు. పార్టీ ఆయనకు టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సైలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బీజేపీలోకి వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కుతుందని చెప్పారు. మిజోరం అధికార పక్షమైన ఎంఎన్‌ఎఫ్‌కి ఇప్పటివరకు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్ బై కొట్టేశారు. స్పీకర్ కూడా రాజీనామా చేయడంతో పార్టీని వీడిన ఎమ్మెల్యేల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి బీజేపీ పెద్దలతో కొన్ని డిమాండ్లు చేశానని, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు వారు అంగీకరించారని సైలో వెల్లడించారు.

ఎన్నికల్లో ఫేస్‌బుక్, గూగుల్ తటస్థంగా వ్యవహరించాలి

న్యూఢిల్లీ: దేశంలో ప్రజల మధ్య మతపరమైన విద్వేషాలకు సోషల్ మీడియా వేదికలు కారణమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో ఫేస్‌బుక్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాలు తటస్థంగా వ్యవహరించాలని కోరింది. పక్షపాత ధోరణి సరైంది కాదని అభిప్రాయపడింది. ఈ మేరకు ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా' సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కి తాజాగా లేఖలు రాసింది. ఇండియాలో ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటివి అధికార బీజేపీకి, ప్రధాని మోదీ అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, పక్షపాతం ప్రదర్శిస్తున్నాయని వాషింగ్టన్ పోస్టు పత్రికలో కథనం వెలువడింది. ఈ నేపథ్యంలోనే 'ఇండియా' కూటమి జుకర్‌బర్గ్, సుందర్ పిచాయ్‌కి లేఖలు రాసింది. ఈ లేఖలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో షేర్ చేశారు.

సాక్షి కరీంనగర్

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023

18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కరీంనగర్: జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.



జ్వరం.. దగ్గు.. జలుబు

జిల్లాలో చాలామంది జలుబు దగ్గు, జ్వరం, తల, గొంతు నొప్పితో బాధ పడుతున్నారు. వాతావరణంలో మార్పులే దీనికి కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ ఇన్‌చార్జీల నియామకం



గంగుల కమలాకర్ | బి. వినోద్ కుమార్ | రవీందర్ సింగ్ | నారదాసు లక్ష్మణ్‌రావు | జీవీ కృష్ణారావు | ఎల్‌గందుల రమణ | రాజేశం గౌడ్ | ఈద శంకర్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకుపోతోంది. గులాబీ బాస్ సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభల షెడ్యూల్ విడుదలైంది. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ తరఫున ఇన్‌చార్జిల నియమించారు. ఇతర పార్టీలు టిక్కెట్లు ఖరారు చేయడంలో తర్జనభర్జన పడుతుంటే.. గులాబీ పార్టీ ఈ నెల 15న అభ్యర్థులకు బీఫాంలను అందజేయనుంది. బీఆర్ఎస్ అధినేత రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఇలా అన్ని విషయాల్లో ప్రత్యర్థి పార్టీలకు అందుకోలేనంత స్పీడ్‌గా ప్రచారంలో కారు జోరు పెంచింది.

గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం..

అసెంబ్లీ ఎన్నికలకు నెలల సమయమున్నా సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించటంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారైన మరుసటి రోజు నుంచే వారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గెలుపు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ తమను మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మధ్య గ్యాప్ లేకుండా జిల్లాలోని 7 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు.

ఇన్‌చార్జీలు వీరే..

చొప్పదండి :	గంగుల కమలాకర్
వేములవాడ :	బి.వినోద్‌కుమార్
మానకొండూర్ :	జీవీ.రామకృష్ణారావు
పెద్దపల్లి :	రవీందర్‌సింగ్
మంథని:	ఈద శంకర్‌రెడ్డి
రామగుండం:	నారదాసు లక్ష్మణ్‌రావు
జగిత్యాల:	ఎల్.రమణ, రాజేశంగౌడ్

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



మొగ్ధుంపూర్ చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు

- కలెక్టర్ గోపి

కరీంనగర్‌రూరల్/చొప్పదండి: ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి ఆదేశించారు. గురువారం కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్ స్టేజీ వద్ద, చొప్పదండి మండలం ఆర్నకొండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సీపీ సుబ్బారాయుడితో కలిసి పరిశీలించారు. రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల తనిఖీ చేస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలను అమర్చాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సీపీతో కలిసి కలెక్టర్ వాహనాలు తనిఖీ చేశారు. ఆర్డీవో కె.మహేశ్వర్, ఏసీపీ విజయ్‌కుమార్, సీఐలు ప్రదీప్‌కుమార్, రవీందర్, ఎస్సై ఉపేంద్రచారి, తహసీల్దార్ నవీన్, ఆర్ఐ రజనీకాంత్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ వాహనం

కొండపాక(గజ్వేల్): పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌లాల్‌కు తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ హైదరాబాద్ నుంచి రామగుండం వైపునకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. వారి వాహనానికి ముందు వెళ్తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై ఉన్న చిన్నకిష్టాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా తిరిగింది. దీంతో అడిషనల్ కలెక్టర్ వాహన డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో వివిధ ప్రాజెక్టుల కింద చేపట్టిన అన్ని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్వయంగా పరిశీలించారు. మల్టీపర్పస్ పార్క్, సమీకృత మార్కెట్లు, కమాండ్ కంట్రోల్‌లోని పనులను తనిఖీ చేశారు. హరితహారంలో అభివృద్ధి చేసిన పట్టణ ప్రకృతి వనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రధానంగా మల్టీపర్పస్ పార్క్ అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏజెన్సీ కాంట్రాక్టర్‌తో పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీకృత మార్కెట్లు, కమాండ్ కంట్రోల్ సిస్టమ్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. నగరంలో జరుగుతున్న పనుల్లో జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతి పనిలో ఏఈ, డీఈస్థాయి అధికారితో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు.


16 నుంచి ఓపెన్ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షలకు జీహెచ్ఎస్ రాంనగర్ సెంటర్‌లో 278 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు జీహెచ్ఎస్ సప్తగిరికాలనీ పాఠశాలలో 281మంది విద్యార్థులు, జీహెచ్ఎస్ హుజూరాబాద్ సెంటర్‌లో 160 విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో 719 మంది, జగిత్యాల జిల్లాలో 641 మంది, పెద్దపల్లి జిల్లా నుంచి 506 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 223 మంది విద్యార్థులు.. మొత్తంగా 2,089 విద్యార్థులు సంబంధిత అధ్యయన కేంద్రానికి వెళ్లి హాల్‌టికెట్ పొంది తప్పనిసరిగా పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

చిట్టీల పేరిట చీటింగ్!

‘నగరంలో ఇటీవల ఓ వ్యక్తి కొంతమందితో పరిచయం పెంచుకొని, నెలకు రూ.10 వేల చిట్టీ 20 మందితో కట్టించుకున్నాడు. కొంతమందికి మొదట్లో చిట్టీ డబ్బులు బాగానే ఇచ్చాడు. చివరివరకు వచ్చేసరికి సతాయించడం మొదలు పెట్టాడు. చిట్టీలు కట్టిన వారు డబ్బులు అడిగేసరికి రేపుమాపు అంటూ దాటేస్తూ వస్తుండటంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు.’

‘నగరంలో ఓ వ్యక్తి తన స్నేహితులు, బంధువులతో చిట్టీ వేయించి, సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. సదరు వ్యక్తి ఆ డబ్బులను మరో రకంగా పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు తెలిసింది.’



డబ్బులు వసూలు చేసి, పరారవుతున్న నిర్వాహకులు

- గడువు పూర్తయితే మ్యూరిటీ పేరిట ఇబ్బందులు
- జిల్లాలో అధికారికంగా 61 చిట్‌ఫండ్ కంపెనీలు
- అనుమతి లేనివి 2 వేలకు పైనే..
- నిఘా పెట్టిన పోలీసులు

కరీంనగర్ క్రైం: చిట్టీలు.. ఏ రకమైనవి అయినా జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎందుకంటే వాటి పేరిట లెక్కలేనన్ని మోసాలు జరుగుతున్నాయి. బాగా తెలిసినవారు, పరిచయమున్నవారు ఎవరి వద్ద చిట్టీ వేసినా ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. నిర్వాహకులు డబ్బులు వసూలు చేసి, రాత్రికి రాత్రే పరారవుతున్నారు. కరీంనగర్ నగరంలో ఇటీవల చిట్టీలు వేసి, భారీ మొత్తం జమయ్యాక మాయమవుతున్నవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఎన్ని జరిగినా ప్రజలు మాత్రం ఆశతో మోసపోతూనే ఉన్నారు. పోలీసులు, కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదు. నగరంలో పలువురు అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

గల్లీకొకటి..

నగరంలో చిట్టీలు నడిపేవారి సంఖ్య పెరుగుతోంది. గల్లీకొకటి నడుపుతున్నారంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో అధికారికంగా 61 చిట్‌ఫండ్ కంపెనీలుండగా అనధికారికంగా 2 వేలకు పైనే ఉన్నట్లు సమాచారం. గల్లీల్లో, అపార్ట్‌మెంట్‌లు, వాకర్స్ గ్రూపులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొంతమంది కలిసి గ్రూపుగా ఏర్పడి, చిట్టీలు వేసుకోవడం సాధారణమైపోయింది. కానీ ఎక్కువ శాతం మంది నిర్వాహకులు సభ్యులను ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. ప్రముఖ చిట్‌ఫండ్స్ సైతం చిట్టీ పాట పాడిన తర్వాత షూరిటీ పేరుతో కాలయాపన చేసి, డబ్బులను రెండు, మూడు నెలల వరకు కూడా ఇవ్వడం లేదు. దీంతో బాధితులు అవసరానికి డబ్బులు అందక నానాతంటాలు పడుతున్నారు.

ఇతర ప్రాంతాలకు ఉడాయింపు

నగరంలో చాలా వరకు చిట్టీలను ఎలాంటి అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నట్లు సమాచారం. నిర్వాహకులు చిట్టీల డబ్బులు ఇచ్చే క్రమంలో ముఖం చాటేసి, ఇతర ప్రాంతాలకు ఉడాయిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు అనుమతి లేని చిట్టీలపై నిఘా పెట్టినట్లు సమాచారం. ఇలా మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోసం చేస్తే చర్యలు



చిట్టీల పేరుతో మోసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా చిట్టీలు నడపొద్దు. పైసా పైసా కూడబెట్టుకొని, తెలియని వారి వద్ద చిట్టీలు వేయొద్దు. డబ్బుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– జి.నరేందర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ

ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ తనిఖీ



వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: సమీకృత ఎన్నికల కంట్రోల్ రూం పర్యవేక్షణ బృందాలు అప్రమత్తంగా ఉండి నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.బి.గోపి సూచించారు. గురువారం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వ్యవసాయశాఖ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ప్రతి విభాగం అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకునేలా జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సీ-విజిల్ పోర్టల్‌ను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

మీడియా సెంటర్ ప్రారంభం

కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), మీడియాసెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి ప్రారంభించారు. ఎన్నికల ప్రవర్తన నియావళిని పకడ్బందీగా అమలు చేయడంలో మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే ప్రకటనలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. అనుమతుల జారీకి జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ పని చేస్తుందని అన్నారు. ప్రకటనలకు సంబంధించి ఎంసీఎంసీ అనుమతి పొందే విధంగా చూడాలన్నారు. సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డీఆర్‌వో(ఇంచార్జి) పవన్ కుమార్, సీపీవో కొమురయ్య, కలెక్టరేట్ ఏఓ గడ్డం సుధాకర్, డీఏఓ శ్రీధర్, డీఐఓ శివరాములు, సమాచార శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ కలీం, ఉపకార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ సీహెచ్. కొండయ్య, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణలో అభివృద్ధి భేష్



మంత్రి గంగుల కమలాకర్‌తో చర్చిస్తున్న పీపీఏ లీడర్లు

కరీంనగర్: అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్(పీపీఏ) ఏడుగురు మాజీ ఎమ్మెల్యేల బృందం గురువారం కరీంనగర్‌లో పర్యటించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి తెలంగాణలో పదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. పీపీఏ పార్టీ మాజీ ఎమ్మెల్యేల బృందం సభ్యులు డోరూజీ ఖండు, తాయి తడప్, తేచీకామ, బిరిజాయ్, దేబియా తారా, చౌ షాటికే హోపక్, పిక్‌పులు మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లల్లోనే జరిగిన అభివృద్ధి అబ్బురపరుస్తోందని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 24 గంటల కరెంట్, రైతురుణమాఫీ, బీమా పథకాలతో పాటు విద్య,వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న తీరు బాగుందన్నారు. తెలంగాణలో ఆరు రోజులుగా వివిధ ప్రాంతాల్లో పర్యటించి, జరిగిన అభివృద్ధిని కళ్లారా చూశామని, సీఎం కేసీఆర్ దూరదృష్టి ఉన్న వారని, ఆయన పాలన దేశానికి అవసరం ఉందని బృందం సభ్యులు వెల్లడించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలకు చెందిన బృందం అభివృద్ధిని అధ్యయనం చేయడం శుభసూచకమని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒకేతాను ముక్కలు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకేతాను ముక్కలని అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్(పీపీఏ) మాజీ ఎమ్మెల్యేల బృందం సభ్యులు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల నుంచి గెలిచే ఎంపీల మద్దతును కాంగ్రెస్, బీజేపీలకు ఇవ్వకుండా సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్‌కు ఇస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించేలా ఒప్పిస్తామని ఎమ్మెల్యేల బృందం సభ్యులు వెల్లడించారు.

కబ్జాకు అడ్డుకట్ట

- ‘సాక్షి’ కథనంతో మోకాపై విచారణ
- నిర్మాణాలు లేవని నిర్ధారణ
- ఇంటినంబర్ల దరఖాస్తుల తిరస్కరణ


సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఎకరానికి పైగా ఖాళీ స్థలం కబ్జా ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. ఓ మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన భూమిని ఇంటినంబర్లతో కబ్జాచేసే ప్రయత్నాలపై ‘భూ మాఫియా నయా దందా’ అనే శీర్షికన ‘సాక్షి’లో వచ్చిన కథనం కలకలం సృష్టించింది. శివాజీనగర్‌లోని 54 సర్వే నంబర్‌లోని సుమారు రూ.20కోట్ల విలువైన ఆ స్థలంలో నిర్మాణాలు ఉన్నట్లు ఇంటినంబర్లు సృష్టించి కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నించారు. ఇందుకోసం నగరపాలకసంస్థకు చెందిన ఒకరిద్దరు ఉద్యోగుల సహకారం తీసుకున్నారు. కబ్జా ప్రణాళికలో భాగంగా ముందుగా సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా (స్వీయ మదింపు) ఇంటినంబర్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్నారు. ఆ భూమిపై అధికారికంగా హక్కులు పొందేందుకు కుట్ర పన్నారు. ఈ క్రమంలోనే ‘సాక్షి’లో కథనం రావడంతో వ్యవహారం కాస్తా బెడిసికొట్టింది. దీంతో ఎటూ పాలుపోని అధికారులు ఎట్టకేలకు దరఖాస్తులను తిరస్కరించారు. శివాజీనగర్‌లోని సదరు ఖాళీ స్థలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోఖాపై వెళ్లి విచారణ చేపట్టి, అక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవని నిర్ధారించారు. దీంతో తప్పుడు ధ్రువీకరణతో సెల్ఫ్ అసిస్మెంట్ ద్వారా ఆరు ఇంటినంబర్లకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించినట్లు నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహ నిర్మాణాలు లేని వాటికి ఇంటినంబర్లు కేటాయించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. కాగా ఆరు ఇంటినంబర్లకు వచ్చిన దరఖాస్తులను తిరస్కరించినట్లు కమిషనర్ ప్రకటించగా, అంతకుమించి దరఖాస్తులు ఉండవచ్చనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

ప్రింటింగ్ యజమానులు నిబంధనలు పాటించాలి

కరీంనగర్ అర్బన్: శాసనసభ సాధారణ ఎన్నికల క్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.గోపి ఆదేశించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, 127 ఏ సెక్షన్ ప్రకారం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి పని చేయాలని ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి పలు రాజకీయ పార్టీలవారు, పోటీ చేస్తున్న అభ్యర్థులు కానీ వారి తరపువారు గాని ఎన్నికలకు సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాల ముద్రణలో విధిగా వాటిపై కనిపించే రీతిలో ప్రచురణకర్త(పబ్లిషర్) పేరు, ముద్రణ ప్రెస్ ప్రింటర్ పేరు విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. పోస్టర్లు గాని, కరపత్రాలు గాని, ఇతర ప్రచార సామగ్రి ముద్రించుటకు ముందుగా ఇద్దరు వ్యక్తులు తనకు పబ్లిషర్ తెలిసినట్లుగా ధ్రువీకరిస్తూ ఇచ్చిన డిక్లరేషన్ కాపీ రెండు పత్రాలను పొందిన తరువాతే ముద్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. ముద్రితమైన ప్రచార సామగ్రి ప్రతి వెంట పబ్లిషర్ ఇచ్చిన డిక్లరేషన్ కాపీని జత చేసి జిల్లా ఎన్నికల అధికారికి, రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని అన్నారు. నియమావళి ఉల్లంఘించినట్లుగా భావించి ఆరు నెలలు జైలు శిక్ష, 2వేల జరిమానా లేదా రెండు శిక్షలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఎన్నికల సరంజామా సిద్ధం



కలెక్టరేట్‌లో ఎన్నికల సామగ్రి

కరీంనగర్ అర్బన్: ఎన్నికల సరంజామా కలెక్టరేట్‌కు చేరింది. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు, ఉద్యోగులకు వీటిని అందజేయనున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో కీలక భూమిక పోషించే అధికారులకు హ్యాండ్‌బుక్, మ్యాపింగ్, క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లలో ముందు జాగ్రత్తలు, చేయదగినవి, చేయకూడనివి పేర్కొంటూ ఎన్నికల అధికారులకు హ్యాండ్‌బుక్‌లు సరఫరా చేశారు. ఎన్నికల శిక్షణలో అధికారులు, ఉద్యోగులకు అందజేస్తున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల క్రమంలో సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇటీవల శిక్షణనివ్వగా మరోమారు శిక్షణ ఇవ్వనున్నారు.

వీవీప్యాట్‌పై అభ్యర్థుల ఫొటోలు



కరీంనగర్‌రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం టెక్నాలజీని వినియోగిస్తు ఓటర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా వీవీ ప్యాట్‌లలో మార్పులను చేసింది. గతంలో వీవీ ప్యాట్‌పై పార్టీ గుర్తు, ఎదురుగా అభ్యర్థి పేర్లు మాత్రమే ఉండేవి. నిరక్షరాస్యులు, వృద్ధులు అభ్యర్థిని సరిగ్గా గుర్తించక స్పష్టంగా కన్పించే గుర్తుపై ఓటువేసేవాళ్లు. అయితే నవంబరు 30న నిర్వహించనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పార్టీ గుర్తుతోపాటు అభ్యర్థి ఫొటో ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలతో పాటు వారి గుర్తులు వీవీప్యాట్‌పై సీరియల్‌గా ముద్రిస్తారు. ఓటర్లు ఫొటో చూసి తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే అవకాశం కలిగింది. అంతేకాకుండా పోస్టల్ బ్యాలెట్‌పైనా అభ్యర్థుల ఫొటో ఉంటాయి.

ప్రొహిబిషన్, డిక్లరేషన్ పరిష్కారంపై హర్షం



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: వీఆర్వోల పునర్విభజనలో భాగంగా వివిధశాఖలకు అలాట్‌మెంట్ అయిన 73 మంది ప్రొహిబిషన్, డిక్లరేషన్ సమస్యకు పరిష్కారం లభించడంతో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్ బి.గోపిని వీఆర్వోలతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 8ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సదరు ఫైలును కలెక్టర్ అత్యంత శ్రద్ధతో పరిష్కరించారని వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఏవో సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రొసిడింగ్ కాపీలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోలకు, ప్రమోషన్ పొందిన వీఆర్వోలకు అందజేశారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమళ్ల శారద తదితరులు ఉన్నారు.

రూ.2 లక్షలు పట్టివేత

కరీంనగర్‌క్రైం/గన్నేరువరం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలోని తెలంగాణచౌక్‌లో గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒకరి వద్ద రూ.2లక్షలు పట్టుబడ్డాయి. అదే విధంగా ఆరుగురు పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పరిధిలో ఆరుగురు, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎనిమిది మంది పాతనేరస్తులను బైండోవర్ చేసినట్లు పోలీసులు వివరించారు. గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15మంది బెల్టుషాపు నిర్వాహకులను తహసీల్దార్ బిక్షపతి ఎదుట ఎక్సైజ్‌శాఖ అధికారులు బైండోవర్ చేశారు.

ట్రాఫిక్ పోలీసుల నాకాబందీ

కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం నాకాబందీ నిర్వహించారు. అన్ని రకాల వాహనాలను విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా సైరన్లు, బ్లాక్‌ఫిల్మ్ ఉన్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బ్లాక్‌ఫిల్మ్, సైరన్లు కలిగిఉన్న 124 వాహనాలకు జరిమానాలు విధించి బ్లాకుఫిల్మ్ తొలగించారు. ట్రాఫిక్ ఏసీపీ మహమ్మద్ సర్వర్, సీఐలు పర్స రమేశ్, కరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్లమెంట్‌ సమావేశాలకు 'అల్ఫోర్స్‌ విద్యార్థిని'


అవార్డు అందుకుంటున్న కనక్‌ ముందాడా

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న కనక్‌ ముందాడా శీతాకాల పార్లమెంట్‌ సమావేశాలు వీక్షించేందుకు ఆహ్వానం అందుకున్నట్లు కరస్పాండెంట్‌ వి.రవీందర్‌ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మంత్రవాహిని స్వచ్ఛంద సంస్థ, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన 'సిటిజన్‌ యూత్‌ పార్లమెంట్‌' కార్యక్రమంలో కనక్‌ ముందాడా గవర్నర్‌ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని రవీందర్‌రెడ్డి సత్కరించారు. ప్రిన్సిపాల్‌ గోలి శ్రీనివాస్‌, బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగాల్లో 'తేజస్‌' సత్తా


ఉద్యోగాలు సాధించిన తేజస్‌ విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని తేజస్‌ డిఫెన్స్‌ అకాడమీకి చెందిన 220 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అగ్నిపథ్‌ ద్వారా ఇండియన్‌ ఆర్మీకి 169 మంది ఎంపికయ్యారు. స్టాఫ్‌ సెలక్షన్‌ కమిషన్‌ ద్వారా బీఎస్‌ఎఫ్‌, సీఆర్పీఎఫ్‌, సీఐఎస్‌ఎఫ్‌కు 26మంది ఎంపికై నట్లు తేజస్‌డిఫెన్స్‌ అకాడమీ, జూనియర్‌ కళాశాల చైర్మన్‌ సీహెచ్‌ సతీశ్‌రావు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పొన్నం అనిల్‌గౌడ్‌లు ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్లు వాసాల రమేశ్‌, మానుపాటి వేణుగోపాల్‌, జేరిపోతుల మొండయ్య, గండు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, నాయకులు జమీలొద్దీన్‌, ఎస్కేబాబా, శ్రీకాంత్‌, సుధాకర్‌, ప్రభాకర్‌ పాల్గొన్నారు.

మద్యం సీసాలో గాజుపెంకులు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం దుర్శేడ్‌లోని మద్యం దుకాణంలో గురువారం కొందరు వ్యక్తులు ఎంసీ డైట్‌ మద్యం ఫుల్‌బాటిల్‌ కొనుగోలు చేశారు. పర్మిట్‌రూమ్‌లో మద్యం తాగుతుండగా సీసాలో గాజుపెంకులు కన్పించడంతో ఆందోళన చెందారు. వెంటనే సీసాను వైన్స్‌ సిబ్బందికి చూపించగా తమకు సంబంధంలేదని చెప్పడంతో ఆగ్రహించి వైన్స్‌ ఎదుట నిరసన తెలిపారు. ఎక్సైజ్‌శాఖకు ఫిర్యాదు చేస్తామని కొమురయ్య, ఓదెలు తెలిపారు.

'గృహలక్ష్మి'కోసం నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రాజయ్య

మానకొండూర్‌: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పి.రాజయ్య తనకు గృహలక్ష్మి కింద ఇళ్లు మంజూరు కాలేదని గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రహదారిపై నిరసన తెలిపాడు. ఇటీవల గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్నానని, తన పేరు లబ్ధిదారుల లిస్టులో లేదని, తనకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశాడు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ నేతలు సర్ది చెప్పడంతో రాజయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

గంజాయి పట్టివేత

మానకొండూర్‌:మండలంలోని సదాశివపల్లి స్టేజీ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్‌ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కముటం భూమేశ్‌ సదాశివపల్లి స్టేజీ సమీపంలో కొందరికి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.25వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఒకరి ఆత్మహత్య

రామడుగు: మండలకేంద్రానికి చెందిన వానరాసి చంద్రయ్య (65) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా గురువారం సాయంత్రం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడికి ముగ్గురు భార్యలు ఉన్నట్టు సమాచారం ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌, కరీంనగర్‌
ఈ క్రింది వాహనములకు తేది: 17-10-2023
మంగళవారం రోజున వేలము నిర్వహించబడును.

SNo.	VEHICLE No.	DESCRIPTION	MODEL
1.	TS 02 EF 2458	JOHN DEERE	2014
2.	AP 15 TV 2164	TOYOTA	2011
3.	TS 07 JE 3626	BALENO SIGMA 1.3L DIESEL 5 SI	2018
4.	AP 15 BB 7763	NEW HOLLAND 3630	2012
5.	AP 36 AF 3807	JOHN DEERE 5310	2010
6.	AP 15 BN 9425	JOHN DEERE 5055 HARVESTER	2014
7.	MH 20 CR 1874	NEW HOLLAND ఖమ్మంలో వేలము వేయబడును	2013
8.	AP 20 AV 7017	JOHN DEERE 5038 D మంచిర్యాలలో వేలము వేయబడును	2012

వేలము వేయు స్థలము :
SHRIRAM AUTOMALL
SY.NO. 437, 438, BESIDE KOTAK MAHINDRA BANK,
HYDERABAD ROAD, ALUGUNUR VILLAGE,
THIMMAPUR MANDAL, KARIMNAGAR DIST.
Cont: 0878-2994549, Cell: 9866247854

జ్వరం.. దగ్గు.. జలుబు

- ఏ ఇంట చూసినా ఇవే లక్షణాలు
- ఆస్పత్రులకు పరుగులు పెడుతున్న బాధితులు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యులు
- జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో బెడ్లన్నీ ఫుల్‌


జిల్లా ఆస్పత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్‌ కోసం బారులు తీరిన పేషెంట్లు

కరీంనగర్‌టౌన్‌: పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పొద్దంతా ఉక్కపోత, చెమటతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రయితే మబ్బులుపట్టి, చల్లని గాలులు వీస్తున్నాయి. మూడు వారాలుగా నెలకొన్న ఈ అసమతూల్య వాతావరణం వైరల్‌ ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతోంది. ఏ ఇంట్లో చూసినా జలుబు, దగ్గు, జ్వరం, తల, గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడే పిల్లలు, పెద్దలు కనిపిస్తున్నారు.

రాత్రి 15 నుంచి 20 డిగ్రీలు..

ఇటీవలి కాలంలో పగటి పూట ఉష్ణోగ్రతలు సగటున 36 నుంచి 39 డిగ్రీల వరకు నమోదవుతుంటే.. రాత్రి 15 నుంచి 20 డిగ్రీలకు పడిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే 5 డిగ్రీలు పెరిగినా, తగ్గినా అసాధారణ వాతావరణంగా పరిగణిస్తారని నిపుణులు చెబుతున్నారు. గంటల వ్యవధిలోనే తారెత్తించే ఉష్ణోగ్రతల వ్యత్యాసాలను కొందరి శరీరాలు తట్టుకోలేకపోవచ్చని వైద్యులు అంటున్నారు. దీనివల్ల ఉన్నట్టుండి అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు.

40 శాతం మంది చిన్నారులు, వృద్ధులే

విషజ్వరాలకు తోడు జలుబు, దగ్గు, తుమ్ములు వంటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. పిల్లలు, గర్భిణులు, వృద్ధుల్లో సమస్య కాస్త తీవ్రంగా కనిపిస్తోంది. కళ్లు, ముక్కుల నుంచి నీళ్లు కారడం, నేత్రాలు ఎర్రబారడం వంటి సమస్యలతో చాలా మంది ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఉన్న 350 బెడ్లు నిండిపోతున్నాయి. రోజుకు సగటున 40 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా నమోదవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. బాధితుల్లో 40 శాతం మంది చిన్నారులు, వృద్ధులే ఉంటున్నారు.

నగర బాధితులే ఎక్కువ..

కరీంనగర్‌ నగరంలో వైరల్‌ జ్వరాల బాధితులు ఎక్కువగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. రోజుకు సగటున 15 నుంచి 30 శాతం మంది వైరల్‌ సమస్యలతో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి వస్తున్నారని అంటున్నారు. ఔట్‌ పేషెంట్లు వందల్లోనే ఉంటున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలతోపాటు ప్రైవేట్‌ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటోంది.

జాగ్రత్తలు పాటించాలి



నగరంలో చికిత్సకు వచ్చే వారిలో 20 శాతం మంది వైరల్‌ ఫీవర్లు, శ్వాసకోశ సమస్యలతో బాధ పడుతున్నారు. జ్వరం, తల, గొంతు, ఒళ్లు నొప్పులు మూడు రోజుల కంటే ఎక్కువ ఉంటే వైద్యులను సంప్రదించాలి. వాతావరణ మార్పులతోనే జ్వరాలు విజృంభిస్తున్నాయి. కాచి చల్లార్చి, వడపోసిన నీటిని తాగాలి. డీహైడ్రేషన్‌కు గురవకుండా తరచూ నీళ్లు తాగాలి. వైరల్‌ ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చేతుల శుభ్రత పాటించాలి.

– డాక్టర్‌ ఉపేందర్‌, క్రిటికల్‌ కేర్‌ నిపుణులు

ముగ్గురు బాలికలపై వృద్ధుడి లైంగికదాడి

- మూడు నెలలుగా ఆకృత్యం
- జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు..?

గొల్లపల్లి:ముగ్గురు బాలికలపై ఓ వృద్ధుడు మూడు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన మండలంలోని తిర్మాలాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. తాత అని పిలిచిన వారికి డబ్బు ఆశ చూపి.. మాయమాటలు చెప్పి ఈ ఆకృత్యానికి ఒడిగడుతున్నాడు. పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో వారి తల్లులు మందలించగా.. అసలు విషయం బయటపడింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు రంగధాముని‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకరు ఐదు, మరొకరు నాలుగు, ఇంకొకరు మూడో తరగతి చదువుతున్నారు. ముగ్గురి తండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ వెళ్లారు. తల్లులు కూలి పనిచేస్తూ వీరిని పోషించుకుంటున్నారు. వీరి సామాజికవర్గానికే చెందిన శివరాత్రి ముత్తయ్య (65) వీరి ఇంటి సమీపంలో ఉంటాడు. పిల్లలకు సెలవు రోజు ఇంటికి పిలిచి డబ్బులు ఇవ్వడంతోపాటు పొలం వద్దకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడుతున్నాడు. ఇలా మూడునెలలుగా తన కామవాంఛ తీర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో చిన్నారులు నాలుగురోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. తల్లులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని వారితో చెప్పారు. సదరు కామాంధుడిని కుల సంఘంలోకి పిలిస్తే రాకపోగా.. బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుల తల్లులు అంటున్నారు. దీంతో చేసేది లేక వారు గొల్లపల్లి పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ఆందోళనకు దిగారు.

అడిగితే బెదిరింపులు

తమ పిల్లలకు జరిగిన అన్యాయంపై సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. కుల పెద్దలు పిలిచినా ముత్తయ్య రాలేదని, పైగా ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్‌ తమనే బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

ఉరి తీయాలి

తమ పిల్లల జీవితాలను నాశనం చేసిన ముత్తయ్యను ఉరితీయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి నిందితుడితోపాటు ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల సంఘం సభ్యులు డిమాండ్‌ చేశారు. సదరు నిందితుడిని ఎస్సై నరేశ్‌ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మాట కలిపి.. కారం చల్లి.. కత్తితో దాడిచేసి

- పశువుల వ్యాపారి నుంచి రూ.82వేల చోరీ
- కేసు నమోదుచేసిన పోలీసులు


బాధితుడు రాజయ్య

మానకొండూర్‌: అతనో పశువుల వ్యాపారి. గురువారం అంగడి ఉండడంతో పశువులు కొనేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. దారిమధ్యలో ఆకలివేయడంతో టిఫిన్‌ కోసం ఆగాడు. టిఫిన్‌ తిని బిల్లు చెల్లిస్తుండగా.. అతనివద్ద డబ్బులు చూసిన ఓ మాయగాడు ఎలాగైనా కాజేయాలని అనుకున్నాడు. తనవద్ద ఓ గేదె ఉందని నమ్మించి వెంట తీసుకెళ్లాడు. కొంతదూరం వెళ్లాక పశువుల వ్యాపారి కళ్లలో కారంకొట్టి.. కత్తితో బెదిరించి.. రూ.82వేలు తీసుకుని పారిపోయాడు. ఈ ఘటన మానకొండూర్‌ మండలం శంశాబాద్‌ శివారులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. బాధితుడు అంకతి రాజయ్య, ఎస్సై శ్రీకాంత్‌ వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన అంకతి రాజయ్య(63) పశువుల వ్యాపారం చేస్తుంటాడు. గురువారం పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి అంగడికి ద్విచక్ర వాహనంపై ఉదయాన్నే బయల్దేరాడు. మార్గంమధ్యలో ఆకలివేయడంతో తాడికల్‌ గ్రామశివారులో ఓ హోటల్‌ వద్ద ఆగాడు. టిఫిన్‌ తిన్నాడు. తనజేబులో నుంచి డబ్బులు తీసి బిల్లు చెల్లిస్తుండగా.. అక్కడే ఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తి గమనించాడు. రాజయ్య వద్ద పెద్దమొత్తంలో నగదు ఉందని గమనించి, ఎలాగైనా కాజేయాలని పథకం పన్నాడు. రాజయ్య వద్దకు వచ్చి మాటామాట కలిపాడు. తనవద్ద ఓ గేదె ఉందని, అమ్ముతానని చెప్పడంతో రాజయ అతనితో కలిసి వెళ్లాడు. మానకొండూర్‌ మండలం శంశాబాద్‌ శివారులోని కాలువ ప్రాంతానికి చేరుకోగానే గుర్తు తెలియని వ్యక్తి రాజయ్య దగ్గర ఉన్న డబ్బు ఇవ్వమని బెదిరించాడు. ఇవ్వకపోవడంతో కళ్లలో కారం చల్లాడు. కత్తితో చేతిపై దాడి చేశాడు. అతని దగ్గర ఉన్న రూ.82వేలు తీసుకుని పారిపోయాడు. కాసేపటికి తేరుకున్న రాజయ్య వెంటనే మానకొండూర్‌ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

యువత భవిష్యత్‌ బాధ్యత నాదే


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్‌

కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరిన యువత, భవిష్యత్తు బాధ్యత తనదేనని మంత్రి గంగుల కమలాకర్‌ అన్నారు. గురువారం 45వ డివిజన్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు పసుపుల నరేశ్‌, శ్రీకాంత్‌, సాయి, దిలీప్‌, తరుణ్‌, విజయ్‌తో పాటు 50 మంది యువకులు మీ సేవ కార్యాలయంలో మంత్రి గంగుల కమలాకర్‌ సమక్షంలో పార్టీలో చేరారు. మంత్రి గంగుల కమలాకర్‌ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరిన యువత భవిష్యత్తు బాధ్యత తనదేనని అభయం ఇచ్చారు. మేయర్‌ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్‌, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రెడ్డవేణి మధు పాల్గొన్నారు.

వసతులు సక్రమంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న సరస్వతి

కరీంనగర్‌: వసతులు సక్రమంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి సూచించారు. గురువారం ఓపెన్‌ షెల్టర్‌ హోమ్‌, మనోవికాస్‌ మానసిక వికలాంగుల పాఠశాలను బాలల పరిరక్షణ అధికారి శాంత, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098 జిల్లా కో ఆర్డినేటర్‌ సంపత్‌తో కలిసి సందర్శించారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం లయన్స్‌ క్లబ్‌ వారి సహకారంతో 30స్కూల్‌ బ్యాగులను మానసిక వికలాంగుల పాఠశాల పిల్లలకు అందించారు. సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌, మానసిక వికలాంగుల పాఠశాల అసోసియేషన్‌ సభ్యులు రామారావు, పరమేశ్వర్‌, ఔట్రీచ్‌ వర్కర్‌ రమేశ్‌ పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: తమిళనాడులోని చెన్నైలో ఈనెల 17నుంచి 24 వరకు జరగనున్న తొలి హాకీ ఇండియా సబ్‌ జూనియర్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ సౌత్‌ జోన్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ సంఘం కార్యదర్శి సురేందర్‌ సింగ్‌ తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన మహ్మద్‌ అహ్మద్‌ అలీ, మహ్మద్‌ రెహ్మాన్‌ అలీ, మహ్మద్‌ సైఫోద్దీన్‌, సొల్లు సాయికిరణ్‌, ఎస్‌ షెర్‌లెన్‌కౌర్‌, గగన్‌జీత్‌కౌర్‌ ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని జిల్లా హాకీ సంఘం బాధ్యులు, క్రీడాసంఘాల నాయకులు అభినందించారు.

15న జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్‌ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: జిల్లా బాస్కెట్‌బాల్‌ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్‌ స్టేడియంలో ఈ నెల 15న జిల్లాస్థాయి బాస్కెట్‌ బాల్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్‌ సంఘం కార్యదర్శి అనంతరెడ్డి తెలిపారు. రాణించిన క్రీడాకారులను ఈ నెల 17నుంచి సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌ అంబేద్కర్‌ స్టేడియంలో నేడు జరగనున్న జిల్లాస్థాయి వాలీబాల్‌ పోటీలకు స్థానిక సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన మండలస్థాయి పోటీల్లో రాణించిన గీతిక, సంజన, నిఖిత, చందన, హాసిని, అదితి, హర్షిత్‌, పార్థు, నిఖిలేశ్వర్‌ లు ఎంపికయ్యారు. వీరిని సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్‌ దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు.

భరోసా ఇచ్చేవారికే ముస్లింల మద్దతు

- రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ ఎండీ అన్సారీ


మాట్లాడుతున్న ఎండీ అన్సారీ

శంకరపట్నం: ముస్లింలకు భరోసా ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ ఎండీ.అన్సారి అన్నారు. మండలంలోని వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ముస్లిం డిక్లరేషన్‌ సంకల్పసభ జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం డిక్లరేషన్‌ బుక్‌లెట్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్సారీ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ముస్లింల జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు కమిటీ వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ 12శాతం రిజర్వేషన్‌ అమలు చేస్తామని మాట తప్పారని అన్నారు. విద్యార్థి నాయకుడు సలీంపాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షల మంది ఉన్న ముస్లింలు 40నియోజకవర్గాల్లో తమ ప్రభావం చూపెడతామని అన్నారు. వక్ఫ్‌ భూములను మంత్రులు గంగుల కమలాకర్‌, శ్రీనివాస్‌గౌడ్‌ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 80శాతం ముస్లింలు పేదరికంలో ఉన్నారని, మైనారిటీ బంధు పేరిట ఒక్కొక్కరికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. టీఎస్పీఎస్సీలో ఒక్క ముస్లిం కూడా లేరని ఆరోపించారు. చివరకు మైనార్టీశాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్‌ను నియమించారని, దర్గా, మసీదు, చిల్లా అంటే కొప్పుల ఈశ్వర్‌కు తెలుసా అని ప్రశ్నించారు. మైనార్టీ కార్పొరేషన్‌ నిధుల నుంచి ఏటా రూ.80కోట్లు రంజాన్‌ ఇఫ్తార్‌విందు ఇస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్‌ విందులు ఎవరు అడిగారని అన్నారు. ముస్లింల ఓట్లు చీల్చేందుకు మతతత్వ పార్టీ ఎంఐఎంతో రహస్య పొత్తు పెట్టుకుంటే పార్టీని అవసరమైతే ఓడిస్తామని ప్రముఖ రచయిత స్కైబాల అన్నారు. పదేళ్లలో ముస్లింల సంక్షేమానికి కృషిచేయని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకుల మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. బీజేపీ కన్నా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ ప్రమాదకారి అని మాజీ ఎంపీటీసీ రహీముద్దీన్‌ విమర్శించారు. ఈ సమావేశంలో సయ్యద్‌ నవాజ్‌, రహీం, ఆరిఫ్‌, జహంగీర్‌, ఇసాముద్దీన్‌, అయాన్‌, జాకీర్‌ పాల్గొన్నారు.

13 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం

- మేయర్‌ వై.సునీల్‌రావు


మాట్లాడుతున్న మేయర్‌ వై.సునీల్‌రావు

కరీంనగర్‌: ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 నియోజకవర్గాలను బీఆర్‌ఎస్‌పార్టీ కైవసం చేసుకుంటుందని, కాంగ్రెస్‌, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మేయర్‌ వై.సునీల్‌రావు అన్నారు. గురువారం ఎస్‌బీఎస్‌ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్‌ నాలుగున్నరేళ్లల్లో చేసిందేమి లేదన్నారు. కనీసం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండరని, ఫోన్‌ చేస్తే స్విచ్‌ఆఫ్‌గా ఉంటుందని సొంత పార్టీ నాయకులే ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ నాలుగున్నరేళ్లుగా ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇటీవల సీఎం కేసీఆర్‌ కనుమరుగు కావడం ఖాయమని మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌, బీజేపీ పార్టీలను ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓడిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీని విమర్శించే అర్హత మేయర్‌కు లేదు


మాట్లాడుతున్న పెద్దపల్లి జితేందర్‌

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ అభివృద్ధికి పాటు పడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ని విమర్శించే అర్హత మేయర్‌ వై.సునీల్‌రావుకు లేదని బీజేపీ కార్పొరేటర్‌ పెద్దపల్లి జితేందర్‌ అన్నారు. గురువారం ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎంపీగా సంజయ్‌ పార్లమెంట్‌ పరిధిలో, జిల్లా కేంద్రంలో ఎన్ని పనులు చేశాడో, ఎన్ని నిధులు తెచ్చాడో తెలియని అజ్ఞానంలో ఉన్న బీఆర్‌ఎస్‌ నేతలకు ప్రజలు సరైన సమాధానం చెబుతారని అన్నారు. బండి సంజయ్‌కి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్‌ బ్రిడ్జికి రూ.156 కోట్లు ఎంపీ తీసుకువస్తే సంజయ్‌ లేని సమయంలో ప్రారంభోత్సవాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌ నేతలదని ఎద్దేవా చేశారు. స్మార్ట్‌సిటీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేటర్లు కాసర్ల ఆనంద్‌, కొలగాని శ్రీనివాస్‌, రాపర్తి విజయ, బండ సుమ, నాయకులు అప్పాల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన బీఆర్‌ఎస్‌

- ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్‌


మాట్లాడుతున్న వెంకటేశ్‌

హుజూరాబాద్‌: విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బీఆర్‌ఎస్‌ను రాబోయే ఎన్నికల్లో తరిమికొట్టాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్‌ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హుజూరాబాద్‌ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి చేసిందేమీలేదన్నారు. హుజూరాబాద్‌ ఉప ఎన్నికల్లో అనేకహామీలు ఇచ్చారని, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఓడిపోవడంతో ఏ హామీ నెరవేర్చాలేదని అన్నారు. హుజూరాబాద్‌ నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేవని, బీసీ సంక్షేమ హాస్టళ్లు, బాలికల హాస్టల్‌ శిథిలావస్థలో ఉన్నాయని వాటికి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి విద్యార్థి, నిరుద్యోగులు సిద్ధం కావాలని కోరారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్‌ హుజూరాబాద్‌ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొమ్మటి వేణుగోపాల్‌, కార్యదర్శిగా జూపాక శివమణి, ఉపాధ్యక్షుడిగా గూండ వరుణ్‌తేజ్‌, సహాయ కార్యదర్శి రాంపెల్లి రోహిత్‌, కోశాధికారిగా ముదిగంటి నాగేందర్‌, సభ్యులుగా భాస్కర్‌, మధుమోహన్‌రెడ్డి, శ్రీచరణ్‌, విజయ్‌, శ్రీకాంత్‌, బాలు, వరుణ్‌, అభినయ్‌ ఎన్నికయ్యారు.

సైకియాట్రిక్‌ సొసైటీ కార్యవర్గం



కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ సైకియాట్రిక్‌ సొసైటీ నూతన కార్యవర్గాన్ని నగరంలో ఓ హోటల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్‌ కె.కె. లక్ష్మణ్‌, ఉపాధ్యక్షుడిగా డాక్టర్‌ పి.కిషన్‌, కార్యదర్శిగా డాక్టర్‌ ఎం.ప్రవీణ్‌ కుమార్‌, జాయింట్‌ సెక్రటరీ డాక్టర్‌ ఎన్‌.సంజయ్‌కుమార్‌, కోశాధికారిగా డాక్టర్‌ సాయికృష్ణ పులి నియామకం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్‌ భాగ్యరెడ్డి, సీనియర్‌ సైకియాట్రిస్ట్‌లు డాక్టర్‌ యర్రా శ్రీధర్‌రాజు, డాక్టర్‌ వి.జార్జ్‌రెడ్డి, కరీంనగర్‌ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్‌ రామ్‌కిరణ్‌, ఇన్‌స్టాలేషన్‌ అధికారిగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ మిన్‌హాజ్‌ జాఫర్‌ పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో జైలుశిక్ష

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలుశిక్ష విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. ట్రాఫిక్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్యంతాగిన వాహనాలు నడిపిన 20మందిని పోలీసులు కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. ఇందులో ఇద్దరికి ఐదురోజుల జైలు, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మిగితా 16మందికి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఐటీఐ అప్రెంటిస్‌ షిప్‌ మేళా

కరీంనగర్‌: ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈనెల 16న ఉదయం 10 గంటలకు కరీంనగర్‌ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌ షిప్‌ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్‌, ప్రిన్సిపాల్‌ ఎస్‌.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పాల్గొనే అభ్యర్థులు తొలుత అప్రెంటిస్‌ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌, జిరాక్స్‌ కాపీలతో ఉజ్వల పార్క్‌ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

■ సెక్యూరిటీగార్డ్స్‌ కావలెను. 8hrs డ్యూటీ, వీక్లీ ఆఫ్‌, PF+ESI సౌకర్యం కలదు. మంచి జీతం బోనస్‌. కరీంనగర్‌. Ph: 7013730900/ 9246543129 [H-793466]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824


మానేరు స్కూల్లో..


ఎస్సారార్ కళాశాలలో..


పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్లో..

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో హాజరై అందంగా బతుకమ్మలను తయారు చేసి ఒక చోట పెట్టి సంబురంగా ఆడుతూ సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాల్లో ఆయా విద్యా సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- కరీంనగర్/కరీంనగర్‌సిటీ/సప్తగిరికాలనీ/విద్యానగర్/కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్


మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో..


వసంత్ వ్యాలీలో..


బ్లూబెల్స్ స్కూల్లో..


జాన్సన్ గ్లోబల్, కోరా పాఠశాలల్లో..


వాణినికేతన్ బాలవిహార్ ఉన్నత పాఠశాలలో..


సప్తగిరి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో..


మంకమ్మతోటలోని పారమిత పాఠశాలలో..


వావిలాలపల్లిలోని సెయింట్ పాల్ స్కూల్లో..


వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో..


అచీవర్స్ స్కూల్లో..


భగవతి స్కూల్లో..


ఫకీర్‌పేటలో..


చెర్లభూత్కూర్‌లో..


సాధన స్కూల్లో..


రేకుర్తిలోని ప్యారడైజ్‌లో..


నోవెల్స్ స్కూల్లో..


గోపాల్‌పూర్‌లోని శాతవాహన స్కూల్లో..

భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భగత్‌నగర్‌లో భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఉయ్యాల పాటలతో ఆడిపాడారు. మేయర్ సతీమణి అపర్ణ హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ పండుగ బతుకమ్మకు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో గొప్ప ఆదరణ దక్కిందన్నారు.

బతుకమ్మ పాట చిత్రీకరణ


బతుకమ్మ పాట చిత్రీకరణలో పాల్గొన్న మహిళలు

కరీంనగర్‌టౌన్: సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని కరీంనగర్ కళాకారులు రచించిన బతుకమ్మ పాటను అమ్ము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సుజాతరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నగర శివారులోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ పాటను చిత్రీకరించారు. తెలంగాణ సంస్కృతికి పట్టుకొమ్మ బతుకమ్మ పండుగ ప్రాశస్త్యంను తెలుపుతూ పాట చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో అక్షయ రెడ్డి, కాసం శైలజరెడ్డి, స్రవంతి, ఇందిరా, సుజాత, రమా, శైలజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానసిక ఆరోగ్యంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కరీంనగర్‌సిటీ: నగరంలోని శివాని డిగ్రీ కళాశాలలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్య నిపుణులు పృథ్వీరెడ్డి, సప్తగిరికాలనీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఖిల, ప్రోగ్రాం ఆఫీసర్ శిల్పాలు మానసిక సమస్యలు, రుగ్మతలు, వాటి లక్షణాలను వివరించారు. పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దన్నారు. మానసిక సమస్యల కోసం ఏర్పాటు చేసిన 14416 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రజుమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు


నేత్రపరీక్షలు చేస్తున్న వైద్యుడు

కరీంనగర్: నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(సైన్స్)లో గురువారం వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుమోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాసన్ ఐకేర్ మార్కెటింగ్ టీం అజయ్, కంటి పరీక్షల నిపుణులు ఆకాశ్, అధ్యాపకులు కేదారేశ్వర్, జె.శ్రీనివాస్, టి.స్వర్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నగునూరులో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ జన్మదినం పురస్కరించుకుని శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామస్తులకు నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల సునీల్, మణికంఠ, రాజు, అఫ్రోజ్, మారుతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోట శ్యాంకుమార్

విద్యానగర్(కరీంనగర్): నిజాయితీ ఓటుపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సామాజికవేత్త కోట శ్యాంకుమార్ ఆవిష్కరించారు. కుళ్లుకుతంత్రాల రాజకీయాలతో నాశనమైపోతున్న ఈ సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఓటరుపై ఉందన్నారు.

మాటల్లో కాదు చేతల్లో చూపిస్తాం


మేనిఫెస్టో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్రంలో ఇప్పటివరకు పాలక ప్రభుత్వాలు మాటల్లో అభివృద్ధి చూపించారే కానీ ఆచరణలో పూర్తిగా వైఫల్యం చెందారని, తమ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధి ఏంటో చేతల్లో చూపిస్తామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ మెనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి సమస్య తమకు తెలుసనని 40 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉంటున్నానని తనను గెలిపిస్తే ప్రజలు కోరుకున్న అభివృద్ధిని చేసి చూపిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, టీయూసీసీ జిల్లా అధ్యక్షుడు కురువెల్లి శంకర్, పులిమాటి సంతోష్ కుమార్, బెక్కంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీలో చేరిక

చొప్పదండి నియోజక వర్గానికి చెందిన బీఎస్పీ నాయకులు గురువారం ఏఐఎఫ్‌బీ జిల్లా కార్యాలయంలో అంబటి జోజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ముత్యాల విజయ్‌కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహాలు సిద్ధం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రూపుదిద్దుకుంటున్న ప్రతిమలు
- నగరంలో పలు చోట్ల అమ్మకాలు

కరీంనగర్‌కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలు రూపుదిట్టుకుంటున్నాయి. దసరా సందర్భంగా అమ్మవారికి శరన్నవరాత్రులు పూజలు చేస్తారు. ఈనెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కరీంనగర్‌లోని పలు చోట్ల తయారు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. నగరంలోని జ్యోతినగర్‌లో గల శివథియేటర్, బొమ్మకల్ బైపాస్ రోడ్డు, రేకుర్తి, అల్గునూర్ చౌరస్తా వద్ద దుర్గాదేవి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు.

6 అడుగుల నుంచి 12 ఫీట్ల వరకు..

ఆరు అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తున్న దుర్గాదేవి విగ్రహాలను రాజస్తాన్‌కు చెందిన కళాకారులు తయారు చేశారు. వారి కళానైపుణ్యంతో వివిధ రూపాల్లో తయారు చేసిన విగ్రహాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఆరు అడుగుల విగ్రహానికి రూ.15వేలు, ఏడు అడుగుల విగ్రహానికి రూ.16వేలు, 8 అడుగుల ప్రతిమకు రూ.18వేల నుంచి రూ.20వేలు, 12 అడుగుల పరతిమకు రూ.40వేల వరకు విక్రయిస్తున్నారు. వివిధ డిజైన్లను బట్టి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతున్నాయి. అయితే విగ్రహాల తయారీకి కావాల్సిన ముడి సరుకు రంగులు, కొబ్బరి పీచు, కళాకారుల వేతనాలు, విగ్రహాల తయారీకి తీసుకునే ఖాళీ స్థలాల అద్దెలు పెరగడంతో విగ్రహాల తయారీ ఖర్చు ఎక్కువగా ఉందని నిర్వాహకులు తెలుపుతున్నారు.

ఉపాధి దొరుకుతోంది



నేను రాజస్థాన్ నుంచి వచ్చాను. చిన్నప్పటి నుంచి విగ్రహాలు తయారీ చేస్తున్నా. ఇప్పటి వరకు చాలా విగ్రహాలు తయారు చేశా. వినాయక, దుర్గమాత విగ్రహాల తయారీతో మాకు ఉపాధి లభిస్తోంది.

– దినేశ్, రాజస్తాన్ కళాకారుడు

20 ఏళ్ల క్రితం కరీంనగర్‌కు వచ్చా



20 ఏళ్ల క్రితం రాజస్తాన్ నుంచి కరీంనగర్‌కు వచ్చాను. ఏటా నాలుగు నెలల ముందు నుంచి విగ్రహాలను సిద్ధం చేస్తాం. ఇప్పటివరకు చాలా విగ్రహాలు తయారు చేశాం. ఇంకా కొన్ని విగ్రహాలకు పెయింటింగ్ వేయాల్సి ఉంది.

– దుర్గేష్, కళాకారుడు

ముడిసరుకు వ్యయం పెరిగింది



విగ్రహాల తయారీకి ఉపయోగించే ముడిసరుకు వ్యయం పెరగడంతో విగ్రహాల తయారీ ఖర్చు ఎక్కువ అవుతోంది. ఈసారి వివిధ రకాల ఆకృతుల్లో దుర్గామాత విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నాం.

– సాయిచరణ్, అమ్మకందారుడు, జ్యోతినగర్, కరీంనగర్

బతుకమ్మ సంబురం

- తొమ్మిది రోజులు ఆట పాటలతో సందడి
- హాలీడేస్‌ను జాలీగా గడుపుతామంటున్న విద్యార్థినులు


తయారు చేసిన బతుకమ్మలతో విద్యార్థినులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఫస్ట్ టర్మ్ హాలీడేస్ అంటే ఎంతో సందడిగా.. సరదాగా.. జాయ్‌ఫుల్‌గా జరుపుకుంటామంటున్నారు చిన్నారి విద్యార్థినులు. మేమెంతో ఇష్టంగా జరుపుకునే పూల పండగ ఇంట్లో, చుట్టాల ఇళ్లలో, అమ్మమ్మ ఇళ్లలో ఉంటూ సంబురంగా జరుపుకుంటాం. శుక్రవారం నుంచి సెలవులు ఆరంభమయ్యాయి. తొమ్మిది రోజులు ఉదయం పూలను సేకరించడం లేకుంటే మార్కెట్‌కు వెళ్లి కొనుక్కోవడం.. మధ్యాహ్నం బతుకమ్మను తయారు చేయడం.. సాయంత్రం వీధిలో బతుకమ్మలను ఓచోట పెట్టి సందడి చేస్తామంటున్నారు. గతేడాది కంటే ఈసారి చాలా గ్రాండ్‌గా జరుపుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్నేహితులతో కలిసి స్కూల్‌లో ఆడుకున్నాం.. ఇక నుంచి వీధుల్లోని ఫ్రెండ్స్, పక్క ఇంటి వారితో కలిసి ఆడుకుంటామంటున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను పలకరించగా పలు విషయాలు వెల్లడించారు.

సందడిగా చేసుకుంటాం



రాష్ట్రంలో జరుపుకునే అతిపెద్ద పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులు సంబురంగా జరుపుకునే పండుగ. గతేడాది పాఠశాలలో ఘనంగా జరుపుకున్నాం. ఈయేడు కూడా బాగా జరుపుకున్నాం. ఇక తొమ్మిది రోజులు ఇంటి ఎదుట సందడిగా చేసుకుంటాం.

– బానోతి స్వాతి

ప్రకృతిని ఆరాధించే పండుగ



ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ బతుకమ్మ. ప్రతీ ఒక్క అమ్మాయి లక్ష్మీ దేవతలా తయారై బతుకమ్మలను కూడా అందంగా తయారు చేస్తారు. బతుకమ్మ ఎంత అందంగా ఉంటుందో మన జీవితాలు కూడా అంతే అందంగా ఉండాలని గౌరమ్మను మొక్కుకొని ఆనందంగా సాగనంపుతాం.

– సీహెచ్. సాత్విక

ఆనందంగా ఉంటుంది



బతుకమ్మ ఇంటి వద్ద కన్న స్కూల్‌లో ఆడితే చాలా ఆనందంగా ఉంటుంది. ఏటా స్కూల్‌లో సంప్రదాయ దుస్తులు ధరించి స్నేహితులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుకుంటూ కోలాటాలు ఆడుకుంటాం. మాతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆడుతారు.

– లక్ష్మీప్రసన్న

అమ్మమ్మ ఇంటి వద్ద జరుపుకునేవాళ్లం



పాఠశాలలో చేరకముందు మా అమ్మమ్మ ఇంటి వద్దనే బతుకమ్మ జరుపుకునేవాళ్లం. ఇప్పుడు స్కూల్‌లో గ్రాండ్‌గా జరుపుకుంటున్నాం. సెలవుల్లో ఇంటి వద్ద రోజు సాయంత్రం ఇక సందడే. నృత్యాలు చేస్తూ సరదాగా గడుపుతాం.

– అనన్య, అలేఖ్య

బతుకమ్మ అంటే ఇష్టం



అందమైన పూలతో జరుపుకునే బతుకమ్మ పండుగ అంటే నాకు బాగా ఇష్టం. పండుగను నేను మా చెల్లి, అమ్మతో ఆనందంగా జరుపుకుంటా. గురువారం పాఠశాలలో ముందస్తు బతుకమ్మను స్నేహితులతో జరుపుకోవడం ఆనందంగా అనిపించింది.

– అనన్య ప్రభాస

గడపగడపకూ కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ

కరీంనగర్‌టౌన్: నగరంలోని 17వ డివిజన్‌లో గురువారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకు గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ గడపకు గ్యారంటీ కార్డు చేరడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్ ధరలతో పేద కుటుంబాలపై అధిక భారం పడుతుందని, కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో ఈ భారం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోనాల శ్రీనివాస్, ఎస్‌ఏ మోసిన్, డివిజన్ బాధ్యులు ఊరడి లత, చర్ల పద్మ, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, ముల్కల కవిత, మెతుకు కాంతయ్య, పొరండ్ల రమేశ్, కుర్ర పోచయ్య, ముక్క భాస్కర్, చంద్రయ్య గౌడ్, ఉప్పరి అజయ్, మహమ్మద్ బారీ, బషీర్, భవాని, జ్యోతిరెడ్డి, స్వరూప, ఇమ్రాన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ


నివాళి అర్పిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భజరంగ్‌దళ్ కార్యకర్త దొంతుల రమేశ్ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రమేశ్ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, భజరంగ్‌దళ్ నాయకులు కన్నం రమేశ్, దీపక్‌తేజ, సునీల్, సంతోష్, శేఖర్, నందకుమార్, మణికంఠ, రాజు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముందయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

క్లుప్తంగా...

ఏపీలో టెక్ మహీంద్రా స్టార్ హోటల్స్

- విశాఖ సహా 3 ప్రాంతాల్లో ఏర్పాటు
- ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మాణం
- సీఎం జగన్‌ను కలిసిన టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నాని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం సహా మూడు ప్రాంతాల్లో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మించేందుకు మహీంద్రా హాలిడేస్ చైర్మన్, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టార్ హోటల్స్ ఏర్పాటు గురించి సీఎం జగన్‌కు ఆయన వివరించారు. ఒక్కో హోటల్ నిర్మాణానికి రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగం అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాల గురించి సీఎం జగన్ వివరించారు. విశాఖ సహా 3 పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టనున్నామని.. వచ్చే 2 నెలల్లో శంకుస్థాపన చేపడతామని మహీంద్రా ప్రతినిధులు వెల్లడించారు.

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను 17కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది.

ఇలాగైతే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. బదిలీకి తోడుగా శాసనసభ ఎన్నికల విధుల్లో వారి సేవలను వినియోగించరాదని ఈసీ ఆదేశించడం పట్ల మరికొందరు తీవ్రంగా నొచ్చుకున్నారు. ఈసీ విధించే ఇలాంటి ఆంక్షలు కెరీర్‌లో రిమార్కుగా ఉండిపోనుండడమే ఇందుకు కారణం.

బదిలీకి ఇతర కారణాలు సైతం..

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పర్యటనకు మూడు రోజుల ముందే వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను ఆ శాఖ పనితీరుకు ఎలా బాధ్యురాలిని ? అని బదలీకి గురైన టీకే శ్రీదేవి 'ఎక్స్'(పూర్వం ట్వీటర్) వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉంటూనే వాణిజ్య శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగడం పట్ల మాత్రమే ఈసీ అభ్యంతరం తెలిపినట్టు తెలిసింది. బదిలీ చేసిన 20 మంది అధికారుల్లో 18 మందిని శాసనసభ ఎన్నికల విధుల్లో ఉపయోగించరాదని ఈసీ ఆదేశించగా, ఆమెతో పాటు బదిలీకి గురైన ఆబ్కారీ శాఖ డైరెక్టర్ ముష్రఫ్ ఫారూఖీకి ఈ విషయంలో అలాంటి ఆంక్షలు విధించలేదు. ఎన్నికల నిర్వహణలో వాణిజ్య పన్నుల శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉండగా, ఆ శాఖ కమిషనర్‌గా పూర్తి స్థాయి అధికారిని నియమించాలని ఈసీ ఆదేశించినట్టు తెలిసింది. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి సీఎస్ శాంతికుమారిని తప్పించిన ఈసీ, ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఆ శాఖలకు సైతం పూర్తి స్థాయి అధికారులను కార్యదర్శులుగా నియమించాలని కోరింది.

ఈసీకి చేరిన కొత్త పేర్లు ..

ఎక్సైజ్, ఆబ్కారీ శాఖలకు కొత్త ముఖ్యకార్యదర్శులతో పాటు బదిలీకి గురైన ఇతర 20 మంది అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈసీ ఆదేశాల మేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లను ప్రతిపాదిస్తూ గురువారం సాయంత్రం 5గంటల్లోగా ఈసీకి నివేదిక సమర్పించింది. ఆయా అధికారుల వార్షిక



పనితీరు నివేదిక(ఏపీఏఆర్)లు, విజిలెన్స్ క్లియరెన్స్‌లను సైతం పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను పరిశీలించి ఆయా పోస్టుల్లో ఎవరిని నియమించాలో ఈసీ నిర్ణయం తీసుకోనుంది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ పోస్టుకు సీనియారిటీ ప్రకారం డీజీ జితేందర్, అదనపు డీజీలు కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సందీప్ సాండిల్య పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక మిగిలిన రెండు పోలీసు కమిషనరేట్లకు చెరో ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లతో పాటు బదిలీకి గురైన 10 జిల్లాల ఎస్పీల స్థానంలో 30 మంది ఐపీఎస్ అధికారులు, నాన్‌కేడర్ ఎస్పీల పేర్లను ప్రతిపాదించినట్టు సమాచారం. శని, ఆదివారాల్లో వరుస సెలవులు రావడంతో సోమవారంలోగా ఈసీ నుంచి నిర్ణయం వచ్చే అవకాశాలున్నాయి.

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

పీటీ వారంట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు.. చంద్రబాబు ప్రధాన కుట్రదారుగా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని వివరించారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరమే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలతో సంతృప్తి చెందిన న్యాయస్థానం చంద్రబాబుపై పీటీ వారంట్‌ను అనుమతిస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. ఆ సమయంలో చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై శుక్రవారం సుప్రీం కోర్టు విచారించనుందని చెప్పారు. అందుకే చంద్రబాబును సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించినట్టు న్యాయాధికారి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలలోపు చంద్రబాబును విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ణయానికి లోబడే తమ తీర్పు ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక పీపీపై దాడికి యత్నించిన టీడీపీ న్యాయవాదులు

ఫైబర్‌నెట్ కుంభకోణంలో చంద్రబాబుపై పీటీ వారంట్‌కు అనుమతించడంతో చంద్రబాబు న్యాయవాదులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. దాంతో వారు దాఖలు చేసిన కాల్ రికార్డ్స్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదిగా ఉన్న ప్రత్యేక పీపీ వివేకానందపై ఒకదశలో దాడికి తెగబడటం న్యాయస్థానాన్ని విస్మయానికి గురిచేసింది. ఒకనొక దశలో తీవ్ర వాగ్వాదంతో న్యాయస్థానం దద్దరిల్లింది. టీడీపీ న్యాయవాదుల వైఖరితో న్యాయాధికారి నిశ్చేష్టురాలయ్యారు. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విచారిస్తున్న, చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్ రికార్డులను భద్రపరిచేలా ఆదేశించాలని కోరుతూ టీడీపీ న్యాయవాదులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ తరఫున ప్రత్యేక పీపీ వివేకానంద వాదనలు వినిపించారు. సీఐడీ అధికారులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఆ విధి నిర్వహణలో భాగంగానే కేసు దర్యాప్తు చేయడంతోపాటు పూర్తి ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఆయన అరెస్ట్ సక్రమమని గుర్తించే న్యాయస్థానం రిమాండ్ విధించిందని గుర్తుచేశారు. కానీ కేవలం రాజకీయ దురుద్దేశంతో సీఐడీ అధికారుల కాల్ రికార్డులు భద్రపరచాలని టీడీపీ కోరుతోందన్నారు. అలా చేయడం సీఐడీ అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని న్యాయస్థానానికి నివేదించారు. గతంలో కొన్ని న్యాయస్థానాలు ఇచ్చిన ఇటువంటి ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వివేకానంద వాదనలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. పిటిషన్ వేసి ఇప్పటికే నెల రోజులైందని టీడీపీ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. అసలు పిటిషన్‌కే అర్హత లేదని ప్రత్యేక పీపీ వివేకానంద బదులిచ్చారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ న్యాయవాది లక్ష్మీనారాయణ ఒక్కసారిగా ప్రత్యేక పీపీ వివేకానందపైకి దూసుకెళ్లారు. సీఐడీ తరఫున లీగల్ సబ్మిషన్లు చెబుతున్న ఆయనపైకి దూసుకెళ్లి అత్యుత్సాహంతో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసినవారికి బెయిల్ ఇస్తారని ఈ కేసుతో సంబంధంలేని అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఈ కేసులో మీరు ఎందుకు ఇలా చేస్తున్నారని లక్ష్మీనారాయణను న్యాయాధికారి ఆగ్రహంగా ప్రశ్నించారు. లక్ష్మీనారాయణ తీరుపై వివేకానంద కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల న్యాయవాదుల వాగ్వాదంతో న్యాయస్థానం కాసేపు దద్దరిల్లింది. న్యాయస్థానంలో అతిగా ప్రవర్తిస్తున్న వారి పేర్లను నమోదు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నాగరాజు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్‌లో ఉన్నారా అని న్యాయాధికారి ప్రశ్నించారు. వారిద్దరూ ఆ జాబితాలో లేరని చంద్రబాబు న్యాయవాదులు సమాధానం చెప్పారు. అడ్వకేట్స్ ఆన్ రికార్డ్‌లో ఉన్నవాళ్లు తప్ప అందరూ బయటకు వెళ్లాలని ఆదేశించిన జడ్జి.. ఈ విధంగా ఉంటే తాను ఈ కేసు విచారించాలేనని పేర్కొంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ బెంచ్‌దిగి వెళ్లిపోయారు.

ఆకస్మిక బదిలీలపై ఈసీ ఆరా!

- జిల్లాల వారీగా వివరాలు సేకరిస్తున్న ఈసీ బృందాలు
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా కొన్ని
- ప్రధానంగా డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయిల్లోనే ఇలా

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం మార్గదర్శకాల పేరిట రాష్ట్రంలో చోటు చేసు కున్న ఆకస్మిక బదిలీలపై సీఈసీ ఆరా తీస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా పోలీసు విభాగంలో బుధవారం జరిగిన బదిలీలను నిశితంగా పరిశీలి స్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెల నుంచే కేంద్ర ఎన్ని కల సంఘం చర్యలకు ఉపక్రమించింది. కీలకమైన పోలీసు, రెవెన్యూ విభాగాల్లో బదిలీలపై దృష్టి పెట్టింది. దీనికోసం జూన్ 2న మెమో నెం.437/ 6/1/ ఐఎన్ఎస్‌టీ/ ఈసీఐ/ ఎఫ్‌యూఎన్‌సీటీ/ ఎంసీసీ/2023) జారీ చేసింది. ఇందులో ఆయా బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. క్షేత్రస్థాయి లో విధులు నిర్వర్తించే పోకల్ విభాగం అధికారి ఒకే పోస్టులో, ఒకే రెవెన్యూ జిల్లా లో మూడేళ్ళ పాటు పని చేస్తే బదిలీ చేయాలని స్పష్టం చేసింది. అలాగే సొంత రెవెన్యూ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న, గత ఎన్ని కల సమయంలో వివాదా స్పదమైన, కేసులు నమోదైన అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను జూలై 31 నాటికే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

జిల్లాల వారీగా పరిశీలన

గత జూలై నుంచి పట్టించుకోకుండా యుద్ధప్రాతిపదికన ఇప్పుడు అర్థాంతరంగా జరిగిన బదిలీలను ఈసీ పరిశీలిస్తోంది. అస్మదీయ అధికారులను కోరిన చోటకు బదిలీ చేయించుకున్నారన్న వాదనలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలు, పైరవీలకే పెద్ద పీట వేశారన్న విమర్శలూ లేకపోలేదు. వీట న్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం స్థానిక పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ప్రత్యేక బృందాలతో జిల్లాల వారీగా అధ్యయనం చేయిస్తోంది.

అక్కడ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు

ఇక వివిధ జిల్లాల్లో, ఈసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా, స్థానిక నేతలు, సానుకూలత కారణాలతో జరిగిన బదిలీలు వివాదాస్పదంగానూ మారాయి. ప్రధానంగా మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, స్టేషన్ ఘన్‌పూర్, గోషామహల్, ఇబ్రహీంపట్నం, సంగారెడ్డి, కోదాడ, నిర్మల్, గద్వాల్, చేవెళ్ళల్లోని అనేక డీఎస్పీ/ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల ట్రాన్స్‌ఫర్లు ఈసీ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ పని చేసిన అధికారులు, బదిలీలకు కారణాలు, ప్రస్తుతం పని చేస్తున్న వారి నేపథ్యం తదితరాలను ఎన్నికల సంఘం లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. వీటిపై ఓ స్పష్టత వచ్చిన తర్వాత త్వరలోనే అనేక కీలక పోస్టుల్లో మార్పులు చేర్పులు ఉంటాయని అంటున్నారు.

అంచనాలు సిద్ధం చేసి ఈసీకి పంపండి..

సాక్షి, హైదరాబాద్: రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, నీటి పరిశుభ్రత.. తదితర అంశాలకు సంబంధించి అంచనాలు రూపొందించి ఎన్నికల కమిషన్‌కు పంపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ పనుల పురోగతిపై తదుపరి విచారణ రోజున స్థాయీ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని. 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించగా, రోనాల్డ్ రోస్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిమితుల నిర్ధారణకు సంబంధించి అక్టోబర్ 11 నాటి ప్రిలిమినరీ నోటిఫికేషన్ కాపీని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి సమర్పించారు. 30 రోజుల్లోగా తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా ఈసీ నుంచి అనుమతి తీసుకుని పని ప్రారంభిస్తామని, రెండు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ధర్మాసనం విచారణను డిసెంబర్ 28కి వాయిదా వేసింది.

బాబు ముఖం చూస్తే స్కామ్‌లు గుర్తొస్తాయి

- ఆయన ఎప్పుడైనా వరుసగా ఒక నెల రోజులు రాష్ట్రంలో ఉన్నాడా?: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- 35 ఏళ్లు కుప్పం ఎమ్మెల్యేగా ఉంటూ పేదవాడికి ఒక్క ఇల్లూ కట్టలేదు
- బాబు దత్తపుత్రుడి ఇల్లు హైదరాబాద్‌లో ఉంటుంది
- ఆ ఇంటిలో ఇల్లాలు మాత్రం ప్రతి 3, 4ఏళ్లకు మారిపోతోంది
- ఒకసారి లోకల్, మరోసారి నేషనల్, తరువాత ఇంటర్నేషనల్.. ఈసారి ఎక్కడికి?..

మరిన్ని వివరాలు, ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఓటరు ప్రదర్శన కేంద్రం

ఓటింగ్ శాతం పెంచేలా..

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ నమోదు లక్ష్యంగా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈవీఎంల ప్రత్యక్ష వినియోగం, సెల్ఫీ పాయింట్, ప్రచార రథాల ద్వారా ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



అవగాహన ఫ్లెక్సీ



ప్రచార రథం



సెల్ఫీ పాయింట్

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో ముఖాముఖి



ముఖాముఖిలో పాల్గొన్న విద్యార్థులు

భైంసా(ముధోల్): బాసర ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న 25 మంది విద్యార్థులు గురువారం నిజామాబాద్‌లోని ఐటీటవర్స్‌లో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ సలహాదారులు డాక్టర్ వెంకట్‌మట్టెల, శ్రీధర్‌తో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని విజయవంతమైన వ్యాపార వ్యవస్థాపకులుగా ఎలా ఎదగాలి, వ్యాపారాలు విజయవంతంగా నిర్వహించుకునే లక్షణాలు ఎలా అలవర్చుకోవాలనే విషయాలను వివరించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్మన్ సుధామూర్తి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసెల్ కన్వీనర్ రాకేశ్‌రెడ్డితో పాటు ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్- 19 కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది ఎంపికయ్యారు. వీరు ఈ నెల 17న రంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీఐఈవో నైతం శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాబురావు, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, వ్యాయమ ఉపాధ్యాయులు తిరుపతి, ధర్మారావు, సుదీప్, యాదగిరి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జీల నియామకం

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించినట్లు గురువారం రాత్రి ప్రకటించింది. బెల్లంపల్లి(ఎస్సీ) నియోజకవర్గానికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, మంచిర్యాలకు ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, ఖానాపూర్(ఎస్టీ)కు ఎమ్మెల్సీ దండె విఠల్, బోథ్(ఎస్టీ)కు మాజీ ఎంపీ నగేష్, ముధోల్‌కు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్‌లను పార్టీ నియమించింది.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ సర్పంచ్‌లు?

దండేపల్లి: ఎన్నికలు సమీపించిన తరుణంలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పలువురు బీఆర్ఎస్ అసంతృప్తులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతోపాటు ఓ ఎంపీటీసీ, మాజీ ప్రజాప్రతినిధులు కారు దిగి హస్తం గూటికి చేరనున్నట్లు తెలిసింది. వీరంతా మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైనట్లు తెలిసింది. ఇప్పటికే ఎంపీపీ శ్రీనివాస్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, ముగ్గురు ఎంపీటీసీలు బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు తీరుతో తీవ్ర అసంతృప్తితో ఉన్న పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీని వీడనున్నట్లు సమాచారం.

ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలపై సమీక్ష

- దేశవ్యాప్తంగా 15 సంస్థల ప్రతినిధుల హాజరు
- ఎన్నికల నేపథ్యంలో నిర్వహణ తేదీలపై సమాలోచన



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలకు సింగరేణి సంస్థ మరోమారు ఆతిథ్యం ఇవ్వబోతోంది. పోటీల నిర్వహణపై సింగరేణి దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు సంస్థల ప్రతినిధులతో గురువారం సమావేశమైంది. వచ్చేనెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు ఆలిండియా రెస్క్యూ పోటీలు ఆర్జీ–2 ఏరియాలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎస్‌సీవోఏ క్లబ్‌లో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్‌సింగ్ అధ్యక్షతన సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణపై సమీక్షించారు. అయితే నిర్ణీత గడువు ప్రకారం రాష్ట్రంలో నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీలు ఏ తేదీన నిర్వహించాలనే అంశంపై చర్చించారు. 18 సంస్థలకు చెందిన 28 జట్లు ఈపోటీల్లో పాల్గొననుండగా, ఆయా సంస్థలకు చెందిన 15మంది ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. పలువురు సూచనలు, సలహాల మేరకు పోటీల తేదీ ఖరారుపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సమావేశంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ సేఫ్టీ జీఎం అబ్దుల్‌సలీం, వీకేపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజహితాన్ని కోరేదే సాహిత్యం

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్



పుస్తకం ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ గౌడ్, కవులు

కరీంనగర్‌కల్చరల్: వృత్తిపరంగా ఆటో డ్రైవర్ అయిన మహ్మద్ ఖాలీద్ ప్రవత్తిగా రచనా వ్యాసాలను ఎంచుకోవడం అభినందనీయమని, సాహిత్యం సమజహితాన్ని కోరుతుందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆర్వీన్ ట్రీ పాఠశాలలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కవి మహ్మద్ ఖాలీద్ రచించిన ×మనమంతా ఒక్కట్టే కవితా సంపుటిని ఆవిష్కరించారు. సామాజిక చింతన, జాతీయతాభావం కవి ఖాలీద్ రచించిన కవితలలో వ్యక్తమవుతున్నాయని, ఈ కవితా సంపుటిలో సామాజిక బాధ్యతను గుర్తు చేసే కవితలతో పాటు సమకాలీన అంశాలు స్పృశించే కవితలు ఉన్నాయన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ మాట్లాడుతూ సమసమాజస్థాపనలో కవిత్వానిదే కీలక పాత్ర అన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్, కవులు విలాసాగరం రవీందర్, తడిగొప్పుల కుమారస్వామి, అన్నాడి గజేందర్ రెడ్డి, ప్రేంసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో ఇద్దరికి బెయిల్

మంథని: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం మారుతినగర్ సమీపంలో 2021 ఫిబ్రవరి 17న జరిగిన న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు–నాగమణి హత్య కేసులో ఏ–1 కుంట శ్రీనివాస్, ఏ–2 చిరంజీవికి గురువారం పెద్దపల్లి జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులకు గాను ఏ–3 అక్కపాక కుమార్, ఏ–5 ఊదరి లక్ష్మణ్ అలియాస్ లచ్చన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏ–4 నిందితుడిగా ఉన్న బిట్టు శ్రీను ఉరఫ్ తుల్సెగారి శ్రీనివాస్‌కు ఆగస్టులో జిల్లా కోర్టులో బెయిల్ లభించింది. ఈ కేసులో ఏ–6 వెల్ది వసంతరావు, ఏ–7 కాపు అనిల్ గతంలోనే బెయిల్‌పై బయటకు వచ్చారు. కాగా ఈ కేసును వచ్చే నెల 1వ తేదీకి వాయిదా వేశారు.

మళ్లీ సింగరేణి కూత

- నాలుగు నెలల తరువాత పట్టాలపైకి రైలు
- దసరా పండుగకు ప్రయాణికులకు తప్పిన తిప్పలు



ఓదెల స్టేషన్లో సింగరేణి రైలు

ఓదెల(పెద్దపల్లి): భద్రాచలం రోడ్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే సింగరేణి రైలు పునఃప్రారంభం కావడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి సింగరేణి రైలు రద్దు కావటంతో విద్యార్థులు, సింగరేణి కార్మికులు, ప్రయాణికులు నానా ఇబ్బందులుపడ్డారు. మంచిర్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేసే సింగరేణి కార్మికులకు ప్రత్యేకంగా సింగరేణి రైలు ఉపయోగంలో ఉంది. కార్మికుల ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో ఉండడంతో ఈ రైలు ప్రత్యేకత సంతరించుకుంది. ఎట్టకేలకు రైల్వే అధికారులు సింగరేణి రైలుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఓదెల, పొత్కపల్లి, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కోలాహలంగా మారాయి. తక్కువ రేట్లతో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న ఈ రైలును యథావిధిగా నడపటంతో పాలవ్యాపారులు సైతం ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మరో పదిరోజుల్లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకు వచ్చే ప్రయాణికులకు సింగరేణి రైలు గుడ్ న్యూస్‌గా మారింది. రద్దీకి అనుకూలంగా బోగీలు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలోని మహామండపంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ అధికారులు, స్థానికులు పాల్గొని దీపాలు వెలిగించారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం
13-10-2023

ఫ్యాషన్







దాండియా నృత్యానికి కళ తెచ్చే దుస్తుల జాబితాలో
ముందు వరసలో ఉండేది లెహెంగా చోలీ.
చనియా చోలీగా గిరిజన సంప్రదాయ కళ
ఓ వైపు అబ్బురపరుస్తుంది
మనవైన చేనేతల గొప్పతనం మరోవైపు కళ్లకు కడుతుంది.
అద్దకం కొత్తగా మెరిసిపోతుంటుంది.
ఎరుపు, పచ్చ, పసుపు...
రంగుల ప్రపంచంలో మునిగిపోయినట్టుగా ఉంటుంది.
లెహంగా అంచులు నృత్యంతో పోటీపడుతుంటే
ఆనందానికి ఆకాశమే హద్దు అవుతుంది.



నవరాత్రి ఉత్సాహం

రాజస్థానీ కళ

గిరిజన సంప్రదాయ కళ ఉట్టిపడే ఎంబ్రాయిడరీ చనియా చోలీలు ఇప్పుడు నగరాల్లో జరిగే దాండియా వేడుకలలో తెగ వెలిగిపోతున్నాయి. వాటిని ధరించిన అమ్మాయిలు ఆటపాటల కోలాటంలో తమని తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు.

మనవైన ఫ్లోరల్స్

నృత్యం ఎప్పుడూ ఆనందాన్ని రెట్టింపు చేస్తూనే ఉంటుంది. ఆ ఆనందంతో పోటీ పడే దుస్తుల్లో ఫ్లోరల్స్ కూడా తమ స్థానాన్ని గుర్తుచేస్తూనే ఉంటాయి. సంప్రదాయ కళతో పాటు కొద్దిగా ఆధునికత కూడా ఉట్టిపడాలనుకునేవారు ఫ్లోరల్ గాగ్రా చోలీలు ఎంచుకోవచ్చు.

బ్లాక్ ప్రింట్స్

కలంకారీ, గుజరాతీ బ్లాక్ ప్రింట్స్ గాగ్రా చోలీలు దాండియాలో తమ వైభవాన్ని చాటడానికి పోటీపడుతుంటాయి. టాప్ టు బాటమ్ ఒకే కలర్, ప్రింట్స్‌తో ఉండే ఈ డ్రెస్సులు గ్రాండ్‌గా కనిపిస్తుంటాయి.



న్యూస్ మేకర్

రాధమ్మ విజయం



రాధ వెంబు విజయాన్ని చూసిన తరువాత 'ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అనే సుపరిచిత మాటకు అదనంగా మరో మాట చేర్చవచ్చు అనిపిస్తుంది.

'ప్రతి పరిశ్రమ విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది'

సాధారణ ఉద్యోగిగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ 'జోహో కార్పోరేషన్'లోకి అడుగు పెట్టిన రాధ వెంబు క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి గెలుపు పాఠాలు తయారు చేసుకుంది. ప్రతిభావంతులైన సిబ్బందికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చి బలమైన సైన్యాన్ని తయారు చేసింది.

మీడియాలో, సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపించని రాధ వెంబు 'ఇన్‌విజిబుల్ ఫోర్స్'గా పేరు తెచ్చుకుంది. తాజాగా '360 వన్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2023'లో చోటు సంపాదించి, బ్యూటీ అండ్ లైఫ్ స్టైల్ రిటైల్ కంపెనీ నైకా ఫౌండర్ ఫల్గుణి నాయర్‌ని దాటేసి మన దేశంలోని సంపన్న మహిళగా వార్తల్లో నిలిచింది....

'ఎన్నో విజయాలు సాధించిన రాధ వెంబు గురించి నేనెందుకు వినలేకపోయాను అనేది ఆశ్చర్యంగా అనిపిస్తుంది' అంటూ ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రాశాడు జోహో కార్పొరేషన్ కన్సల్టెంట్ ఇంగ్లాండ్‌కు చెందిన ఆడిసన్. ఈ కన్సల్టెంట్‌కు మాత్రమే కాదు దేశంలో చాలామందికి ఆమె విజయాల గురించి తప్ప వ్యక్తిగత వివరాల గురించి తెలియదు.

'సెల్ఫ్–మేడ్ ఉమన్' అనేది ఆమె పేరు ముందు కనిపించే విశేషణం.

'కామ్ అండ్ టాస్క్–ఓరియెంటెడ్' అని సన్నిహితులు రాధ గురించి చెబుతుంటారు.

చెన్నైలో పుట్టి పెరిగింది రాధ. తండ్రి మద్రాస్ హైకోర్టులో స్టెనోగ్రాఫర్. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(మద్రాస్)లో ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్‌లో పట్టా పుచ్చుకుంది రాధ. ఆమె సోదరుడు శ్రీధర్ వెంబు ఆమెకు స్నేహితుడు, గురువు. టెక్ ఇండస్ట్రీ గురించి గంటల కొద్దీ మాట్లాడుకునేవారు. మన కంపెనీలను విదేశీ కంపెనీలతో పోల్చుతూ విశ్లేషించుకునేవారు.

తన సోదరులతో కలిసి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ 'జోహో కార్పొరేషన్' మొదలు పెట్టింది రాధ వెంబు. అంతకుముందు ఉన్న శ్రీధర్ వెంబు కంపెనీ 'అడ్వెన్ నెట్' జోహో కార్పోరేషన్‌లో విలీనమైంది.

మొదట్లో ఒక సాధారణ ఉద్యోగిగా ఆ సంస్థలో చేరింది రాధ వెంబు.

క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయడానికి ఇది తనకెంతో ఉపయోగపడింది.

ఆ తరువాత జోహో మెయిల్ ప్రాడక్ట్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించింది. వేగంగా ఉన్నత హోదాలోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ చాలా సంవత్సరాల పాటు ప్రాడక్ట్ మేనేజర్‌గానే పనిచేసింది. పెద్ద పెద్ద సంస్థలతో పోటీ పడుతూ తమ కంపెనీని ముందు వరుసలో నిలిచేలా చేసింది.



'కంపెనీకి సంబంధించిన సాంకేతికతను శక్తిమంతం చేయడానికి, కస్టమర్‌లను ఆశ్చర్యానందాలకు గురిచేయడానికి సంబంధించి ఎప్పుడూ ఆలోచిస్తుంటాను' అంటుంది రాధ.

'పని చేసే ప్రదేశంలో పక్షపాతానికి చోటు లేదు. ఆడా మగా అనే తేడా లేదు. ప్రతిభ ఒక్కటే ప్రమాణం' అని నమ్మడమే కాదు ఆచరణలో నిరూపించింది రాధ.

జోహో వర్క్‌కల్చర్ బాగా పాపులర్ అయింది. ఒక స్థాయికి చేరిన తరువాత టెక్ కంపెనీల హెడ్‌క్వార్టర్స్ విదేశాల బాట పడితే 'జోహో' మాత్రం మన దేశంలోని చిన్న పట్టణాలను ఎంచుకుంది.

టెక్ రంగంలో పురుషాధిక్యతే ఎక్కువగా కనిపించే పరిస్థితులలో రాధా వెంబు ఎన్నో మూస ఆలోచనలను బద్దలు కొట్టింది. ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది.

'నువ్వు కనిపించడం కాదు నీ ప్రాడక్ట్ కనిపించాలి. నువ్వు మాట్లాడడం కాదు నీ ప్రాడక్ట్ మాట్లాడాలి' అనేది రాధ వెంబు నమ్మిన సిద్ధాంతం.

పబ్లిసిటీ లేకపోతే పని జరగదు అని నమ్మే ఈ కాలంలోనూ ఆమె నమ్మిన సిద్ధాంతం నిలిచి గెలిచింది.

తీరిక సమయాల్లో తోటపని చేసే రాధ వెంబుకు సామాజిక సేవాకార్యక్రమాలు అంటే ఇష్టం.

'సంపన్నురాలిగా మారాలని టెక్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టలేదు. నాకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని ఆచరణలోకి తీసుకువచ్చి ఆ ఫలితాలతో సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో వచ్చాను' అంటుంది రాధ వెంబు.

వేడుక సమయం

ఆరోగ్య తాండవం

నవరాత్రి సందర్భంగా దాండియా ఆడటం సంప్రదాయం. చేతిలో కోలాటం కర్రలతో ఆడటమే 'దాండియా'. కాని కర్రలు లేకుండా చేసే నృత్యం కూడా గుజరాత్‌తో పాటు ఉత్తర భారతంలో అంతే ప్రముఖమైనది. దాని పేరు 'గర్బ'. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు చేసే ఈ నృత్యం కేవలం పారవశ్య తాండవమే కాదు ఆరోగ్య తాండవం అని కూడా అంటున్నారు ఆరోగ్య నిపుణులు.



'గర్బ' అనే మాట 'గర్భ' నుంచి వచ్చింది. స్త్రీ శక్తికి చిహ్నం గర్భధారణం. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జీవశక్తికి ప్రాణం పోసే స్త్రీ శక్తిని సూచించేందుకు గుజరాత్ అంతా 'గర్బ' నృత్యం చేస్తారు. దాండియా అంత విస్తృతంగానే గర్బ కూడా ఆడతారు. అందులో కర్రలు ఉంటాయి. ఇందులో ఉండవు. కాని గర్బ నృత్యం శరీరానికి చాలా మేలు చేస్తుంది అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా 9 రోజుల పాటు స్త్రీలు ఈ నృత్యం చేయడం వల్ల వారి ఆరోగ్యం మెరుగవుతుంది అంటున్నారు.

కేలరీల ఖర్చు

గంటసేపు గర్బ డాన్స్ చేయడం వల్ల 300 నుంచి 500 కేలరీలు ఖర్చవుతాయి. అంతే కాదు, శరీరాంగాలకు ఇందులో గొప్ప వ్యాయామం లభిస్తుంది. ఈ నృత్య భంగిమల వల్ల భుజాలు, మెడ, వీపు, మోకాళ్లు బాగా కదిలి కండరాలన్నీ చైతన్యంలోకి వస్తాయి. సునీల్ బఫ్నా అనే ఆరోగ్య నిపుణుడి ప్రకారం గంట సేపు గర్బ చేస్తే మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గి ఒక ప్రశాంత స్థితి వస్తుంది. గర్బ చేసే సమయంలో శరీరం ఎండార్ఫిన్స్‌ను విడుదల చేయడమే ఇందుకు కారణం. అదీగాక ఇది బృందంతో చేసే నృత్యం కాబట్టి మనతో పాటు ఒక సమూహం ఉంది అనే భరోసా మనసుకు లభించి మంచి అనుభూతి కలుగుతుంది. అందుకే నవరాత్రుల సమయంలోనే కాదు సంవత్సరం పొడుగునా గర్బా డ్యాన్స్ చేయమని ఫిట్‌నెస్ నిపుణులు కూడా చెబుతున్నారు.

గుండెకు మంచిది

గర్బలో ఆధ్యాత్మికత ఉంది. నృత్యం ద్వారా చేసే ఆరాధన కనుక దీనిని చేయడం వల్ల శరీరానికి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. ఇందులో చప్పట్లతో, సంగీతానికి తగినట్టుగా లయ కలిగిన కదలికలు ఉంటాయి కనుక అవన్నీ గుండెకు, నృత్య సందర్భంగా ఉచ్ఛ్వాస నిశ్వాసల వేగం పెరుగుతుంది కనుక ఊపిరితిత్తులకు చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు.

కాబట్టి గర్బ ఆధ్యాత్మిక, ఆరోగ్య తాండవం.

అది వద్దు, ఇది వద్దు అని తెగ మారాం చేస్తుంటారు పిల్లలు. పెద్దలు కూడా తామేమీ తక్కువ కాదన్నట్టు.. రోజూ ఇదేనా.. అని వంకలు పెడుతూ సరిగా తినరు. వీళ్లు సైతం 'మరో రెండు వెయ్యండి' అని అడిగే రుచులతో ఈ వారం వంటిల్లు మీ ముందుకొచ్చింది.

వంటిల్లు

ఇంకోటి ఇవ్వమ్మా!

సగ్గుబియ్యం టిక్కీ



కావలసినవి: సగ్గుబియ్యం – కప్పు; వేయించిన పల్లీలు – కప్పు; బంగాళ దుంపలు – రెండు; అల్లం – రెండు అంగుళాల ముక్క; పచ్చిమిర్చి – రెండు; జీలకర్ర – టీస్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; నిమ్మకాయ – అరచెక్క; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని దోరగా వేయించి, చల్లారాక పొడిచేసి పెట్టుకోవాలి ● పల్లీలను బరకగా గ్రైండ్ చేసి సగ్గుబియ్యం పొడిలో కలపాలి ● బంగాళ దుంపలను తొక్కతీసి ముక్కలుగా తరగాలి. ● పచ్చిమిర్చి, అల్లం కూడా ముక్కలుగా తరగాలి. ● ఇప్పుడు బంగాళదుంప ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, కొత్తిమీర తరుగు వేసి గ్రైండ్ చేయాలి ● నలిగిన మిశ్రమాన్ని, సగ్గుబియ్యం పొడిలో వేసి, రుచికి సరిపడా ఉప్పు, నిమ్మచెక్కను పిండి రసం వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ● పదిహేను నిమిషాల తరువాత పిండిని టిక్కీల ఆకారంలో వత్తుకుని డీప్‌ఫ్రై చేస్తే సగ్గుబియ్యం టిక్కీలు రెడీ ● కొత్తిమీర చట్నీతో ఈ టిక్కీలు చాలా రుచిగా ఉంటాయి.

క్రిస్పీ రోల్స్



కావలసినవి: చపాతీలు – మూడు ; కొత్తిమీర తరుగు – అరకప్పు ; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; కారం – అరటీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; గరం మసాలా – రెండు టీస్పూన్లు ; పచ్చిమిర్చి – రెండు; ఉల్లిపాయ – ఒకటి; చాట్ మసాలా – ఒకటిన్నర టీస్పూన్లు; గోధుమ పిండి –అర కప్పు; బియ్యప్పిండి – స్పూను; కార్న్‌ఫ్లోర్ – మూడు టీ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా

తయారీ: ● చపాతీలను సన్నగా పొడవుగా తరిగి, రుచికి సరిపడా ఉప్పు, కారం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమంపై కొద్దిగా నీళ్లచల్లి మరోసారి కలపాలి ● ఇప్పుడు మెత్తగా మారిన చపాతీ మిశ్రమంలో కార్న్‌ఫ్లోర్, బియ్యప్పిండి కలిపి పక్కన పెట్టుకోవాలి. ● ఉల్లిపాయ, పచ్చిమిర్చిని సన్నని ముక్కలుగా తరగాలి. ● బంగాళదుంపలు తొక్కతీసి చిదుముకోవాలి. దీనిలో ధనియాల పొడి, గరం మసాలా; పచ్చిమిర్చి, ఉల్లి తరుగు, ఛాట్ మసాలా, రుచికి సరిపడా ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ● ఇప్పుడు చేతులకు కొద్దిగా నూనె రాసుకుని దుంప మిశ్రమాన్ని రోల్స్‌గా చుట్టుకోవాలి ●గోధుమపిండిలో రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా నీళ్లపోసి పేస్టులా కలపాలి ● ఇప్పుడు దుంపరోల్స్‌ను గోధుమపిండిలో ముంచి, తరువాత చపాతీ మిశ్రమాన్ని రోల్‌కు అద్దాలి ● ఇప్పుడు రోల్‌ను మరుగుతోన్న నూనెలో వేసి, గోల్డెన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీయాలి ● ఇలా రోల్స్ అన్నింటిని వేయిస్తే క్రిస్పీ రోల్స్ రెడీ.

కొబ్బరి ఖీమా బాల్స్



కావలసినవి: కొబ్బరి – ఒక చిప్ప; కారం – అర టీస్పూను; పసుపు – చిటికెడు; గరం మసాలా – అరటీస్పూను; ధనియాల పొడి – అర టీస్పూను; కొత్తిమీర తరుగు – మూడు టీస్పూన్లు శనగపిండి – రెండు టీస్పూన్లు; పచ్చిమిర్చి – రెండు స్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● పచ్చిమిర్చిని సన్నగా తరిగి పెట్టుకోవాలి ● కొబ్బరి చిప్పలోని కొబ్బరిని తురుముకోవాలి ● కొబ్బరి తురుముని గిన్నెలో వేసి.. కారం, పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● చివరిగా శనగపిండివేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఉండలుగా చుట్టుకోవాలి ● బాణలిలో నూనె వేసి వేడెక్కిన తరువాత ఉండలను వేసి వేయించాలి ● ఉండలు వేగిన తరువాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి మూడు నిమిషాలు వేయించితే కొబ్బరి ఖీమా బాల్స్ రెడీ ● ఉల్లిపాయ ముక్కలు, నిమ్మరసంతో సర్వ్‌చేసుకోవాలి.

రవ్వ వడలు



కావలసినవి: బియ్యప్పిండి – కప్పు; సూజీ రవ్వ – కప్పు; గోధుమ పిండి – కప్పు; ఉల్లిపాయలు – మూడు; పచ్చిమిర్చి – ఐదు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; నువ్వులు – టేబుల్ స్పూను; పీనట్ బటర్ – టేబుల్ స్పూను; అల్లం తురుము – టేబుల్ స్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● పచ్చిమిర్చి, ఉల్లిపాయలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, కొత్తిమీర తరుగు రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు బియ్యప్పిండి, గోధుమ పిండి, సూజీ రవ్వ, నువ్వులు, పీనట్ బటర్, అల్లం తురుము వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొద్దిగా నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలపాలి ● ముద్దను చిన్నచిన్న ఉండలుగా చేసి వడల్లా వత్తుకోవాలి ● ఈ వడలను బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రవ్వ చెక్కలు రెడీ ● వేడివేడి వడలు చట్నీతో సర్వ్ చేసుకోవాలి.

● సక్సెస్ స్టోరీ

యూట్యూబ్ ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు... ధృవ్ రాఠీ.
ఈ హరియాణా కుర్రాడు యూట్యూబర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు.
గాలివాటంగా విజయం సాధించలేదు. తనదైన సక్సెస్ ఫార్ములాను రూపొందించుకున్నాడు.
ఆడియో స్పేస్‌లోకి అడుగు పెట్టి పాడ్‌కాస్టర్‌గా కూడా సత్తా చాటాడు.
'డబ్బు కోసం కాదు ప్యాషన్‌తో పనిలోకి దిగండి. సామాజిక బాధ్యతను మరవకండి' అంటున్న ధృవ్ రాఠీ తాజాగా టైమ్ మ్యాగజైన్ 'నెక్ట్స్ జెనరేషన్ లీడర్స్ 2023' జాబితాలో చోటు సంపాదించాడు...



టైమ్ మెచ్చిన ధృవ్‌తార

ధృవ్ రాఠీ సొంత రాష్ట్రం హరియాణా. జర్మనీలోని కార్ల్స్‌రువ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజనీరింగ్, అదే ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీలో మాస్టర్స్ డిగ్రీ చేశాడు. ట్రావెల్ వీడియోలతో ప్రయాణం ప్రారంభించిన ధృవ్ ఆ తరువాత రాజకీయాలు, సామాజిక అంశాలపై దృష్టి సారించాడు.

'ఇన్‌సైడ్ ది వరల్డ్స్ స్మాలెస్ట్ కంట్రీ' 'గ్రౌండ్ రియాలిటీ ఆఫ్ ఢిల్లీ స్కూల్స్' 'క్లీనింగ్ నైన్ మిలియన్ కేజీ వర్త్ ఆఫ్ ట్రాష్'.... మొదలైన వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

ఏదో ఒక వీడియో చేయాలి, వదలాలి అని తొందర పడకుండా ఆచితూచి ఆలోచించి వీడియోలు చేసేవాడు ధృవ్.

'చేయకపోయిన పరవాలేదు. చేసింది మాత్రం బాగుండాలి' అని గట్టిగా నమ్ముతాడు.

ఒక అంశంపై వీడియో చేయాలనుకున్నప్పుడు 'కెమెరా ఉంది కదా. ఇది చాలు' అనుకోకుండా ఆ అంశంపై లోతుగా రిసెర్చ్ చేస్తాడు. జర్నల్స్, రిపోర్ట్స్ చదవడంతో పాటు ఎంతో మంది నిపుణులతో మాట్లాడతాడు. ఆ తరువాతే పనిలోకి దిగుతాడు.

'డబ్బులు బాగా గడించాలనే లక్ష్యంతో యూట్యూబర్‌గా మారవద్దు. యూట్యూబ్ అనేది జస్ట్ ఫర్ మనీ అనే భావనను మనసులో నుంచి తీసివేయాలి. ప్యాషన్ ఉన్నప్పుడే క్రియేటర్ కావాలి. ఒక క్రియేటర్ సక్సెస్ కావడానికి ఓపిక అనేది అతి ముఖ్యం. ఇక నేను తెలుసుకునేది ఏమీ లేదు అనుకోకుండా అనుభవాలు, పరిస్థితుల నుంచి ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకోవాలి. నేను నేర్చుకున్నది ఏమిటో నా గత వీడియోలు, ఇప్పటి వీడియోలకు మధ్య ఉన్న తేడాను గమనిస్తే తెలుస్తుంది. ఖరీదైన టెక్నికల్ టూల్స్ వాడినంత మాత్రాన పేరు రాదు అనేది గ్రహించాలి. వృథాగా డబ్బులు ఖర్చు చేయవద్దు. సింపుల్ కెమెరా ఫోన్, ఫ్రీ వీడియో ఎడిటర్‌తో మన ప్రయాణం మొదలు పెట్టవచ్చు. సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరవద్దు' అంటాడు ధృవ్.

'పాపులర్ యూట్యూబర్'గా పేరు వచ్చినప్పటికీ అక్కడే ఆగిపోకుండా ఆడియో స్పేస్‌లోకి అడుగు పెట్టాడు ధృవ్ రాఠీ. పాలిటిక్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సోషల్, ఎకనామిక్స్ టాపిక్‌లను కవర్ చేస్తూ పాడ్‌కాస్టర్‌గా కూడా తానేమిటో నిరూపించుకున్నాడు.

'పాడ్‌కాస్ట్‌లో అనుకూలతలు, ప్రతికూలతలు ఉన్నాయి. విజువల్‌గా ఆట్టుకునే అవకాశం లేదు. యానిమేషన్‌కు వీలులేదు. కేవలం మాట మాత్రమే ముఖ్యం అవుతుంది. శ్రోతలు తమ పనులు చేసుకుంటూ కూడా మన మాటలు ఆసక్తిగా వినేలా చేయాలి. పాడ్‌కాస్టింగ్‌లో నేను వీడియోలో ఎలా కనిపించాలి? అనేదాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆకట్టుకునేలా ఎలా మాట్లాడాలి? అనే దానిపైనే దృష్టి ఉంటుంది. నా ముఖాన్ని మాత్రమే కాదు గొంతు కూడా చాలామంది గుర్తుపట్టడం అనేది పాడ్‌కాస్టింగ్‌లో నాకు ప్లస్‌పాయింట్ అయింది. పాడ్‌కాస్టర్‌గా నాకు మంచి మార్కులు వేస్తూ శ్రోతలు నుంచి మెయిల్స్, మెసేజ్‌లు వస్తుంటాయి' అంటున్న ధృవ్ అభిరుచుల విషయానికి వస్తే...ప్రయాణాలు, ఫొటోగ్రఫీ, స్కూబా-డైవింగ్, పుస్తక పఠనం అంటే ఇష్టం. 'తక్కువలో ఎక్కువ' అనేది నమ్మే సూత్రం.

● అవును... ఇది నిజమే!

● జపాన్‌లో 'కేబీజీ84' అనే మ్యూజిక్ బ్యాండ్ ఉంది. ఇది యూత్ బ్యాండ్ కాదు. 40 మంది బామ్మలతో కూడిన ప్రత్యేక బ్యాండ్. వంద సంవత్సరాలకు దగ్గరవుతున్న బామ్మలు కూడా ఈ బ్యాండ్‌లో ఉన్నారు.



● చైనీయుడు చెన్ సీ ఏమాత్రం సమయం దొరికినా నాన్జింగ్ యాంగ్జీ నది వంతెన దగ్గర గడుపుతాడు. ఆహ్లాదం కోసం కాదు. ఆత్మహత్యకు ప్రయత్నించే వాళ్లను రక్షించడం కోసం. 'సూసైడ్ స్పాట్'గా చెప్పుకునే ఈ ప్రాంతంలో నాలుగు వందల మందిని ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడాడు.

● టెక్.. టాక్

షావోమి స్మార్ట్ బ్యాండ్ 8



- సైజ్: 1.62 అంగుళాలు
- వాటర్ రెసిస్టెంట్
- రిజల్యూషన్: 192X490 పిక్సెల్స్
- అలారమ్ సెట్టింగ్స్
- రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జెడ్
- మెటాలిక్ మిడ్‌ఫ్రేమ్
- 150 ఫిట్‌నెస్ మోడ్స్
- క్విక్ చార్జింగ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఏ9 ప్లస్



డిస్‌ప్లే	: 11.00 అంగుళాలు
ఓఎస్	: ఆండ్రాయిడ్ 13
ర్యామ్	: 8జీబి
స్టోరేజ్	: 64జీబి
రిజల్యూషన్	: 1920X1200 పిక్సెల్స్
బ్యాటరీ	: 5100 ఎంఏహెచ్
కలర్స్	: గ్రే, సిల్వర్, డార్క్ బ్లూ
బరువు	: 510 గ్రా.

లైకా సోఫోర్ట్ 2 ఇన్‌స్టంట్ కెమెరా అండ్ ప్రింటర్



- ఆర్‌జీబి కలర్ ఫిల్టర్
- బ్యాటరీ: 740 ఎంఏహెచ్
- ఫుల్ చార్జ్: 100 ఇన్‌స్టంట్ ప్రింట్స్
- ఇమేజ్ రిజల్యూషన్: 2560X1920 పిక్సెల్స్
- కలర్స్: బ్లాక్, రెడ్, వైట్
- బరువు: 320 గ్రా.

వాట్సాప్ సీక్రెట్ కోడ్ ఫీచర్



మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'సీక్రెట్ కోడ్' అనే కొత్త ఫీచర్(ఆండ్రాయిడ్)పై పనిచేస్తోంది. యూజర్ ప్రైవసీకి ఉపకరించే ఫీచర్ ఇది. ఈ ఫీచర్ ద్వారా యూజర్‌లు తమ చాట్స్ కోసం సీక్రెట్‌కోడ్‌ను జెనరేట్ చేసుకోవచ్చు. ఈ సీక్రెట్ కోడ్ 'హిడెన్ చాట్స్'కు పాస్‌వర్డ్‌లా ఉపయోగపడుతుంది. యూజర్‌లు తమ సీక్రెట్ కోడ్ కోసం ఒక పదం లేదా ఇమోజీని ఎంపిక చేసుకోవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్ ఫొటో కర్సల్‌కు మ్యూజిక్ ట్రాక్ ఇలా...



1 ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసి...స్క్రీన్ బాటమ్‌లో ఉన్న ప్లస్ ఐకాన్ ట్యాప్ చేయాలి.
2 మినిమమ్ రెండు ఇమేజ్‌లను సెలెక్ట్ చేసుకోవాలి. నెక్ట్స్-ట్యాప్
3 ఫైనల్ ఎడిటింగ్ పేజీలో... యాడ్ మ్యూజిక్-క్లిక్.
4 షేర్ చేయడానికి: మీరు కోరుకున్న ట్రాక్‌ను సెలెక్ట్ చేసుకున్న తరువాత, కాప్షన్, ట్యాగ్స్, పోస్ట్ వివరాలు పూర్తయిన తరువాత టాప్ రైట్ కార్నర్‌లోని 'షేర్'ను నొక్కాలి.

● గేమింగ్ : నేడే విడుదల

విలయ విధ్వంస కారుడు



యాక్షన్ రోల్-ప్లేయింగ్ వీడియో గేమ్ 'లార్డ్స్ ఆఫ్ ది ఫాలెన్' నేడు విడుదల అవుతుంది. 2014లో ఇదే పేరుతో వచ్చిన గేమ్‌కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. ప్లేయర్-వర్సస్-ప్లేయర్ మల్టీ ప్లేయర్ మోడ్ కూడా ఈ గేమ్‌లో ఉంది. గేమ్ ప్రారంభంలో ప్లేయర్స్ తమ సొంత అవతార్‌ను క్రియేట్, కస్టమైజ్ చేసుకోవచ్చు. ఇంటర్‌కనెక్టెడ్ వరల్డ్‌లో సాగే ఈ గేమ్‌లో గతంలో వచ్చిన గేమ్ కంటే ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి అని చెబుతున్నారు డెవలపర్‌లు. **ప్లాట్‌ఫామ్స్:** మైక్రోసాఫ్ట్ విండోస్/ప్లేస్టేషన్ 5/ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ **జానర్:** యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్.

● మ్యూజిక్ వరల్డ్

ప్రేమ మాధుర్య ధ్వని

డెబ్యూ పాప్ సింగిల్ 'థగ్ రంఝా'తో సంగీత ప్రియులు 'వాహ్వా' అనుకునేలా చేసింది ఆకాశ సింగ్. ఈ పాట ఒక నెలలోనే 27 మిలియన్‌ల వ్యూస్‌ను క్రాస్ చేసి ప్రపంచ వ్యాప్తంగా 'మోస్ట్ వాచ్‌డ్ ఇండియన్ వీడియో'గా పేరు తెచ్చుకుంది. బాలీవుడ్ సినిమా 'సనమ్ తేరి కసమ్'లోని 'ఖీచ్ మేరీ ఫొటో' పాటతో వాహ్వా వాహ్వా అనిపించేలా చేసింది. సింగర్, కంపోజర్, మ్యూజిక్ ప్రొడ్యూసర్ మీకా సింగ్‌తో తన కెరీర్ మొదలుపెట్టింది ఆకాశసింగ్. మ్యూజిక్ బ్యాండ్ లోని పదిమందిలో తానొక్కరే అమ్మాయి. 'ఇండియాస్ రా స్టార్' పోటీలో పాల్గొన్న ఆకాశ గాత్రం విన్న ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ హిమేష్ రేష్మియా 'శభాష్' అనడమే కాదు సింగర్‌గా బాలీవుడ్‌లో బ్రేక్ ఇచ్చాడు. తాజాగా....'మన్మాని' పాటతో ప్రశంసలు అందుకుంటుంది ఆకాశ. 'ఇది జస్ట్ మ్యూజిక్ పీస్ కాదు. అంతకంటే ఎక్కువ. దీనిలోని ప్రేమ భావాలతో శ్రోతలు కనెక్ట్ అవుతారు. ఇందులో నా సొంత అనుభవాలు ఉన్నాయి' అంటుంది ఆకాశ. ఆమె దృష్టిలో పాట అనేది ఇలా విని అలా మరిచిపోయేది కాదు. శ్రోతలు ఒకచోట స్థిరంగా కూర్చుంటూనే పాట రెక్కలతో విహారం చేయాలి. ఆ విహారం ఊహల్లోకి, ప్రేమ భావాల్లోకి, భవిష్యత్‌లోకి....ఎక్కడికైనా కావచ్చు. కొత్త ప్రదేశాల్లో గడపడం, కొత్త వ్యక్తులతో పరిచయం, సృజనాత్మక పనుల్లో భాగం కావడం ఆకాశ సింగ్‌కు ఇష్టమైన పని.



సినిమా

కన్నప్పలో శివ రాజ్‌కుమార్


● శివ రాజ్‌కుమార్

శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న తాజా మైథలాజికల్ ఫిల్మ్ 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌లాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లోకి కన్నడ యాక్టర్ శివ రాజ్‌కుమార్ పేరు చేరింది. ఓ కీలక పాత్రకు శివ రాజ్‌కుమార్‌ని తీసుకున్న విషయాన్ని గురువారం యూనిట్ తెలియజేసింది. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయి మాధవ్, తోట ప్రసాద్ వంటి వారు రచనా సహకారం చేశారు.

ఆన్ ది రోడ్


● సూర్య, రామదాసు, రామ్‌గోపాల్ వర్మ

రోడ్ ట్రిప్ ప్లాన్ చేసుకున్న ఓ జంటకు, వారి మార్గ మధ్యంలో ఎదురైన ఓ వ్యక్తి కారణంగా ఎలాంటి అవాంతరాలు ఎదురయ్యాయి? అనే ప్రధానాంశంతో రూపొందిన చిత్రం 'ఆన్ ది రోడ్'. రాఘవ్ తివారీ, స్వామి మెహ్రా జంటగా స్వీయ దర్శకత్వంలో సూర్య లక్కోజు నిర్మించిన చిత్రం ఇది. నిర్మాత ముత్యాల రామదాసు ఈ సినిమా విడుదలకు సహాయం చేస్తున్నారు. లడఖ్ ప్రాంతంలో తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''పూర్తిగా లడఖ్ ప్రాంతంలో తెరకెక్కించిన మొదటి భారతీయ చిత్రం 'ఆన్ ది రోడ్'. తెలుగు, హిందీ, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

రెగ్యులర్ కథలు చేయను - శివ కంఠమనేని



శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లికార్జున్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఫిల్మ్ 'మధురపూడి గ్రామం అనే నేను'. ముప్పా వెంకయ్య చౌదరి సారథ్యంలో జి.రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివ కంఠమనేని మాట్లాడుతూ- ''ఒంగోలు బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ డ్రామా ఈ చిత్రం. మొరటుగా ఉండే సూరి పాత్రలో కనిపిస్తాను. తన మిత్రుడు బాబ్జీ ఎమ్మెల్యే కావడం కోసం సూరి ఏం చేస్తాడు? ఈ క్రమంలో అతని ప్రేమకథ ఏ విధంగా ప్రభావితమైంది? అనే అంశాలు ఆసక్తికరంగా ఉంటాయి. కమర్షియల్ పంథాలోనే ఈ సినిమా కథనం సాగుతుంది. ప్రేమ అనేది శరీరానికి కాదు.. మనసులకు సంబంధించినదనే సందేశం అంతర్లీనంగా ఉంటుంది. నేను రెగ్యులర్ కథలు చేయను. నేను చేసిన 'అక్కడొకడుంటాడు'లో నా పోస్టర్స్ చూసి 'మధురపూడి..' సినిమా కథకు నన్ను ఎంపిక చేసుకున్నారు మల్లికార్జున్‌గారు. దాదాపు 150కిపైగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. నా తర్వాతి చిత్రాలు 'మణిశంకర్, రాఘవరెడ్డి' త్వరలో రిలీజ్ కానున్నాయి. మంచు లక్ష్మిగారి 'ఆదిపర్వం' చిత్రంలో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నాను'' అన్నారు.

ఫిదా అవుతారు


● కార్తీక్ రత్నం

''ఆనంద్ కొత్తవాడైనా అనుభవం ఉన్న డైరెక్టర్‌లా 'లింగొచ్చా' తీశారు. నిర్మాతలు కూడా ఈ సినిమాని అనుకున్న విధంగా తీసేలాగా సపోర్ట్ చేశారు. ఇప్పుడు రిలీజ్ చేసిన 'ఫిదా..' పాటలాగే సినిమాని చూసి ప్రేక్షకులు ఫిదా అవుతారు'' అని కార్తీక్ రత్నం అన్నారు. ఆనంద్ బడా దర్శకత్వంలో కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా నటించిన చిత్రం 'లింగొచ్చా'. జె. నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. బికాజ్ రాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఫిదా...' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో కార్తీక్ రత్నం బాగా చేశాడు'' అన్నారు ఆనంద్ బడా. ''మా సినిమాకి మంచి విజయం చేకూరాలి'' అని యాదగిరి రాజు అన్నారు. హీరో సోహైల్ అతిథిగా పాల్గొన్నారు.

కథ రెడీ..


● 'ఇండియన్ 2'లో కమల్‌హాసన్


● 'ఆయిరత్తిల్ ఒరువన్ 2' పోస్టర్


● 'ఖైదీ'లో కార్తీ


● 'తుప్పరివాలన్'లో విశాల్

ఒక కథ హిట్టయితే... ఆ కథని కంటిన్యూ చేస్తే బాగుంటుందని ఆ కథలోని హీరో, ఆ కథని తెరకెక్కించిన దర్శకుడు, తీసిన నిర్మాత, చూసే ప్రేక్షకులు అనుకోవడం సహజం. కానీ ఆ కథను కొనసాగించడానికి స్కోప్ ఉంటేనే ఇంకో కథ రెడీ అవుతుంది. అలా కొనసాగింపుకి ఆస్కారం ఉన్న కొన్ని కథలు రెడీ అయ్యాయి. ఇలా తమిళంలో పదికి పైగా రానున్న చిత్రాల రెండో భాగం విశేషాలు తెలుసుకుందాం.

సేనాపతి తిరిగొస్తున్నాడు


కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు' - 1996) బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. ఎప్పట్నుంచో ఈ సినిమాకు సీక్వెల్ తీయాలని ప్లాన్ చేస్తున్న శంకర్ 2017లో 'ఇండియన్ 2'ని ప్రకటించారు. షూటింగ్ సెట్‌లో జరిగిన ప్రమాదం, నిర్మాణపరంగా నెలకొన్న సమస్యలను అధిగమించుకుని, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. లైకా ప్రొడక్షన్స్‌తో కలిసి ఉదయ నిధి స్టాలిన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 1920 నేపథ్యంలో సాగే 'ఇండియన్ 2' వచ్చే ఏడాది విడుదల కానుంది.

మూడు సీక్వెల్స్‌లో ధనుష్

పుష్కరకాలం క్రితం విడుదలైన 'ఆయిరత్తిల్ ఒరువన్ ('యుగానికి ఒక్కడు' - 2010) సంచలన విజయం సాధించింది. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా, పార్తిబన్ లీడ్ రోల్స్ చేయగా, సెల్వ రాఘవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కాగా ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆయిరత్తిల్ ఒరువన్ 2'ను ప్రకటించి, హీరోగా తన తమ్ముడు ధనుష్ నటిస్తారని, 2024లో ఈ సినిమాను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నామని తెలిపారు సెల్వ రాఘవన్. ఇంకా ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం కాలేదు. అలాగే హీరో ధనుష్-దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన 'అసురన్', 'వడ చెన్నై' చిత్రాలకు వీరి కాంబినేషన్‌లోనే సీక్వెల్స్‌కి ప్లాన్ జరుగుతోందని సమాచారం.

రెండు సీక్వెల్స్‌లో కార్తీ

'ఖైదీ' (2019)గా కార్తీ సూపర్ హిట్టయ్యారు. లోకేశ్ కనగరాజ్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రానికి సీక్వెల్ తీయాలనుకుంటున్నారు. మరో వైపు పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన 'సర్దార్' కూడా హిట్ ఫిల్మ్. 'సర్దార్ 2' కూడా దాదాపు ఖరారైంది. కార్తీ ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే 'సర్దార్ 2' మొదలవుతుంది. ఈలోపు రజనీకాంత్ హీరోగా తెరకెక్కించనున్న చిత్రాన్ని పూర్తి చేసి, 'ఖైదీ 2' సీక్వెల్ కథ రెడీ చేస్తారట లోకేశ్. అలాగే భవిష్యత్‌లో 'జైలర్ 2', కమల్‌హాసన్‌తో 'విక్రమ్ 2', 'బీస్ట్ 2' చిత్రాలను తెరకెక్కించే ఆలోచన కూడా లోకేశ్ కనగరాజ్‌కి ఉందట.


● 'సార్పట్ట'లో ఆర్య

మళ్లీ డిటెక్టివ్.

విశాల్ కెరీర్‌లో ఉన్న ఓ డిఫరెంట్ హిట్ ఫిల్మ్ 'తుప్పరివాలన్' ('డిటెక్టివ్' - 2017). మిస్కిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో హిట్ సాధించింది. ఆ తర్వాత విశాల్, మిస్కిన్‌ల కాంబినేషన్ లోనే 'డిటెక్టివ్'కు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2'ను ప్రకటించారు. నిజానికి 'డిటెక్టివ్ 2' ఈపాటికే విడుదల కావాల్సింది. కానీ ఈ సీక్వెల్ స్క్రిప్ట్, బడ్జెట్ విషయాల్లో విశాల్‌కు, మిస్కిన్‌కు భేదాభిప్రాయాలు తలెత్తడంతో 'డిటెక్టివ్ 2' షూటింగ్ నిలిచిపోయింది. 'డిటెక్టివ్ 2'కు తానే దర్శకత్వం వహించి, నటిస్తానని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు విశాల్. ఈ సినిమా షూటింగ్ ప్రధానంగా విదేశాల్లో జరగనుంది.


● 'తని ఒరువన్'లో నయనతార, 'జయం' రవి

ఎనిమిదేళ్ల తర్వాత...


'జయం' రవి కెరీర్‌లో 'తని ఒరువన్' (ఈ సినిమా తెలుగు రీమేక్ 'ధృవ'లో రామ్‌చరణ్ హీరోగా నటించారు) బ్లాక్‌బస్టర్. 'జయం' రవి అన్నయ్య, దర్శకుడు మోహన్ రాజా ఈ సినిమాను తెరకెక్కించారు. 2015లో విడుదలైన ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించాలని ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నారు మోహన్ రాజా. ఫైనల్‌గా 'తని ఒరువన్' విడుదలై, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది ఆగస్టు 28న సీక్వెల్‌ను ప్రకటించారు. తొలి భాగంలో నటించిన 'జయం'రవి, నయనతారలే మలి భాగంలోనూ నటిస్తారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది.


● 'మాయవన్'లో సందీప్ కిషన్

మరో మాయవన్

ఐదేళ్ల క్రితం సందీప్ కిషన్ హీరోగా సీవీ కుమార్ దర్శకత్వంలో 'మాయవన్' అనే సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాకు మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు 'మాయవన్'కు సీక్వెల్‌గా 'మాయవన్ 2' తీస్తున్నారు మేకర్స్. సందీప్ కిషన్, సీవీ కుమార్ కాంబినేషన్‌లోనే ఈ చిత్రం రూపొందుతోంది.


● 'డబుల్ ఎక్స్'లో లారెన్స్


● చేతన్ శ్రీను


● '7/జి...'లో రవికృష్ణ

పరంపర కొనసాగుతోంది

టెడ్డీ, సార్పట్ట పరంపర.. ఆర్య కెరీర్‌లో ఈ రెండూ సూపర్‌హిట్ సినిమాలే. అయితే ఈ రెండు చిత్రాలూ డైరెక్ట్‌గా ఓటీటీలోనే విడుదల అయ్యాయి. అయితే ఈ రెండు సినిమాల సీక్వెల్స్‌ను మాత్రం వెండితెరపైనే చూపించనున్నారు. 'సార్పట్ట పరంపర'కు దర్శకత్వం వహించిన పా. రంజిత్‌తోనే ఇటీవల 'సార్పట్ట పరంపర 2'ను ప్రకటించారు ఆర్య. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది. ఇక దర్శకుడు శక్తి సౌందర్ రాజన్‌తోనే 'టెడ్డీ' సినిమా సీక్వెల్‌ను ఆర్య ప్లాన్ చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం.

బృందావన కాలనీ ప్రేమ

దాదాపు 20 ఏళ్ల క్రితం వచ్చిన '7/జి బృందావన కాలనీ' (2004) యూత్‌ని బాగా ఆకట్టుకున్న విషాద ప్రేమకథ. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం సూపర్ హిట్. కాగా, '7/జి బృందావన కాలనీ'కి సీక్వెల్ ప్లాన్ చేశారు సెల్వ రాఘవన్. తొలి భాగంలో హీరోగా నటించిన రవికృష్ణ మలి భాగంలోనూ నటిస్తారు. కథానాయిక పాత్ర కోసం ఇవానా, దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ పేర్లను పరిశీలిస్తున్నారట. తొలి భాగాన్ని నిర్మించిన ఏఎమ్ రత్నం సీక్వెల్‌ని కూడా నిర్మించనున్నారు.

జిగర్తాండ 2

కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 2014లో విడుదలైన సినిమాల్లో హిట్‌గా నిలిచినవాటిలో 'జిగర్తాండ' ఒకటి. సిద్ధార్థ్, బాబీ సింహా, లక్ష్మీ మీనన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జిగర్తాండ డబుల్ ఎక్స్' తెరకెక్కింది. రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా దీపావళి సందర్భంగా విడుదల కానుంది.

జెంటిల్‌మేన్ మారారు

దర్శకుడు శంకర్ తెరకెక్కించిన తొలి చిత్రం 'జెంటిల్‌మేన్' (1993). యాక్షన్ కింగ్ అర్జున్ హీరోగా నటించారు. ఈ చిత్ర నిర్మాత కేటీ కుంజుమోన్ ఇటీవల 'జెంటిల్ మేన్ 2'ని ప్రారంభించారు. అయితే ఈ సీక్వెల్‌కి దర్శకుడు, హీరో మారారు. ఏ. గోకుల్‌కృష్ణ దర్శకత్వంలో చేతన్ శ్రీను హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీత దర్శకుడు.

అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో అరుళ్ నిధి హీరోగా రూపొందిన 'డిమాంటీ కాలనీ'కి సీక్వెల్ వీరి కాంబినేషన్‌లోనే రానుంది. ఇంకా సీక్వెల్ లిస్ట్‌లో మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
13-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
65	17
66,408	19,794

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,543	▽	116
డోజోన్స్	33,512	▽	293
ఎఫ్‌టీఎస్ఈ 100	7,643	△	25
డాక్స్	15,425	▽	35
షాంఘై	3,108	△	29
నికాయ్	32,495	△	558

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో


ముంబై

బంగారం (24 క్యారట్)	58,144	△	284
బంగారం (22 క్యారట్)	57,911	△	283
వెండి (కిలో)	69,699	△	205

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.42	84.09
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.87	104.21
€	యూరో	ఎస్‌బీఐ	86.90	90.00
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.95	56.66
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.33	54.63
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.15	62.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.36

'ఫోర్బ్స్' కుబేరుల్లోనూ అంబానీకే పట్టం



- 92 బిలియన్ డాలర్ల సంపదతో అగ్రస్థానం
- 68 బిలియన్ డాలర్లతో రెండో ర్యాంకులో అదానీ

న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ దేశీ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. 2023 సంవత్సరానికి గాను భారత్‌లోని 100 మంది సంపన్నులతో ఫోర్బ్స్ రూపొందించిన జాబితాలో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆయన సంపద 92 బిలియన్ డాలర్లుగా ఉంది. మరోవైపు గతేడాది అంబానీని కూడా దాటేసిన అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ ఈసారి 68 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిల్చారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల దెబ్బతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు కుదేలవడంతో ఆయన సంపద 82 బిలియన్ డాలర్ల మేర కరిగిపోవడం ఇందుకు కారణం. ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ నాడార్ 29.3 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విడగొట్టి, లిస్టింగ్ చేయడంతో పాటు తన ముగ్గురు సంతానానికి రిలయన్స్ బోర్డులో చోటు కల్పించడం ద్వారా ముకేశ్ అంబానీ వారసత్వ ప్రణాళికను పటిష్టంగా అమలు చేసినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లకు భారత్ ఒక హాట్‌స్పాట్‌గా ఉంటోందని తెలిపింది. కుబేరుల సంపద మరింతగా పెరగడంతో, టాప్ 100 లిస్టులోకి చేరాలంటే కటాఫ్ మార్కు 2.3 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆసియా వెల్త్ ఎడిటర్ నాజ్‌నీన్ కర్మాలీ వివరించారు. భారత్‌లోని 100 మంది కుబేరుల మొత్తం సంపద ఈ ఏడాది 799 బిలియన్ డాలర్లుగా ఉంది.

వ్యక్తి	ర్యాంకు	సంపద (బి.డాలర్లలో)
ముకేశ్ అంబానీ	1	92
గౌతమ్ అదానీ	2	68
శివ నాడార్	3	29.3
సావిత్రి జిందాల్	4	24
రాధాకిషన్ దమానీ	5	23
సైరస్ పూనావాలా	6	20.7
హిందుజా కుటుంబం	7	20
దిలీప్ సంఘ్వి	8	19
కుమార బిర్లా	9	17.5
షాపూర్ మిస్త్రీ, కుటుంబం	10	16.9

తెలుగువారిలో

వ్యక్తి	ర్యాంకు	సంపద (బి.డాలర్లలో)
మురళి దివి	33	6.3
పి.పి. రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి	54	4.05
'డాక్టర్ రెడ్డీస్' కుటుంబం	75	3
ప్రతాప్ రెడ్డి	94	2.48
పీవీ రామ్‌ప్రసాద్‌రెడ్డి	98	2.35

ధరలు అదుపు.. పరిశ్రమల పరుగు!

- ఎకానమీకి సానుకూల గణాంకాలు
- సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5%
- మూడు నెలల కనిష్ట స్థాయి
- ఆగస్టులో పారిశ్రామిక వృద్ధి 10.3%
- 14 నెలల గరిష్టానికి హైజంప్



న్యూఢిల్లీ: భారత్ తాజా ఆర్థిక గణాంకాలు పూర్తి ఊరటనిచ్చాయి. అధికారికంగా విడుదలైన సమాచారం ప్రకారం, ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ పాలసీ సమీక్షా నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 5.02 శాతంగా నమోదయ్యింది. గడచిన మూడు నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ద్రవ్యోల్బణం నమోదుకావడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం మైనస్ 2 లేదా ప్లస్ 2తో 6 శాతం వద్ద ఉండాలి. అయితే తమ లక్ష్యం 4 శాతమేనని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఇటీవలి తన పాలసీ సమీక్ష సందర్భంగా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇక పారిశ్రామిక రంగ వృద్ధికి సంబంధించిన సూచీ (ఐఐపీ) ఆగస్టులో 10.3 శాతం వృద్ధిని చూసింది. గడచిన 14 నెలల్లో ఈ స్థాయి వృద్ధి రేటు ఎన్నడూ నమోదుకాలేదు. 2023-24లో సగటును 5.4 శాతం ద్రవ్యోల్బణం ఉంటుందన్నది ఆర్‌బీఐ అంచనా.

రిటైల్ ధరల తీరు చూస్తే...

- ఒక్క ఆహార ధరల విషయానికి వస్తే, రెండంకెల్లో (గత ఏడాది సెప్టెంబర్‌తో పోల్చి) ధరలు పెరిగిన వస్తువుల్లో తృణధాన్యాలు (10.95 శాతం), పప్పులు (16.38 శాతం), సుగంధ ద్రవ్యాలు (23.06 శాతం) ఉన్నాయి. మాంసం, చేపలు (4.11 శాతం), గుడ్లు (6.42 శాతం), పాలు, పాల ఉత్పత్తులు (6.89 శాతం), పండ్లు (7.30 శాతం), కూరగాయలు (3.39 శాతం), చక్కెర, సంబంధిత ఉత్పత్తులు (4.52 శాతం), నాన్-ఆల్కాహాలిక్ బేవరేజెస్ (3.54 శాతం), ప్రెపేర్డ్ మీల్స్, స్నాక్స్, స్వీట్స్ (4.96 శాతం), ఫుడ్ అండ్ బేవరేజెస్ (6.30 శాతం) ఉత్పత్తుల్లో పెరుగుదల రేటు ఒకంకెకు పరిమితమైంది. కాగా, ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ధరలు పెరక్కపోగా 14.04% తగ్గడం గమనార్హం.

రంగాల వారీగా పారిశ్రామిక ఉత్పత్తి పురోగతి

ఆగస్టు నెలల్లో తయారీ రంగం 9.3 శాతం పురోగతి (2022 ఆగస్టు నెలతో పోల్చి) సాధించింది. విద్యుత్ రంగం 15.3 శాతం, మైనింగ్ 12.3%, భారీ పెట్టుబడులకు, యంత్ర సామాగ్రి కొనుగోళ్లకు ప్రతిబింబంగా ఉండే క్యాపిటల్ గూడ్స్ విభాగంలో 12.6 శాతం వృద్ధి నమోదయ్యింది. అయితే రిఫ్రిజరేటర్లు, ఎయిర్‌కండీషర్లకు సంబంధించి కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగంలో మాత్రం వృద్ధి లేకపోగా 5.7 శాతం క్షీణత నెలకొంది. ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ నాన్-డ్యూరబుల్స్ రంగంలో మాత్రం వృద్ధి రేటు 9 శాతంగా ఉంది.

ఐటీ షేర్లు పడేశాయ్

సూచీల రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: స్టాక్ సూచీల రెండో రోజు ర్యాలీకి ఐటీ షేర్లు అడ్డుకట్ట వేశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్ సంస్థల క్యూ2 ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగా నమోదవడంతో ఈ రంగ షేర్లలో తలెత్తిన అమ్మకాలు సూచీలను లాభాల్లోంచి నష్టాల్లోకి నడిపించాయి.



దేశీయ, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఉదయం లాభాల్లో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో స్తబ్దుగా కదలాడాయి. ఇంట్రాడేలో 239 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 65 పాయింట్లు స్వల్ప నష్టంతో 66,408 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు నష్టపోయి 19,800 స్థాయి దిగువన 19,794 వద్ద నిలిచింది. క్యూ2లో టీసీఎస్ ఆదాయం 8% వృద్ధిని కనబరిచినా.. నిరాశజనక అవుట్‌లుక్ వ్యాఖ్యలతో షేరు 2% నష్టపోయి రూ.3542 వద్ద స్థిరపడింది. ఫలితాల విడుదలకు ముందు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 2% పతనమయ్యాయి. టెక్‌మహీంద్రా 3%, ఎల్‌టీఐఎం 2%, కోఫోర్జ్ 1%, విప్రో 1% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సూచీ 1.50% నష్టపోయింది.

ఇన్ఫోసిస్..ఫ్ట్!



- క్యూ2లో నికర లాభం రూ.6,215 కోట్లు, 3.1 శాతం వృద్ధి
- మొత్తం ఆదాయం 6.7 శాతం అప్; రూ.38,994 కోట్లు.
- ఆదాయ వృద్ధి అంచనాలకు కోత;
- రూ. 18 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. ఆదాయ అంచనాలకు భారీగా కోత విధించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో క్లయింట్లు తమ వ్యయాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటం దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (2023-24, క్యూ2)లో రూ. 6,215 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 6,026 కోట్ల లాభంతో పోలిస్తే 3.1 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం 6.7 శాతం వృద్ధితో రూ.36,538 కోట్ల నుంచి రూ. 38,994 కోట్లకు ఎగిసింది.

ఆదాయ గైడెన్స్ 1 శాతం కట్...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తి ఏడాది ఆదాయ వృద్ధి అంచనాలను ఇన్ఫీ 1 శాతం తగ్గించింది. ఆదాయం 1-3.5 శాతం మేర వృద్ధి చెందొచ్చని గతంలో అంచనా వేయగా, దీన్ని ఇప్పుడు 1-2.5 శాతానికి పరిమితం చేయడం గమనార్హం. బలహీన ఆర్థిక వాతావరణం నేపథ్యంలో దేశీ ఐటీ కంపెనీలకు రానున్న రోజుల్లో డిమాండ్ మరింత తగ్గొచ్చనేందుకు ఇన్ఫీ తాజా గైడెన్స్ కోత నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. దేశీ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా క్యూ2 ఫలితాల సందర్భంగా రాబోయే రోజుల్లో ఐటీ రంగం డిమాండ్‌పై ఆర్థిక అనిశ్చితి ప్రభావం ఉంటుందని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఉద్యోగులు తగ్గారు..

ఇన్ఫీలో ఉద్యోగుల సంఖ్యకు కూడా కోత పడింది. క్యూ2లో నికరంగా 7,530 మంది కంపెనీని వీడటంతో సెప్టెంబర్ చివరి నాటికి మొత్తం సిబ్బంది సంఖ్య 3,28,764కు చేరింది. గతేడాది తాము 50,000 మంది ఫ్రెషర్లను నియమించుకున్నామని, వారిని ఇంకా పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం లేదని ఇన్ఫీ సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్ చెప్పారు. ప్రస్తుతం ఫ్రెషర్లకు జెన్ ఏఐ వంటి టెక్నాలజీల్లో శిక్షణనిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి క్యాంపస్ నియామకాల గురించి ఆలోచించడం లేదని, భవిష్యత్తు అంచనాకు అనుగుణంగా ప్రతి క్వార్టర్లోనూ పరిస్థితులను బేరీజు వేసి నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. ఇప్పటికే ఆఫర్లు ఇచ్చినవారందరినీ తీసుకుంటామని, ప్రాజెక్టులు సాకారం అయ్యేకొద్దీ వారిని విధుల్లోకి తీసుకుంటామని కంపెనీ పేర్కొంది. నవంబర్ 1 నుండి సిబ్బంది వేతనాల పెంపు ఉంటుందని తెలిపింది.

> భారీ స్థాయి ప్రాజెక్టులు, విచక్షణతో కూడిన ప్రాజెక్టులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కొత్త కాంట్రాక్టుల విషయంలో సంస్థలు ఆచితూచి నిర్ణయం తీసుకోనున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా పూర్తి ఏడాది ఆదాయ గైడెన్స్ తగ్గించాల్సి వచ్చింది. అన్ని రంగాలు, భౌగోళిక ప్రాంతాల వ్యాప్తంగా 7.7 బిలియన్ డాలర్ల విలువైన భారీ స్థాయి మెగా డీల్స్‌ను సాధించాం. ఆర్థికంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఇది మా పనితీరుకు, క్లయింట్లు మాపై చూపుతున్న నమ్మకానికి నిదర్శనం.
> – సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ

ఇతర ముఖ్యాంశాలు...

- క్యూ2లో కంపెనీ 7.7 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది. కంపెనీ చరిత్రలోనే ఇవి అతిపెద్ద మెగా డీల్స్ కావడం సానుకూలాంశం.
- కంపెనీ నిర్వహణ మార్జిన్లు క్యూ2లో 0.4 శాతం వృద్ధి చెంది 21.2 శాతంగా నమోదయ్యాయి.
- రూ. 5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి అక్టోబర్ 25 రికార్డు తేదీగా, నవంబర్ 6 చెల్లింపు తేదీగా పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ.1,464 వద్ద ముగిసింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 3,833 కోట్లు • షేరుకి రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం పుంజుకుని రూ. 3,833 కోట్లను తాకింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 3,487 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతం వృద్ధితో రూ. 26,672 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 24,686 కోట్ల టర్నోవర్ నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. కొత్త కాంట్రాక్టులు 67 శాతం జంప్‌చేసి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 4 బిలియన్ డాలర్లను తాకినట్లు వెల్లడించారు.

ఇతర విశేషాలు...

- ఈ ఏడాది తొలి ఆరు నెలల పనితీరు నేపథ్యంలో పూర్తి ఏడాదికి ఆదాయ అంచనాలను 5-6 శాతానికి తగ్గించింది. తొలుత 6-8 శాతం వృద్ధి అంచనాలను ప్రకటించిన సంగతి తెలిసిందే.
- సెప్టెంబర్ చివరికి సిబ్బంది సంఖ్య 1% తగ్గి 2,21,139కు చేరింది.
- ఈ ఏడాది 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలివ్వనున్నట్లు కంపెనీ సీపీవో రామచంద్రన్ సుందరరాజన్ వెల్లడించారు. గతేడాది 27,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించినట్లు ప్రస్తావించారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 2 శాతం నష్టంతో రూ. 1,223 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

రష్యా ఒలింపిక్ కమిటీపై నిషేధం

ఒలింపిక్ నియమావళిని ఉల్లంఘించినందుకు రష్యా ఒలింపిక్ కమిటీపై అంతర్జాతీయ ఒలింపిక్ కౌన్సిల్ (ఐఓసీ) నిషేధం విధించింది. ముంబైలో గురువారం జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రష్యాపై నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని... తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుంది. అయితే ఈ నిర్ణయంవల్ల రష్యా క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ఐఓసీ తెలిపింది. అంతర్జాతీయ ఈవెంట్స్‌లో, వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రష్యా క్రీడాకారులు స్వతంత్ర క్రీడాకారులుగా పోటీపడవచ్చని ఐఓసీ వివరణ ఇచ్చింది.

మలేసియాతో భారత్ పోరు నేడు

మెర్డెకా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. కేవలం మూడు జట్లు నాకౌట్ పద్ధతిలో పాల్గొంటున్న ఈ టోర్నీలో నేడు కౌలాలంపూర్‌లో మలేసియా జట్టుతో భారత్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు 17న జరిగే ఫైనల్లో తజికిస్తాన్‌తో తలపడుతుంది.

సఫారీ దెబ్బకు 'కంగారు'



కమిన్స్



రబడ

ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు వరుసగా రెండో పరాజయం

- దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ 'షో'
- 134 పరుగుల తేడాతో మాజీ చాంపియన్‌పై ఘనవిజయం
- 'శత'క్కొట్టిన డికాక్
- పడగొట్టిన రబడ, జాన్సెన్, కేశవ్

లక్నో: మళ్లీ కంగారే! వన్డే వరల్డ్‌కప్‌లో 'ఫైవ్ స్టార్' చాంపియన్ ఆస్ట్రేలియా ఈ కప్‌లో ఓ కూనలా విలవిలలాడుతోంది. పసలేని బౌలింగ్, బాధ్యతలేని బ్యాటింగ్‌తో ఆస్ట్రేలియాకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. బవుమా సారథ్యంలోని దక్షిణాఫ్రికా జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 134 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను బోల్తా కొట్టించి ఈ మెగా టోర్నీలో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 311 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (106 బంతుల్లో 109; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) వరుసగా రెండో సెంచరీతో కదం తొక్కాడు. మార్క్‌రమ్ (44 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, మ్యాక్స్‌వెల్ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. లబుషేన్ (74 బంతుల్లో 46; 4 ఫోర్లు) టాప్‌స్కోరర్ కాగా, స్టార్క్ (27; 3 ఫోర్లు), కెప్టెన్ కమిన్స్ (22; 4 ఫోర్లు) 20 పరుగులు మించారంతే! రబడ (3/33) ఆసీస్‌ను చావుదెబ్బ తీయగా, జాన్సెన్, కేశవ్, షమ్సీ తలా 2 వికెట్లు పడగొట్టారు.

ఓపెనర్ జోరు...

దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ టాపార్డర్‌తో కలిసి పటిష్టమైన భాగస్వామ్యాలు నమోదు చేశాడు. జట్టు భారీ స్కోరుకు బాటవేశాడు. బవుమా (55 బంతుల్లో 35; 2 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 108 పరుగులు, డసెన్ (30 బంతుల్లో 26; 2 ఫోర్లు)తో రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించాడు. 90 బంతుల్లో సెంచరీ పూర్తయ్యాక డికాక్ జట్టు స్కోరు 197 పరుగుల వద్ద నిష్క్రమించాడు. అనంతరం మార్క్‌రమ్ అర్ధసెంచరీ సాధించడం, క్లాసెన్ (27 బంతుల్లో 29; 3 ఫోర్లు), జాన్సెన్ (22 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇలా క్రీజులో వచ్చిన వారంత స్కోరు పెరిగేందుకు దోహదం చేయడంతో సఫారీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 300 పైచిలుకు స్కోరు చేసింది. లంకపై తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఏకంగా 428 పరుగులు చేసిన సంగతి తెలిసిందే!



డికాక్ సెంచరీ అభివాదం

కంగారూ... కంగారూ...

జోరు మీదున్న ప్రత్యర్థి, కొండంత లక్ష్యం ముందరుంటే ... మిచెల్ మార్ష్ (7), వార్నర్ (13), స్మిత్ (19)...ఆస్ట్రేలియా టాపార్డర్ స్కోరిది! ఇదికాస్తా 10 ఓవర్లలోపే కంగారూ, బేజారు కలగలిసి ఆసీస్ పరాజయానికి బీజం పడేలా చేసింది. రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో అప్పటికే అనుభవజ్ఞుడైన స్మిత్‌ను అవుట్ చేసి తర్వాత జోష్ ఇంగ్లిస్ (5), స్టొయినిస్ (5)లను పట్టుమని పది పరుగులైనా చేయనివ్వలేదు. దీంతో ఆస్ట్రేలియా 70 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. లబుషేన్ నిలబడటంతో ఆస్ట్రేలియా ఆమాత్రం స్కోరు చేసింది. అంతేగానీ గెలిచేందుకు ఏ దశలో ఆడలేదు. భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ ఓడిన ఆస్ట్రేలియా తమ తదుపరి మ్యాచ్‌లో సోమవారం శ్రీలంకతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) మ్యాక్స్‌వెల్ 109; బవుమా (సి) వార్నర్ (బి) మ్యాక్స్‌వెల్ 35; డసెన్ (సి) సబ్-అబాట్ (బి) జంపా 26; మార్క్‌రమ్ (సి) హాజల్‌వుడ్ (బి) కమిన్స్ 56; క్లాసెన్ (సి) ఇంగ్లిస్ (బి) హాజల్‌వుడ్ 29; మిల్లర్ (బి) స్టార్క్ 17; జాన్సెన్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 26; రబడ (నాటౌట్) 0; కేశవ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (50 ఓవర్లలో 7 వికెట్లకు) 311. **వికెట్ల పతనం:** 1-108, 2-158, 3-197, 4-263, 5-267, 6-310, 7-311. **బౌలింగ్:** స్టార్క్ 9-1-53-2, హాజల్‌వుడ్ 9-0-60-1, మ్యాక్స్‌వెల్ 10-1-34-2, కమిన్స్ 9-0-71-1, జంపా 10-0-70-1, మార్ష్ 1-0-6-0, స్టొయినిస్ 2-0-11-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి) బవుమా (బి) జాన్సెన్ 7; వార్నర్ (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 13; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రబడ 19; లబుషేన్ (సి) బవుమా (బి) కేశవ్ 46; ఇంగ్లిస్ (బి) రబడ 5; మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) కేశవ్ 3; స్టొయినిస్ (సి) డికాక్ (బి) రబడ 5; స్టార్క్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 27; కమిన్స్ (సి) మిల్లర్ (బి) షమ్సీ 22; జంపా (నాటౌట్) 11; హాజల్‌వుడ్ (సి) రబడ (బి) షమ్సీ 2; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం** (40.5 ఓవర్లలో ఆలౌట్) 177. **వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-50, 4-56, 5-65, 6-70, 7-139, 8-143, 9-175, 10-177. **బౌలింగ్:** ఇన్‌గిడి 8-2-18-1, జాన్సెన్ 7-0-54-2, రబడ 8-1-33-3, కేశవ్ 10-0-30-2, షమ్సీ 7.5-0-38-2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
న్యూజిలాండ్	2	2	0	4	1.958
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	2	1	1	2	-0.653
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X బంగ్లాదేశ్

వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్వార్టర్ ఫైనల్లో సింధు



వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు మరో అలవోక విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 21-11, 21-10తో ప్రపంచ 22వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ)పై గెలుపొందింది. ఈ ఏడాది వెన్ చి సుపై సింధుకిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో వెన్ చి సుపై సింధు వరుస గేముల్లో నెగ్గింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 26వ ర్యాంకర్ థయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం)తో సింధు ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 1-0తో ఆధిక్యంలో ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఓడిపోయారు. శ్రీకాంత్ 15-21, 12-21తో కాంటా సునెయామ (జపాన్) చేతిలో... కిరణ్ జార్జి (భారత్) 10-21, 20-22తో లు గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు.

'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' నామినీల్లో నీరజ్ చోప్రా



మోంటికార్లో (మొనాకో): ఈ ఏడాది 'ప్రపంచ పురుషుల ఉత్తమ అథ్లెట్' పురస్కారం రేసులో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా నిలిచాడు. 2023 సంవత్సరానికిగాను 'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య 11 అథ్లెట్లను నామినీలుగా ప్రకటించింది. నీరజ్ చోప్రా ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలువడంతోపాటు ఆసియా క్రీడల్లో తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. మూడు పద్ధతుల్లో ఓటింగ్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఈ-మెయిల్ ద్వారా వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్, వరల్డ్ అథ్లెటిక్స్ ఫ్యామిలీ సభ్యులు... ఆన్‌లైన్ విధానంలో అభిమానులు ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. అక్టోబర్ 28వ తేదీతో ఓటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. నవంబర్ 13, 14 తేదీల్లో టాప్-5 ఫైనలిస్ట్‌లను... డిసెంబర్ 11న తుది విజేతలను ప్రకటిస్తారు.

క్వార్టర్స్‌లో రష్మిక

బ్యాంకాక్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-2, 7-5తో యానన్ హు (చైనా)పై నెగ్గింది. తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-0తో సౌమ్య (భారత్)పై గెలిచింది.

సెమీస్‌లో బోపన్న జోడీ



న్యూఢిల్లీ: షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చైనాలో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-2తో అరెవాలో (ఎల్‌సాల్వడార్)-జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటపై గెలిచింది. 61 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ పది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

హైదరాబాద్ టి20 జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ జాతీయ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పాల్గొనే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. భారత యువ క్రికెటర్ తిలక్ వర్మకు తొలిసారి హైదరాబాద్ జట్టు పగ్గాలు అప్పగించారు. ఈ టోర్నీ అక్టోబర్ 16 నుంచి దేశంలోని వివిధ నగరాల్లో జరుగుతుంది.

హైదరాబాద్ టి20 జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), సీవీ మిలింద్ (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, రాహుల్ బుద్ధి, రాహుల్ రాధేశ్, రోహిత్ రాయుడు, చందన్ సహని, భవేశ్ సేథ్, రవితేజ, రక్షణ్ రెడ్డి, సంకేత్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, శౌనక్ కులకర్ణి, అమన్ రావు.

క్లుప్తంగా...

14వ తేదీన పాస్‌పోర్టు ప్రత్యేక డ్రైవ్



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుదారులు అపాయింట్మెంట్ కోసం సుదీర్ఘకాలం వేచి ఉండకుండా ఈ నెల 14వ తేదీన పాస్‌పోర్టు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌకి, నిజామాబాద్, కరీంనగర్‌లోని పాస్‌పోర్టు సేవాకేంద్రాలు, భువనగిరి, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మేడ్చల్, నల్లగొండ, వరంగల్‌లోని పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ఈ తేదీ అపాయింట్మెంట్లు పాస్‌పోర్టు వెబ్ సైట్‌లో త్వరలో విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అడగటానికి మీరెవరు

మీడియాపై మంత్రి మల్లారెడ్డి అసహనం



మేడ్చల్/మేడ్చల్ రూరల్: పాత్రికేయులు వరుస ప్రశ్నలు సంధించడంతో వారిపై మంత్రి మల్లారెడ్డి మండిపడ్డారు. ఈ నెల 18న గుండ్లపోచంపల్లిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ జరగనుండటంతో గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వారిపై చిందులు తొక్కారు. తనను ప్రశ్నలు అడగాలంటే శిక్షణ తీసుకుని రావాలని, తనను ఏది పడితే అది ఎలా అడుగుతారని, నన్ను అడగటానికి మీరెవరు.. అని శివమెత్తిపోయారు. ప్రతీ ఎమ్మెల్యే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే విధంగా తమ నియోజకవర్గానికి ఏదో ఒక ప్రాజెక్ట్ తెచ్చారు కదా.. మరి మీరు ఏం తెచ్చారని ఓ విలేకరి అడగ్గా, 'ఏమి ప్రశ్నలు అడుగుతున్నావు. నీకు అసలు ఏమీ తెలుసు. రోడ్లు వేయించా, డ్రైయినేజీ పనులు చేయించా, ఎన్నో చేశాను'.. అంటూ అసహనం వ్యక్తం చేశారు. సీఎం సభ రోజున మేడ్చల్‌కు ఏమైనా వరాలు ఉంటాయా? అని మరో విలేకరి అడగ్గా, 'నేనెందుకు చెబుతాను, అన్ని సీఎం చెబుతారు' అంటూ సమాధానం దాట వేశారు. డిగ్రీ కళాశాల హామీ, ఇతర అంశాలపై విలేకరులు ప్రశ్నలు అడగ్గా, పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మీపై కోపంతో బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారు కదా? అంటే 'మా కారు ఫుల్‌గా ఉంది. వచ్చే వారు వస్తారు.. పోయే వారు పోతారు' అంటూ సమాధానం ఇచ్చారు.

నేడు గ్రాడ్యుయేషన్ డే




సాక్షి, హైదరాబాద్: ఎంవీఎస్ఆర్ కాలేజీలో శుక్రవారం (13న) గ్రాడ్యుయేషన్ దినోత్సవం జరుగుతుందని ఎంవీఎస్ఆర్ సంస్థ ప్రిన్సిపల్ ఎస్‌జీఎస్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డి.రవీందర్ హాజరవుతారని వెల్లడించారు.

అమెరికాలో అలా.. ఆసియాలో ఇలా?

జన్యు, వాతావరణ సంబంధిత వైవిధ్యతపై శాస్త్రవేత్తల దృష్టి

- అమెరికాలో ఊబకాయుల్లో టైప్ 2 మధుమేహం
- భారత్ లాంటి దేశాల్లో సన్నగా ఉన్నా సోకుతున్న వ్యాధి
- జన్యువుల పైభాగంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్లే ఈ తేడాలు
- ఈ పరిస్థితిని అధిగమించడం, వ్యాధి ముప్పును తగ్గించడం లక్ష్యంగా 'డీప్' ప్రాజెక్టు
- అందరికీ సమర్థంగా ఉపయోగపడే మందుల తయారీకి దోహదం!



సాక్షి, హైదరాబాద్: మధుమేహంతో పాటు గుండె జబ్బులు, మానసిక ఆరోగ్య సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ పెరుగుతున్నాయి. మరి ముఖ్యంగా భారత్ ఇతర ఆసియా దేశాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. కానీ వ్యాధి సోకడం, లక్షణాల వంటివి ప్రాంతాన్ని బట్టి మారిపోతున్నాయి. మధుమేహాన్ని తీసుకుంటే టైప్ 2 మధుమేహం అమెరికా లాంటి దేశాల్లో ఊబకాయం ఉన్నవారిలో కన్పిస్తుంది. కానీ భారత్‌లాంటి కొన్ని దేశాల్లో బక్కపలుచగా ఉన్నప్పటికీ దీనిబారిన పడుతున్నారు. అందరిలోనూ జన్యువులు ఒకే రకంగా ఉన్నప్పటికీ జన్యువుల పైభాగంలో వాతావరణం, సూక్ష్మ పోషకాల లోపం వల్ల చోటు చేసుకుంటున్న కొన్ని మార్పుల కారణంగా ఈ తేడాలు చోటు చేసుకుంటున్నట్లు తేలింది. మరోవైపు వీటి కోసం తయారు చేసిన ఔషధాలు ఒక ప్రాంతంలో పనిచేస్తే మరొక ప్రాంతంలో పని చేయడం లేదు. మధుమేహంతో పాటు గుండె జబ్బులు, మానసిక సమస్యలకు పైన పేర్కొన్న తేడాలు కారణమవుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, అందరికీ సమర్థంగా ఉపయోగపడే మందులు కనిపెట్టేలా, మానవజాతి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ఓ మహా ప్రయత్నం మొదలైంది. భారత్ సహా నాలుగు దేశాల్లోని 13 వేల మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వ్యాధి ముప్పును తగ్గించే ప్రాజెక్టుకు శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. డైవర్స్ ఎపిజెనిటిక్, ఎపిడెమియాలజీ పార్టనర్‌షిప్ (డీప్) అని పిలుస్తున్న ఈ అంతర్జాతీయ ప్రాజెక్టులో ఇరవై పరిశోధక బృందాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరవై సంస్థలు భాగస్వాములు కానున్నాయి.

ఇప్పటివరకు 'యూరప్' సమాచారమే ఆధారం

ప్రజారోగ్యం విషయంలో ఇప్పటివరకూ జరిగిన పరిశోధనలకు అత్యధికంగా యూరోపియన్ మూలాలున్న మానవుల నుంచి సేకరించిన సమాచారమే ఆధారం. అంటే ఆరోగ్య సమస్యల పరిశోధనల్లో ఇతర ప్రాంతాల వారి భాగస్వామ్యం చాలా తక్కువన్నమాట. అంతేకాకుండా జన్యుపరమైన, వాతావరణ సంబంధిత వైవిధ్యతను కూడా ఇప్పటివరకూ పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. కొంచెం వివరంగా చెప్పాలంటే మన జన్యువులు, మనం ఉన్న వాతావరణం ప్రభావం.. మనకొచ్చే వ్యాధులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఇప్పటివరకూ స్పష్టంగా తెలియదన్నమాట. కాగా 'డీప్' ప్రాజెక్టు ఈ లోటును భర్తీ చేస్తుందని అంచనా వేస్తున్నారు. దాదాపు రూ.25 కోట్ల ఖర్చుతో ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టు కొనసాగనుంది. సీసీఎంబీ నేతృత్వంలో యూకేలోని బ్రిస్టల్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్,, ఎంఆర్‌సీ యూనిట్, ద గాంబియాలు ఇందులో పాల్గొననున్నాయి. అధ్యయనంలో భాగంగా కొన్ని వ్యాధులు కొన్ని ప్రాంతాల వారికి లేదా సమూహాలకు మాత్రమే ఎందుకు వస్తాయన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. దీనిద్వారా ఒక ప్రాంత ప్రజల కోసం తయారు చేసిన మందులు ఇతర ప్రాంతాల వారికీ సమర్థంగా ఉపయోగపడతాయా? లేదా? అన్నది స్పష్టమవుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్త ఆర్. గిరిరాజ్ ఛాండక్ తెలిపారు.

భారతీయులకూ భాగస్వామ్యం



జన్యువులు – జన్యువులకు మధ్య, జన్యువులకు పర్యావరణానికి మధ్య జరుగుతున్న కార్యకలాపాలు అర్థం చేసుకునేందుకు మధుమేహం, గుండెజబ్బుల వంటి అసాంక్రమిక వ్యాధులకూ వీటికి ఉన్న సంబంధాలను అర్థం చేసుకునేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఈ ప్రాజెక్టులో భారతీయులను కూడా చేర్చుకోవడం ఎంతో ఆసక్తికరమైన అంశం.


– డాక్టర్ ఆర్.గిరిరాజ్ ఛాండక్, 'డీప్' ప్రాజెక్ట్ హెడ్

సీసీఎంబీ ఎప్పుడో చెప్పింది...

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) చాలాకాలంగా భారతీయుల జన్యు నిర్మాణంలోని తేడాలు.. టైప్–1, టైప్–2 మధుమేహం, క్లోమ గ్రంధి వ్యాధులపై వాటి ప్రభావం గురించి పరిశోధనలు చేస్తోంది. విటమిన్ బీ–12, ఫొలేట్ తదితర సూక్ష్మ పోషకాలు, పర్యావరణాలు.. వ్యాధులు సోకేందుకు ఉన్న అవకాశాలపై ప్రభావం చూపుతున్నట్లు కూడా సీసీఎంబీ నిరూపించింది. పర్యావరణం నుంచి అందే సంకేతాల ఆధారంగా డీఎన్ఏలో వచ్చే కొన్ని రకాల మార్పులు మనిషి ఆరోగ్యం, వ్యాధులకు కారణమవుతున్నట్టుగా కూడా సీసీఎంబీ ప్రయోగాత్మకంగా రుజువు చేసింది. అంటే ఇప్పటి వరకూ జరిగిన పరిశోధనలన్నీ యూరోపియన్లపై ఆధారపడి జరిగినవి కావడంతో వారికి పనిచేసే మందులు, చికిత్స పద్ధతులు కచ్చితంగా మనకూ పని చేస్తాయన్న గ్యారెంటీ లేదన్న మాట. అలాగే మనకు పనిచేసే మందులు బ్రిటిష్ వారికి లేదా అమెరికన్లను అక్కరకు వస్తాయా? అన్నది కూడా ప్రశ్నార్థకమే అన్నమాట.

చలికాలంలో భగభగలు

- సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు
- మరో వారం పాటు ఇదే తరహా వాతావరణం
- వాతావరణ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భగభగమంటున్నాయి. సాధారణంగా చలికాలంలో క్రమంగా తగ్గాల్సిన ఉష్ణోగ్రతలు వేసవి కాలం మాదిరి నమోదవుతున్నాయి. ప్రస్తుతం నైరుతి సీజన్ ముగిసి, ఈశాన్య రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలిస్తుంటాయి. ఇంకా ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనప్పటికీ సాధారణంగా ఈపాటికి వాతావరణం చల్లబడుతుంది. కానీ రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలను మించిపోతున్నాయి. సగటున 3–5 డిగ్రీ సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో రాష్ట్రంలో వాతావరణం వేసవి సీజన్‌ను తలపిస్తోంది. వాతావరణంలో తేమ తగ్గడంతో ఉక్కపోత పెరుగుతుండగా.. ఆకాశం మేఘాలు లేకుండా నిర్మలంగా ఉంటుండటంతో ఉష్ణోగ్రతలు సైతం అధికంగా నమోదవుతున్నాయి.

మరో వారం ఇంతే...

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసినప్పటికీ... తిరోగమన ప్రక్రియ చివరి దశలో ఉంది. మరో మూడు రోజుల్లో రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో నిష్క్రమించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత వారం రోజులకు ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో వాతావరణంలో మార్పులు ఉంటాయని, దీంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే గరిష్ఠ ఉష్ణోగ్రత ఖమ్మంలో 36.2 డిగ్రీ సెల్సియస్ నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత అత్యల్పంగా మెదక్‌లో 18.3 డిగ్రీలుగా నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు చాలాచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు అధికంగా నమోదవుతోంది. ఖమ్మం జిల్లాలో సాధారణం కంటే 4.6 డిగ్రీలు అధికంగా నమోదు కాగా, భద్రాచలంలో 3.5 డిగ్రీలు, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, హనుమకొండలో 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడా వర్షపాతం నమోదు కాలేదు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పొడివాతావరణమే ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

నిజాం షుగర్సే ప్రధాన ప్రచారాస్త్రం

- మరో బాండ్ రాసిచ్చేందుకు సిద్ధమైన ఎంపీ అర్వింద్
- తాము అధికారంలోకి వస్తే తెరిపిస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు బోర్డు అంశం తరహాలోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీల అంశం ఉత్తర తెలంగాణలో రాజకీయ పార్టీలకు ప్రధాన ప్రచారాస్త్రం కానుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇందూరుకు పసుపు బోర్డు తీసుకొస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్ అనూహ్యంగా విజయం సాధించారు. ఈనెల 3న ప్రధాని మోదీ ఇక్కడకు వచ్చి పసుపు బోర్డు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బీజేపీకి ఆదరణ పెరిగింది. ఇదే తరహాలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడం, చెరుకు పంట విస్తీర్ణాన్ని పెంచడమనే అంశాన్ని ఎజెండాగా తీసుకుని మరొక బాండ్ రాసిచ్చేందుకు అర్వింద్ రంగం సిద్ధంచేస్తున్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీలు ఉమ్మడి నిజామాబాద్ (బోధన్), ఉమ్మడి కరీంనగర్ (జగిత్యాల జిల్లా ముత్యంపేట), ఉమ్మడి మెదక్ (ముంబోజిపల్లి) జిల్లాల్లో ఉన్నాయి. దీంతో బీజేపీ ఎంపీ అర్వింద్ పార్టీ అధినాయకత్వం, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తగిన కార్యాచరణ సిద్ధం చే స్తున్నారు. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని చెరుకు పాలసీని స్టడీ చేస్తున్నారు. యూపీలో మాదిరిగా చెరుకు పంట సాగుతో పాటు దాన్ని రెగ్యులేట్ చేసేందుకు షుగర్, బ్రౌన్ షుగర్, ఇథనాల్ అనే మూడు ఉత్పత్తుల తయారీకి ప్లాన్ చేస్తున్నారు. చెరుకుకు మద్దతు ధర ఇస్తున్న నేపథ్యంలో పశ్చిమ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదక ఖర్చు 30 శాతం ఎక్కువ ఉంటోంది. దీంతో షుగర్ ఎగుమతులు అంతగా చేయలేని పరిస్థితి. దీంతో ఇథనాల్ ఉత్పత్తి లక్ష్యంగా ఉత్తర తెలంగాణలో చెరుకు సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించేందుకు ఎంపీ అర్వింద్ ప్రణాళికలు సిద్ధం చేసుకుని పార్టీ నాయకత్వంతో ప్రకటించేందుకు సమాయత్తమవుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం తాము అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్ తెరిపిస్తామని హామీ ఇస్తోంది. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మాత్రం కేసీఆర్ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

మంచిరేవుల గుట్టల్లో మధ్యరాతియుగం చిత్రాలు!

ఆరు వేల ఏళ్ల కంటే పాతవిగా పేర్కొంటున్న పరిశోధకులు



సాక్షి, హైదరాబాద్: ఆ గుట్ట గుహలు, సమీపంలో ఉండే నీటితో నాటి ఆది మానవులది విడదీయరాని బంధం.. అందుకే ఆ నీటిలో నిత్యం కనిపించే తాబేళ్లు, చేపలను చూసి వాటిని గుహలోని రాళ్లపై చిత్రించారు. 6 వేల ఏళ్లకన్నా ముందే గీసిన ఆ బొమ్మల్లో కొన్ని ఇప్పటికీ.. హైదరాబాద్ శివార్లలో మంచిరేవుల సమీపంలోని ట్రెక్‌పార్క్ అవతలి గుట్టల్లో పదిలంగా ఉన్నాయి. ఇటీవల ఐఎస్‌బీకి విద్యార్థులు మీర్ ఒమర్ అలీ ఖాన్, రిషబ్ మందా ట్రెక్కింగ్ వచ్చినప్పుడు వీటిని చూశారు. ఈ విషయం తెలిసి తెలుగు వర్సిటీ చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంఏ శ్రీనివాసన్ తమ ఆరుగురు పరిశోధక బృందంతో వెళ్లి పరిశీలించారు. చిత్రించిన తీరు, ఉపయోగించిన రంగుల ఆధారంగా అవి మధ్య రాతియుగానికి చెందినవిగా గుర్తించారు. పెద్ద గుండుపై తాబేళ్లు, చేపలు, ఒక రేఖాచిత్రం, మరికొన్ని అస్పష్టమైన చిత్రాలు ఉన్నాయని శ్రీనివాసన్ తెలిపారు. ఆ గుట్ట భాగంలో రాతితో చేసిన నాటి పనిముట్లు కూడా ఉన్నాయని, ఈ ప్రాంతం ఆదిమానవ ఆవాసమని వివరించారు. గతంలో ఇక్కడికి చేరువలోని కోకాపేట, మరికొన్నిచోట్ల ఇలాంటి చిత్రాలు వెలుగుచూశాయన్నారు. హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని గుట్టలు ఆదిమానవుల మనుగడకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని చెప్పారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.